


ంధ్రపత్రిక
సచిత్ర వారపత్రి
ANDHRA PATRIKA
25 నయాపైస
24-4-5



ఆనగనగా ఒక రాజుకు ముగ్గురు కొడుకులు. ముగ్గురూ శుంఠలే. ఆరునెలల్లో వీరిని విద్యావంతులుగా చేస్తానని విష్ణుశర్మ అనే విద్వాంసుడు ప్రతిజ్ఞ చేశాడు. వినోద విజ్ఞానదాయకమైన కథలను వారికి బోధించాడు. ఆ కథలే "పంచ తంత్రం" పేరుతో ప్రసిద్ధి కెక్కాయి.

పంచతంత్రంలోని మొదటి నాలుగు భాగాలూ లోగడ 'ఆంధ్ర వార పత్రిక'లో బొమ్మల కథలుగా ప్రచురించాము. అయిదవ భాగమైన "అసంప్రేక్ష్యకారిత్వం" బొమ్మలకథ **1-5-57** సంచిక నుంచీ సీరియల్‌గా ప్రకటిస్తున్నాము. పాఠకులీ కొత్త సీరియల్ చదివి ఆనందించగలరని మా నమ్మిక.



సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 34
24-4-57

హేవిళంబి చైత్ర బహుళ దశమి బుధవారం


విషయానుక్రమణిక

ఘోర ప్రమాదం

ఈ నెల పదవ తేదీన భద్రాచలం వద్ద గోదావరిలో జరిగినపడవ ప్రమాదంఅత్యంత హృదయ విదారకమైనది. నాలుగు వందలమంది ప్రయాణీకులలో దాదాపు 70మందిమాత్రమేగండంగడిచి గట్టెక్కారు. 237 మంది శవాలు మాత్రమే దొరికాయి. మిగతావారు ఏమైపోయారో కూడా అంతులేదు. గడచిన రెండు మూడేళ్లలో దేశంలో రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు అనేకం సంభవించాయి గాని, ఒక్కసారిగా ఇంతమంది జనం దుర్మరణం పాలవడము ఎన్నడూ సంభవించలేదు.

శ్రీరామనవమి ఉత్సవాలను చూడడానికి ఈ యేడాది 50 వేలమంది భద్రాచలం వెళ్లారు. ఇంతమంది ప్రజలు ఒకచోట ఒకే కారణంమీద సమావేశమైనప్పుడు, వీరి కవసరమైన సదుపాయాలను, రక్షణను ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాధికారులదే. ఏ ప్రమాదాలూ సంభవించ నప్పుడు చక్కని ఏర్పాట్లు చేశామని, తమ అధికారులు బాగా పనిచేశారనీ ప్రభుత్వాలు తమ్ము తాము అభినందించు కుంటాయి గాని, పెద్దపెట్టున ఇలాంటి ప్రమాదాలు సంభవించి నప్పుడు బాధ్యతను ప్రమాదంతో ప్రత్యక్ష సంబంధం కలిగిన వ్యక్తులపైకి త్రోసివేయడం సబబు కాదు. ప్రత్యక్ష బాధ్యత ఎవరిదైనప్పటికీ, అసలు బాధ్యతను ప్రభుత్వమూ, అధికారులూ వహించక తప్పదు.

అన్ని వేలమంది యాత్రికులు భద్రాచలం వచ్చినప్పుడు వారిని నది దాటించడానికి అధికారులు ఏమి ఏర్పాట్లు చేశారు? ఎన్ని పడవలను సప్లయి చేశారు? రేవు దాటించే పని ఒక కంట్రాక్టరుకు అప్పగించారు. ఆ కంట్రాక్టరు మూడు పడవల్ని మాత్రమే ఉపయోగించాడు. రేవు సమీపంలో బోలెడు పడవలున్నప్పటికీ, అవి ఊరికే ఉండిపోయాయి గాని ఉపయోగపడలేదు. పోనీ తక్కువ పడవలే ఉన్నప్పుడు, నీటిమీద ప్రయాణం గనక, ఎక్కువమందిని ఎక్కించుకోకుండా అధికారులు ఎందుకు అరికట్టలేకపోయారు? 'ఓవర్ లోడ్' చెయ్యడంవల్లనే ఇంత ఘోరప్రమాదం జరిగిందనేది స్పష్టం. పైగా ఒక్కొక్క పడవలో రెండేసి వందలమందిని ఎక్కించుకుని, రెండు పడవలను ఒకదానితో ఒకదాన్ని అంటగట్టి నదిని దాటించ ప్రయత్నించాడు కంట్రాక్టరు. ఒడ్డుకు నూరు గజాలు లోపలికి పోయినతర్వాత, కంట్రాక్టరు, అతని బృందం యాత్రికులను ఒత్తిడి చేసి ఎక్కువ రేటు వసూలు చేయజూచాడట. యాత్రికులు ఎక్కువ రకము చెల్లించడానికి నిరాకరించడంతో, గలభా చెలరేగింది. నది మధ్యలో గలభా జరగడం విధిగా ప్రమాదానికి దారితీస్తుంది. ముందు ఒక పడవ వొరిగి నీళ్లు లోనికి రావడం ప్రారంభించాయి. దాంతో యాత్రికులు రెండో పడవలోకి దూకసాగారు. చివరికి రెండు పడవలూ మునిగి యాత్రికులంతా నీళ్ళలో పడ్డారు. కొంత



ఆంధ్ర శాసనసభ కాంగ్రెసు పార్టీకి మళ్లీ నాయకుడుగా ఎన్నికైన శ్రీ నీలం సంజీవరెడ్డి.

మందిని రక్షకదళాలు ఒడ్డుకు చేర్చాయి గాని, ఎక్కువగా శవాలే ఒడ్డుకు చేరాయి.

ప్రమాద వార్త తెలిసిన తర్వాత రాష్ట్రపతి, ఆంధ్ర గవర్నరు, శాసనసభ్యులు, మంత్రులు యావన్మందీ సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి అనివార్య కారణాల వల్ల తాము వెళ్లలేకపోయామని ప్రకటించి, విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగార్ని ప్రమాద స్థలానికి పంపించారు. వారుమాత్రం వెళ్లి ఏమి చేయగలరు? పడవ యజమానుల నిర్లక్ష్యంవల్లనే ప్రమాదం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు, చూడడానికి వచ్చిన బంధువులకు అవసర సహాయంచేసే ఏర్పాట్లు చేయించారు. ఇకముందు ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేశారు. ప్రమాదాన్ని గూర్చి విచారణ జరిపేందుకు ప్రభుత్వం పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ అధ్యక్షతను ఒక సంఘాన్ని నియమిస్తున్నది. ఈలోగా పడవ మనుషులను కొందర్ని అరెస్టు చేశారు. ఒక పోలీసు ఉద్యోగిపై చర్య తీసుకున్నారు.

ప్రమాదానంతరం ఎంత సానుభూతి ప్రకటించినా, ఎన్ని చర్యలు తీసుకున్నా, ఎన్ని వాగ్దానాలు చేసినా, పోయిన ప్రతిష్ఠ తిరిగి రాదు. జరిగిన నష్టం తీరదు. మృతుల బంధుమిత్రాదుల దుఃఖం ఉపశమించదు.

ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా, ఇకముందు అలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు వాగ్దానం చేయడం, ఆ ప్రమాదం జరిగిన స్థలంలో మాత్రం కొంత బందోబస్తు చేయడం పరిపాటిగా ఉంది. ఇప్పుడూ అలాగే భద్రాచలంవద్ద తగిన సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయవచ్చు. మృతుల కుటుంబాలకు తగిన సహాయం చేయవచ్చు. ప్రమాదానికి ప్రత్యక్షంగా బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవచ్చు. ఇదంతా మామూలుగా జరగవలసినపనే. కాని ఇంతటితో ప్రభుత్వం బాధ్యత తీరిపోదు. దేశంలో ఎప్పుడూ ఏదో స్థలంలో ఏవో ఉత్సవాలు, తిరుణాళ్ళు జరుగుతూనే ఉంటాయి. వీటికి దూరదూరాల నుంచి యాత్రికులు వస్తూనే ఉంటారు. కనుక ఆయా పుణ్యస్థలాలన్నిటా, ముఖ్యంగా ఉత్సవాలు జరిగే సమయాల్లో బందోబస్తు చేస్తూ, తమ కర్తవ్యం నెరవేర్చడం ప్రభుత్వ ధర్మం. ఇకముందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చేయాలంటే, ప్రస్తుత ప్రమాదానికి బాధ్యులైనవారిని శిక్షించి, మానవ ప్రాణాలతో చెలగాటమాడే వారందరికీ ఒక గుణపాఠం నేర్పాలి. బాధ్యత అధికారులదైనా, అనధికారులదైనా నిర్భయంగా అంగీకరించి, వారికముందు అలా ప్రవర్తించకుండా కట్టుదిట్టం చెయ్యాలి. అది కనీస ధర్మం. ★

నా నయా పైసా అనుభవం





పోస్టాఫీసులో నయాపైసాల విప్లవము

కార్డులు, కవరులు కొందామని పోస్టాఫీసుకు వెళ్ళాను. ఐదు కార్డులు తీసుకొని పావలా బిళ్ళయిచ్చాను. ఎంతసేపుచూచినా కాని యివ్వడు. కానీ యివ్వరేమండీ అని పోస్టుక్లర్కును అడిగాను. కార్డు ఖరీదు 5 నయాపైసలు–ఐదు కార్డులకు 25 నయాపైసలు–పావలా సరిపోయింది అన్నాడు క్లర్కు. అసలు నేను అనుకున్న దేమిటంటే పాతనాణెముల ప్రకారము లెక్క వేసి మనకు చిల్లర యిచ్చేప్పుడు మాత్రము పాత వాటికి బదులు క్రొత్త నయాపైసలు యిస్తారు అని. కాని యిప్పుడు చూస్తే కథ యిలా అడ్డంగా తిరిగింది. నయాపైసాలలో లెక్క చూపి కాని కొట్టేశారు. సరే ఇన్లాండు కవర్లు గూడా కొనాలగా, నయాపైసాలలో ఐదు ఇన్లాండు కవర్లకు ఎంత అవుతుందో చూద్దామని నా జేబులో వున్న నయాపైసా చార్టు తీసి చూచాను. రు. 0–1–6=9 నయాపైసాలు అని వున్నది. అప్పుడు ఐదు కవర్లకు 9 × 5=45 నయాపైసలు అయింది. చార్టు ప్రకారము 45 న. పై=రు. 0–7–3 అవుతుంది. 'ఓహో యిది చాలా బాగుంది, నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి–ఆ కాని యిందులో లాగుతానులే' అనుకొని రు. 0–7–3 యిచ్చి" ఐదు ఇన్లాండ్ కవర్లు యివ్వండి అన్నాను. "ఇంకా మూడు కానులు వస్తుంది" అన్నాడు క్లర్కు. "ఏమండీ కవరు 9 నయాపైసలే కదా, అంత ఎందుకవుతుంది" అన్నాను. కాదు, ఇన్లాండు కవరు 10 నయాపైసలు అన్నాడు. "ఇదేమిటరా నాయనా నేను చూడటము పొరబాటేమో" ననుకొని మళ్లీ నా చార్టు విప్పి నిదానముగా చూచాను. 'రు 0–1–6=9 నయాపైసలు' అని స్పష్టముగా కనుపించింది. "ప్రభుత్వము ప్రకటించిన యీ చార్టులో చూడండి అని చార్టు చూపించాను. "అదంతా మా కవర సరం, ఇన్లాండు కవరు ఖరీదు 10 నయాపైసలు, అంతే" అన్నాడు. ఇక మూడు కానులు యివ్వక తప్పింది కాదు, ఎట్లాగూ యింత దూరము వచ్చాము గదా స్టాంపులు గూడా తీసుకుందామని రు. 0–3–0 యిచ్చి "బుక్ పోస్టు స్టాంపులు యివ్వండీ" అన్నాను ఆరు అర్థణా స్టాంపులు యిచ్చాడు. రు. 0–0–6=3 నయాపైసలు ఆరు స్టాంపులకు 3 × 6=18 నయాపైసలు అయింది. రు. 0–3–0=19 నయాపైసలు. నాకు ఒక నయాపైసా వస్తుంది యివ్వండీ అన్నాను. ఆరుస్టాంపులకు మూడుఅణాలు సరిపోయింది అన్నాడు క్లర్కు. నాకు ఏమనాలో తోచలేదు. దొంగరాముడులో పూటకూళ్ళ పెద్దమ్మ గుర్తుకు వచ్చింది. కుండలో నీ అడుగూ బొడుగూ గీకి విస్తట్లో వడ్డించి "యిదే పరమాన్నమనుకో, యిదే పెరుగు అనుకో, యిదే పప్పుఅనుకో నాయనా" అన్నట్లుగా ఉంది. దొంగరాముడులో నాగేశ్వరావు పూటకూళ్ళ పెద్దమ్మ చేతిలో పావలా బిళ్ళపెట్టి "యిదే రూపాయి అనుకో, యిదే అర్థరూపాయి అనుకో" అన్నట్లుగా నేను గూడా ఒక అరిగిపోయిన కానీ యిచ్చి "యిదే వంద నయాపైసలనుకో యిదే 50 నయాపైసాలనుకో" అందామని పించింది. కాని వీరు ముందు డబ్బు తీసుకొందే కార్డులు, కవరులు యివ్వరు గదా! అది గాక అది సినిమాలో గనుక అలా జరిగింది. నేను గూడా అట్లాగే యిక్కడ చేస్తే వెంటనే ఫోనుచేసి పోలీసులను పిలిపిస్తారు. సరే మెల్లగా వెనక్కు తిరిగి ఇంటి ముఖము పట్టాను. వెనకనుండి ఎవరో "శాంతి యుతమైన నయాపైసాల విప్లవమంటేయిదేనాయనా" అంటున్నారు.

సి. హెచ్. వెంకటేశ్వర్లు, రాజమండ్రి

* * *

యథా రాజా తథా ప్రజా

ఆరోజు ఏప్రిల్ నాలుగవ తేదీ. కాఫీ హోటల్‌కు వెళ్ళను మామూలుగానే. రెండిడ్లీ కాఫీ పూర్తిచేసి నాలుగణాలు చెల్లించబోతే ఆ ప్రొప్రయిటరు ఇంకొక రెండు నయాపైసాలు తెమ్మన్నాడు. ఎందుకు రెండిడ్లీ కాఫీ పావలాయే కదా అన్నాను. అది పాతరోజులు. ఇప్పటిలెక్క ప్రకారం రెండిడ్లీకి 13 నయాపైసాలు, ఒక కాఫీ 13 నయాపైసాలు అన్నాడు. అదేమిటయ్యా ప్రభుత్వపు ఉత్తరువు ప్రకారం రెండణాలకు పన్నెండు నయాపైసాలే కదా అన్నాను. అవును పట్టీలో అలాగే వేసి ప్రభుత్వంవారు మాత్రం రెండణాల కవరు 13 నయాపైసాలు చేశారు అన్నాడు. ఏమిటి కారణం అంటే పన్నెండు నయాపైసల చొప్పున లెక్కగడితే వాళ్ళకు నష్టం వస్తుందిట. ఔను నిజమే ప్రభుత్వమే వాళ్ల పట్టీ ప్రకారం నడచుకోక పోతే వ్యాపారస్థులు మాత్రం పూరుకుంటారా అనుకున్నా. ఇంతలో ఇంకొకవ్యక్తిని కూడా ఇలాగే నిర్బంధిస్తే అది పెద్ద దెబ్బలాటగా మారడం జరిగింది. తరువాత సిగరెట్టు దుకాణం దగ్గరకు వెళ్ళి రెండు బర్కిలీ సిగరెట్లు అడిగేను. 7 నయాపైసాలన్నాడు. ఒకటే ఇమ్మన్నాను. 3 నయాపైసలడిగేడు. మరీ లెక్కయేమిటో నా కర్థం అవలేదు. ఇంకో సిగరెట్టు కొట్టులో నాలుగు నయాపైసలిస్తేగాని ఒక బర్కిలీ సిగరెట్టు ఇవ్వనన్నాడు. అంటే ఈయన కిష్టం వచ్చినట్లు ఈయన అమ్ముతున్నాడు కాబోలు. ఉదయమే గెడ్డాం గీసుకుందామని సెవెనోక్లాక్ బ్లేడు అడిగేను. 13 నయాపైసాలన్నాడు. రెండణాల బ్లేడు ఖరీదు 12 నయాపైసాలే గదా అన్నాను. రెండణాల కవరు పదమూడు నయాపైసాలెందుకు చేశారండీ ప్రభుత్వం

వారు అన్నాడు. సరే పోనీ పైసలూ ఇమ్మన్నా 7 నయాపైసాలడిగేడు. అసలు దాని అరు నయాపైసలే. కాని మనం కొనుక్కోక తప్పదుగా. కాబట్టి వారు అడిగిన ధర ఇచ్చేసి నోరుమూసుకు వచ్చేయ్యడమే. ఏమైనా అంటే ప్రభుత్వమే అలా చేసిందంటున్నారు. ఆ రోజు మధ్యాహ్నం సినిమా కెడదామని బస్‌కండక్టరును రెండణాల టిక్కెట్టు ఇమ్మని 12 నయాపైసాలిచ్చాను. పాపం అతను ఇచ్చేడు. ఓహో ఫరవాలేదు కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ప్రభుత్వమే మెరుగనుకున్నా.

ఇంక అక్కడ నుంచి ఈ నయాపైసాల మీద ఎన్నో ఆలోచనలు వెళ్లిపోయేయి నా బుర్రలో. నా ఆలోచనల ప్రకారం అణా, బేడా నాణాలతో సరకులు కొనుక్కునే వారికి చాలా నష్టం కనిపించింది. ఆ నష్టాల విలువలను కొన్ని ఉదాహరణలుగా ఇక్కడ తెలియ పరుస్తా:

ఇడ్లీ:-సాధారణంగా ఇడ్లీ ప్రతీవారికీ ఇష్టమే. మామూలు రేటు ప్రకారం ఒక ఇడ్లీ ఒక అణా, ఒక మనిషి ఒక రోజుకు ఒక ఇడ్లీ తింటే నెలకు రు 1-14-0 అవుతుంది. దీన్ని నయాపైసాలలో మారిస్తే 187 నయాపైసాలు. కాని ఇప్పుడు ఒక ఇడ్లీ ఏడు నయాపైసాలు చేసేరు. అంటే నెలకు 210 నయాపైసాలు. ఈ లెక్కబట్టి నెలకు 23 నయాపైసాలు నష్టమన్నమాట. ఇదే రెండిడ్లీ ఒకసారి తింటే కొంచం పరవాలేదు. అప్పుడు నెలకు రు 3-12-0 అవుతుంది. అంటే 375 నయాపైసాలు కొత్త లెక్క ప్రకారం 13 × 30=390 నయాపైసాలు. ఇక్కడ 15 నయాపైసాలు మాత్రమే నష్టం.

కాఫీ, టీ:- కాఫీ పదమూడు నయాపైసాలయింది. కాఫీ ఒక్క సారే తాగే వాళ్లకు పరవాలేదు. కాని అలవాటు తప్పించుకో లేక నాలుగైదుసార్లు తాగేవాళ్లు, పని లేక తాగేవాళ్లు, పాపం ఆకలికోసం చవుకగా పొట్టనింపుకొనే వాళ్లు చాల నష్టపోతారు. రోజుకు నాలుగుసార్లు కాఫీ తాగేవారికి నెలకు 60 నయాపైసాలు నష్టం.

కవరు:-ఎప్పుడో ఒక ఉత్తరం రాసేవారికి పరవాలేదుకాని ఎక్కువగా ఈవిషయంలో ఖర్చు పెట్టేవారికి నష్టం జాస్తీగానే కనిపిస్తుంది. ఇన్ని మాటలెందుకు. చిన్న నాణాలు ముఖ్యంగా ఒక అణా నుండి రెండణాలతో వ్యవహరించే జనానికి ఈ నయాపైసాలు నష్టం తెచ్చి పెడుతున్నాయనక తప్పదు. కాబట్టి ప్రభుత్వంవారు తాము ప్రకటించిన పట్టీ ఖచ్చితంగాను వారు అమలులో పెడుతూ అలాగే ప్రతివ్యాపారస్తుని ఆదేశించి ఎవరిష్టం వచ్చినట్లు వారు మార్చుకోకుండాచేస్తే! పేదప్రజలు సంతోషిస్తారు.

"శ్రావణి"—మద్రాసు

* * *

'డామిట్! మీకు లెక్కలురావు'

మా వూళ్లోకల్లా మొట్టమొదట నయాపైసాల చలామణి పోస్టాఫీసులో ప్రారంభమైంది. అసలీ నాణెములు ఎలావుంటాయో చూట్టానికని వెళ్లాను. పోస్టాఫీసు చాల రద్దీగా ఉంది. చాలమంది ఈ లెక్కలు బోధపడక ఆ పోష్టలు గుమస్తాతో తగువులాడుతున్నారు. పాపం అతగాడు చాల ఓపికతో అందరికీ నచ్చచెప్పతున్నాడు. ఇంతలోకే ఒక ఆంగ్లోఇండియన్ యువతివచ్చి, 10 కార్డులు తీసుకుంది. కాని ఆమెకు, ఈ పది కార్డులకు ఎన్ని నయాపైసా లివ్వాలో తెలియక తికమక పడుతూంది. ఎవరినైనా అడగడానికి, అభిమానం అడ్డంవచ్చి ఎవర్నీ అడగకుండా అలా గుడ్లు వప్పజెప్పి చూస్తూ ఉంది. ఆ గుమస్తామట్టుకు "మీరు 10 కార్డులు తీసుకున్నారు. ఒకొక్క కార్డు 5 నయాపైసలకు అమ్మమని మాకు గవర్నమెంటువారి ఉత్తరవు, కాబట్టి 10 కార్డులకు మొత్తం 50 నయాపైసాలయింది," అని అంటున్నాడు. కాని ఆమెకిదేమీ బోధపడ లేదు సరిగదా, ఆ గుమస్తా తనను మోసగిస్తున్నాడని అరచింది. అంతలోకే ప్రక్కనున్న పంజాబీ యువకుడొకడు పెద్ద హీరో వలె ముందుకువచ్చి "దీనికింత కష్టమెందుకండీ? పది కార్డులు పదిమూడులు, ముప్పై కానులు. మన గవర్నమెంటు రేటుప్రకారం ఒకొక్క పాత కానీకి 2 నయాపైసలు. అలా 3 × 2=60 నయాపైసలు," అన్నాడు దీనితో ఆవిడకు శివమెత్తినట్లయింది. "ఏమిటండీ, ఈ చచ్చు భారతప్రభుత్వం? ఏమిటీ మార్పులు? ఒకరు 50, మరొకరు 60 నయాపైసా లిమ్మంటారేమిటి?" అని ఏమేమో ఇంగ్లీషులో అన్నది.

వెంటనే, నేను మన ప్రభుత్వాన్ని తిడుతుంటే సహించలేక, శాంతంగానే ఇలా మాట్లాడ్డం మొదలెట్టా; "చూడండి, మేడమ్ ఈ మారకం రేట్లపట్టీ" అని చూపించి, "మీరు 10 కార్డులకు 30 కానులు ఇవ్వవలసి యుంది. అంటే 0-7-6 అన్నమాట. ఈ రేట్లపట్టీ ప్రకారం 0-7-6 అంటే 47 నయాపైసాలు కాబట్టి మీరు 47 నయా......" అని ఇంకా చెప్పబోతుంటే, ఆమె కోపంతో ఆ కార్డులు గుమస్తాముందు పడేసి "డామిట్! ఈ భారతీయుల కొక్కరికీ లెక్కలురావు" అని చరచరా వెళ్లిపోయింది కార్డులు కొనకుండానే. నాకు ఏడవాలో నవ్వాలో కూడా తెలియలేదు.

ఆ గుంపులోనే ఉన్న మరో ముసలాయన అందుకున్నాడు. "అవును నిజమే పాపం! మీ ముగ్గురి లెక్కలు ఆమెకు కరెక్టుగానే కనిపించాయి, అందుకే ఎంత ఇవ్వాలో తెలియకవెళ్లిపోయింది."


శ్రీ రామదాసు భాస్కరరావు,
బిలాస్‌పూర్. (మధ్య ప్రదేశ్)

'నయాపైసా నష్టపోయాను'

ఆరోజు ఉగాది. ఉత్తరం ఒకటివ్రాసి పోస్టుచేద్దామనే తలపుతో జనరల్ పోస్టాఫీసుకు వెళ్ళాను నయాపైసలు అయిపోయినవన్నారు. కవరువెల 13 నయాపైసలు అంటే మనం రెండణాల కానీఇస్తే మనకి ఒక నయాపైసా తిరిగివస్తుంది. వాళ్ళదగ్గర నాదగ్గర ఆ నయాపైసలు లేవు. మనం ఎందుకు నష్టపోవలెననే ఉద్దేశ్యంతో ఆరోజు ఉత్తరం పోస్టుచేయటం మాని వేశాను. మర్నాడు ఉదయం ఆఫీసుకు వెళ్ళినపుడు మాకు దగ్గరలోయుండే పోస్టు ఆఫీసుకువెళ్లి అడుగుతే కవరు 13 నయాపైసలని, నయాపైసలు మాత్రం తనవద్ద లేవని చెప్పినాడా పోస్టల్‌క్లర్కు, ఆఫీసుకు తిరుగుముఖం పట్టేను. సరిగా మధ్యాహ్నం రెండుగంట లయింది. పోస్టులో ఉత్తరాలు వేయుటకు కాలం ఇక 5 నిముషములు మాత్రమే యున్నది. మరల పోస్టాఫీసుకు వెళ్ళాను. నయాపైసలు కొద్దిగా వచ్చినవని, వెంటనే అయిపోయినవని గుమాస్తా తెలియజేశాడు. ఇక ఏమి చేస్తాను? సరేనని రెండణాల కాణీ చెల్లించి ఒకకవరు కొనవలసి వచ్చింది. నూతన సంవత్సర తొలిదినాన ఒక నయాపైసా నష్టపోవలసి వచ్చింది. ఇదీ ఆనాటి నానయాపైసా అనుభవం. ★

బి. వి. స్వామి, హైదరాబాదు.

అపర బుద్ధి



రాత్రి ఎనిమిది గంటలకు పాండ్య మళ్ళీ నాకోసం ఆసుపత్రికి వచ్చాడు. ఆయన గదిలో ప్రవేశించగానే, ఒకపని కల్పించి అక్కడవున్న నర్సును బయటికి పంపాడు. పాండ్య తన కుర్చీ నామంచం దగ్గరకు ఈడ్చుకుని కూచున్నాడు. ఒక నిమిషం వుండి లేచి బయటికి వెళ్లాడు. ఆయన తిరిగి లోపలికి వచ్చేటప్పుడు మా కంపెనీ మేనేజింగు డైరెక్టరు ఆయన వెంట వచ్చాడు. ఒక ప్రభుత్వ న్యాయవాది కూడా వాళ్లవెంట వచ్చాడు. మేనేజింగు డైరెక్టరు కుర్చీలో కూచున్నాడు. న్యాయవాది, పాండ్యా నిలుచున్నారు. పెద్ద కేసుల సందర్భంలో విల్లులురాయటానికీ, వాఙ్మూలాలు తీసుకోవటానికీ ఆయనను పిలుస్తారు. మొదట మేనేజింగు డైరెక్టరే సంభాషణ ప్రారంభించాడు.

"కృష్ణమోహన్!" అని పిలిచాడు ఆయన. కళ్లు ఆయనవైపు తిప్పి చూశాను.

"ఈవిషయం ఇతరులకు ఎవరికైనా చెప్పావా?"

"పాండ్య తప్ప ఇతరులెవరూ ఎరగరు"

"ఇంకెవ్వరికీ తెలియదన్న మాట"?

"మానవమాత్రుడికి తెలియదు—భగవంతుడికి తప్ప!

"ఇక్కడెవరైనా పోలీసులు ఉన్నారా?

"ఉన్నారు. కాని బయట హాలులో. వాళ్లు నన్ను గురించి ఏవో గుసగుసలాడుకుంటున్నారు. అక్కడవున్న నర్సు వాళ్లని లోపలికి రానివ్వదు."

అందరూ ఒకరిముఖం వైపు ఒకరు చూసుకున్నారు.

"ఇప్పుడు మనం ప్రారంభించ వచ్చునను కుంటాను. పాండ్యా! నీవు వివరంగా చెప్పు."

పాండ్య చెప్పటానికి నోరు తెరవబోయాడు. మాట్లాడవద్దని న్యాయవాది వారించి, మేనేజింగు డైరెక్టరును అవతలికి తీసుకొని వెళ్లాడు. పాండ్యను కూడా వాళ్లు పిలిచారు. వాళ్లు మాట్లాడుకున్న మాటలు నాకు స్పష్టంగా వినపడలేదు.

వాళ్లు నిర్ణయం చేసుకున్న ఒక విధానాన్ని నాకు చెప్పటానికి వచ్చారని గ్రహించాను. అందరూ ఏమీ చెప్పకుండానే వెళ్ళిపోయారు. వెళ్లేటప్పుడైనా నన్ను పలకరించలేదు. వాళ్ళ ప్రవర్తన విచిత్రంగా వుంది. నేను ఒక వింత మృగమైనట్టు, నా ముఖాన గాయం తగిలితే చూడటానికి ఇష్టంలేక వెనుకకు తిరిగినట్టు వెళ్ళిపోయారు!

తుమ్మలపల్లి సీతారామారావు

వాళ్లు వెళ్ళిన తరువాత, పాండ్య వచ్చి మళ్లీ కుర్చీలో కూచున్నాడు.

"కృష్ణమోహన్! ఎలాంటి పనిచేశావు?" అన్నాడు.

"నాకు తెలుసు," అని బదులు చెప్పాను.

"ఆ విషయం మనం మాట్లాడవలసిన అవసరం లేదనుకుంటాను."

"అవసరం లేదు."

"నాకు చాలా విచారంగా వుంది, కృష్ణమోహన్! నాకు నీ మీద వున్న అభిమానం, నీ తెలివి తేటలలో నాకున్న విశ్వాసం నీవు ఎరగనివికావు."

"ఎరుగుదును."

"సాధారణంగా నేను ఎవరిపైనకూడా నాకున్న అభిమానాన్ని బహిరంగంగా వెల్లడించను. నా వ్యాపారంలో ఇది పనికి రాదు. మానవజాతిలోనే సహజంగా వక్రగుణం వున్నట్టు కనపడుతుంది."

"నాకు తెలుసు. మీరు నన్ను ఎంతో అభిమానంతో చూశారు-విశ్వసించారు. మీరు నా మీద చూపించిన విశ్వాసానికి అనుగుణంగా లేదు నా ప్రవర్తన."

"ఇప్పుడు మనం ఆవిషయం మాట్లాడటం లేదు."

"అయితే మాట్లాడవలసింది ఏమీ లేదు. మీరు ఆమెను చూశారా!"

"చూశాను. ఆమెనేకాదు; అతణ్ణీ, ఆమె సవతి తల్లినీ కూడా చూశాను."

"ఆమె ఏం చెప్పింది?"

"ఏమీ చెప్పలేదు. ఆమెతో నేనూ ఏమీ చెప్పలేదు. ఆమె అభిప్రాయం తెలుసుకోవాలనే వెళ్ళాను. నిన్న రివాల్వరుతో కాల్చింది మధుసూదన్ అని ఆమె అభిప్రాయ పడుతున్నది."

"ఎందుకు?"

"అసూయ చేత."

"నీ పరిస్థితికి ఆమె ఆందోళన పడుతున్నది. ఆమె మొదట నిన్ను చూసినప్పుడు నీకు బాగా దెబ్బతగలలేదనుకుంది."

"చాలా సంతోషం."

"దీనివల్ల మధుసూదన్ తననే ప్రేమిస్తున్నాడనే విషయం కమలాక్షికి రూఢి అయింది. అలా అనుకోవటంలో ఆమెతప్పు లేదు."

"ఔను."

"నీ స్థితికి ఆమె చాలా విచారపడుతున్నది. నీ మీద ఆమెకు ప్రేమ ఉన్నట్లే కనపడుతుంది."

"ఔను."

"నీకు తెలియకుండా ఆమెనిన్ను అనుసరించింది. ఆమెనిన్ను చూసి మధుసూదన్ అనుకుంది. అసలు విషయం ఇంతే."

"ఈ విషయం నాకు ఇంతకు పూర్వమే స్ఫురించింది."

"నేను అతనితో మాట్లాడాను."

"అతడక్కడ ఎందుకు వున్నాడు? ఏం చేస్తున్నాడు?"

పాండ్య ఆలోచించటం ప్రారంభించాడు. అప్పటికి బాగా చీకటిపడింది. గదిలో దీపం వెలుగుతూంది.

"ఇందులో ఒక కథవుంది?"

"ఏమిటది?"

"నిన్ను ఒక భయంకరమైన తాచుపాము తరుముకు వస్తూంది. ఆమె-కోమలం. ఆమె భయంకరమైన స్వభావం గలవ్యక్తి. ఆమె మనస్తత్వంలో ఒక విచిత్రమైన ప్రత్యేకత కనపడుతుంది. ఆమె చర్యలను ఊహిస్తే, నాశరీరం కంపిస్తుంది. ఆమె మనస్తత్వం పరిశోధించవలసింది రోగతత్వశాస్త్రంలో నిపుణుడైన వైద్యుడు. ఆ శాస్త్రంలో దీని కోక పేరువుందని గుర్తు."

"ఏమిటిది?"

"పేరు నాకూ తెలియదు. నీవు ఆధునిక మనస్తత్వ శాస్త్రం చదవాలి. కొందరు వ్యక్తుల విచిత్ర ప్రవర్తనకు, స్వభావానికి అందులో కారణాలు కనపడుతవి. ఈ విషయమై మనమే నేజింగుడైరెక్టరుతో మాట్లాడాను. దీనిని మేధాసంపద అధికమైనవాళ్ళు చెప్పే శాస్త్ర మంటారు. దీని ఫలితంగా మనం కొన్ని కొత్త విషయాలు తెలుసుకోవచ్చు."

"నాకు అర్థం కావటంలేదు."

"తర్వాత తెలుస్తుంది...మధుసూదన్ కమలాక్షిని ప్రేమించటంలేదు."

"ప్రేమించటంలేదా?"

"అతడు ఆమెను అయిదారు సంవత్సరాలనుంచి మాత్రమే ఎరిగున్నాడు. శానిటోరియంలో అతని తండ్రి పెద్ద డాక్టరు. అక్కడ కోమలం హెడ్ నర్సుగా వుండేది."

"ఈ విషయం నాకు జ్ఞాపకంవుంది."

"మధుసూదన్ ఆమెను అక్కడ కలుసుకున్నాడు. ఆమె నిర్లక్ష్యంవల్ల ముగ్గురు పిల్లలు మరణించారు. డాక్టర్ చంద్రశేఖర్ మొదటి భార్యకూడా అక్కడే మరణించింది. వీటివల్ల డాక్టరు ప్రతిష్ఠ దెబ్బతింది. అప్పుడు మధుసూదన్ దీనికి కారణం ఏమిటో తెలుసుకోవాలని రహస్యంగా అన్వేషణ ప్రారంభించాడు."

"ఇదా సంగతి!"

"మధుసూదన్ డాక్టరేటు డిగ్రీకి పరిశోధన ప్రారంభించినప్పటికీ వీలైనప్పుడల్లా, అతడు కోమలాన్ని కలుసుకుని మాట్లాడుతూనేవున్నాడు. అతడికి ఇదివరకే ఆమెతో పరిచయంవుంది. అక్కడికి వెళ్ళినపుడు, కమలాక్షిని చూశాడు. మొదటి చూపులలోనే ఇద్దరూ ప్రేమించుకున్నారు. అంతటితో కోమలాన్ని గురించి మధుసూదన్ ప్రారంభించిన అన్వేషణ ఆగిపోయింది. కోమలాన్ని తరుచు కలుసుకోవటంవల్ల కమలాక్షి బాధపడుతుండేది. ఆమె మనసుకు బాధ కలిగించటం అతడికి ఇష్టంలేదు. కోమలం దుష్టప్రవృత్తివల్ల మధుసూదన్ వాళ్ళ ఇంటికి వెళ్ళటం మానేశాడు. కమలాక్షిని అతడు బయట కలుసుకుని మాట్లాడేవాడు. కోమలం ఈ సంగతి గ్రహించి ఆమెకు అతడిమీద అసహ్యం కలిగించే కల్పితకథలు చెప్పింది. ఆమె ఇలా ప్రవర్తించటానికి కారణం కనపడదు. ఈ సంఘటన జరిగే నాటికి మధుసూదన్, కమలాక్షి ఇద్దరూ దూరంగా సంబంధంలేకుండా వుండాలని ఆమె అనుకుని వుంటుంది. తెలుస్తున్నదా?"

"ఊ."

"మధుసూదన్ ఈవిషయం గ్రహించాడు. అందువల్లనే అతడు కమలాక్షిని దూరం చేశాడు. అతడు తనవద్దకు రావటానికి కోమలం అభ్యంతరం పెట్టలేదు. అప్పటివరకు కోమలం, కమలాక్షి సంరక్షకురాలు. కమలాక్షికి వివాహమైన తరువాత, ఆమెభర్త సంరక్షకుడౌతాడు. ఇటువంటి సంబంధం ఏర్పరచుకోవటంవల్ల చిక్కులు సమసిపోతవని అతడి అభిప్రాయం. తరువాత కమలాక్షి..."

"కమలాక్షి విషయం."

"ఆమె నీకు సన్నిహితురాలైంది. ఈ విషయం మధుసూదన్ ఎరగడు."

"తరువాత."

"ఆఖరు రాత్రి జరిగిన సంఘటన. మధుసూదన్‌కు తెలియకుండా కమలాక్షి వెంబడించింది. నీవు అతడికారు తీసుకొని వెళ్ళావు. కారునడుపుతున్నది మధుసూదనే అనుకుంది ఆమె. కాని అతడు తన గదిలోనే ఉన్నాడు. నీకారు బయలుదేరేసరికి, ఆమె తన కారులోవుంది."

"ఔను ఆమెకారు కనపడింది."

"ఆనాటి మధ్యాహ్నం కోమలం, పార్కు రోడ్డు ఆ పరిసరాలు మొదలైన వాటిపై సంభాషణ జరిపిన తరువాత, ఆమె ఏం చేస్తుందో తెలుసుకోవాలనే కుతూహలం అతడికి కలిగింది. అతడికి నిద్రపట్టలేదు. వెంటనే మేడదిగి కారుషెడ్‌కు వచ్చాడు. తన కారుషెడ్‌లో లేదు. స్విచ్ తాళంచెవి ఒకటి కమలాక్షి దగ్గర వుంది. అతడు నిరుత్సాహపడ్డాడు. కమలాక్షి కారు తీసుకొనివెళ్ళి వుంటుందనుకున్నాడు. వెంటనే టాక్సి పిలిచి పార్కు దగ్గరకు వెళ్లాడు. ఆమెకు చెప్పిన వివరాలు మరచిపోయాడు. కాలినడకన రోడ్డుమీద వెళ్ళాడు. అతడు అనుకున్న దారి తప్పాడు.

★ అపరబుద్ధి ★

తుపాకి కాల్చిన మోత వినపడింది. అతడు కారు దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. మధుసూదన్‌ను ఎవరో కాల్చారనుకుని ఆమె కారు దగ్గరకు వచ్చింది."

"ఇప్పుడు నాకు అర్థమైంది."

"కోమలం ఉన్మత్తురాలు. ఈ విషయం నాకు మధుసూదన్ కూడా చెప్పాడు. ఆమె హత్యలు చేయటానికి జంకదని అన్నాడు. ఆమెవల్ల మరొక ముఖ్యవిషయం తెలుసుకోవాలని అతడు అన్నాడు."

"అయితే..."

"నీ నేరం రుజువవుతుంది!"

"ఆ సంగతి నాకు తెలుసు."

"ఈ విషయాలన్నీ ఈ మధ్యాహ్నమే తెలిసినవి. అప్పటి వరకూ మేనేజింగు డైరెక్టరు ఇది ఇంకా ఆత్మహత్యే అంటున్నాడు"

"మీ నిర్ణయం సరి అయింది."

"ఈ కేసు ఎలాగైనా విచారణకు రాకుండా చేయాలని ఆయనతో చెప్పి చివరికి ఒప్పించాను."

"మీరు దీన్ని కప్పిపుచ్చలేరు."

"ఔను కప్పిపుచ్చలేము. కంపెనీ ఏజంటు హత్య చేశాడని రెండువారాల నుంచి పత్రికల్లో కథలుపడుతున్నవి. విషయం దేశమంతా వ్యాపించి వుంటుంది. అయినా విచారణ మరొక విషయం."

"ఔను."

"నీవు ఒక వాఙ్మూలం ఇవ్వాలి. జరిగిన వివరాలన్నీ విపులంగా అందులో తెలియపరచాలి. ప్రభుత్వ న్యాయవాది ఎదట దాని మీద నీవు సంతకం చేయాలి. దాన్ని వచ్చే గురువారం నాడు రిజిష్టరు పోస్టుద్వారా నాకు పంపాలి. అది శుక్రవారం నాడు నాకు అందుతుంది."

"వచ్చే గురువారమా?"

"ఔను! ఈ లోపల, మొన్న జరిగిన కాల్పునుగురించి తెలుసుకుంటారు. నీకు దెబ్బ తగలటంవల్ల, కోర్టుకు హాజరు కాలేకపోవటానికి మనకు కారణం కనపడుతుంది. నీకు ఓడలో నేను చెప్పే మారు పేరుతో ప్రయాణంచేయటానికి ఒక సీటు రిజర్వు చేయిస్తాను. ఓడ దక్షిణ ప్రాంతానికి వెడుతుంది. నీవు వెంటనే దానిలో బయలుదేరి వెళ్లాలి. నీవు వెళ్ళిన తరువాత, నీ దగ్గర నుంచి వచ్చే వాఙ్మూలాన్ని పోలీసు అధికారులకు పంపిస్తాను. నేను నీకు చేయగలిగిన సహాయం ఇదే. నీవు నాకు ఎదురు తిరగటానికి ప్రయత్నిస్తే, నా కేమీ తెలియదని చెపుతాను. దీనికి సాక్ష్యం అవసరం లేదు. ఇది మన ఇద్దరి మధ్యా దాచవలసిన రహస్యం. తెలిసిందా?"

"సరే. మీరు చెప్పినట్లు చేస్తాను."

"నీ వాఙ్మూలం పోలీసు అధికారులకు అందగానే, నిన్ను పట్టుకున్న వాళ్ళకు ఐదు వేల రూపాయలు బహుమానం ఇస్తామని పత్రికలలో ప్రకటిస్తాము. నిన్ను ఎవరైనా పట్టుకుంటే, నీవు విచారణకు హాజరు కావలసి వుంటుంది. అప్పుడు నీకు మరణశిక్ష తప్పదు. నీవు పట్టుబడకుండా వుండే ఏర్పాటు చేశాము. ఈ కేసు విచారణకు రాకూడదనే ఉద్దేశంతో మేము ఇలా ఆలోచించాము. నీకు అంగీకారమేనా?"

"సరే."

"నీవు ఓడలో ఎక్కటానికి పూర్వం, రిజిష్టరుద్వారా నా పేర పంపిన ఉత్తరానికి పోస్టు రసీదు నాకు ఇవ్వాలి."

"ఆమె సంగతి?"

"ఎవరు ఆమె?

"కమలాక్షి."

"తగిన ఏర్పాటు చేశాను."

"ఇంకొక విషయం."

"ఏమిటది?"

"కమలాక్షి విషయం నా కేమీ తెలియ లేదు. ఈ కేసులో తీర్పు చెప్పేవరకు, కమలాక్షిని మధుసూదన్‌ని, నిర్బంధంలోనే వుంచుతారా? ఈ కేసు అసలు విచారణకు రాదుకదా? ఆమె విషయమై నాకు మీరు సంపూర్ణమైన హామీ ఇవ్వాలి. లేకపోతే, మీరు కోరిన వాఙ్మూలం నేను ఇవ్వను. కేసు విచారణకు వస్తుంది. ఆమె విషయం నాకు నమ్మకం కలిగించాలి. తెలిసిందా?"

"మధుసూదన్ నిర్బంధంలోనే వుంటాడు. అతడు దానికి ఒప్పుకున్నాడు."

"నేను ఆమెసంగతి అడుగుతున్నాను. వినపడిందా?"

"ఆమెను విడుదల చేశారు."

"ఏమిటి?"

"జామీనుమీద విడుదలచేశారు. నీవు ఆమెకోసం ప్రాణత్యాగం చేయవలసిన అవసరం లేదు."

"ఆమెకు నావిషయం తెలిసిందా?"

"లేదు. నేను ఆమెకు ఏమీ చెప్పలేదు."


అతడు చేతిగడియారం చూసుకొని, వెళ్ళటానికి లేచాడు. నేను కళ్ళు మూసుకున్నాను. ఎవరో నాదగ్గరకు వచ్చినట్టు అడుగులచప్పుడు విని తెలుసుకున్నాను. కళ్ళు తెరిచాను. నా ఎదుట కమలాక్షి నిలబడివుంది.

"మీకు జరిగిన ప్రమాదానికి చాలా విచారిస్తున్నాను."

"ఇప్పుడు ఏమీ ప్రమాదం లేదు."

"మధుసూదన్‌కు మనవిషయం తెలుసునని నేను అనుకోలేదు. అతడు తెలుసుకొన్నట్టున్నాడు. తొందరమనిషి."

"అతణ్ణి ప్రేమిస్తున్నావా?"


ఆరోగ్యవంతులైన జనులు ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు
—అది ప్రతిదిన *మలినములోని
క్రిములను కడిగివేయును!
*మనకు ప్రతిదినం తార్పపడేమామూలు మురికిలో క్రిములున్నాయి. మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగం ప్రమాదంవుంది. అందుచేతనే చాలా మంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుటవల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొను చున్నారు.—అది ఆరోగ్యవంతమయిన హాయిని కలిగించును.
L. 256-X52 TE.
భారత దేశంలో తయారు చేయబడినది.
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP

"జౌను."

"తెలుసుకోవాలని ఇలా అడుగుతున్నాను."

"మీకు విచారం కలిగిస్తున్నందుకు బాధగా వుంది."

"నాకేమీ విచారం లేదు."

"నేను మిమ్మల్ని ఒక సహాయం కోరటానికి వచ్చాను. ఇటువంటి సహాయం కోరేందుకు నాకు అర్హత లేనిమాట నిజం. మీరు అతడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటానికి రాకూడదు."

"ఇంతేకదా! సరే అయితే."

ఆమె మౌనంగా కూచుని నావైపు చూస్తున్నది. బరువైన హృదయంతో ఆమె నా ప్రక్కన చాలాసేపు కూచుంది. ఆమె వైపు నేను చూడలేదు. నాహృదయానికి కొంత శాంతి కలిగింది. కమలాక్షి తండ్రిని చంపిన నాకు ఆమెను స్పృశించటానికి యోగ్యత యెక్కడ వుంది?

ఆమె వెళ్ళిపోయింది; పాండ్య తిరిగి వచ్చాడు.

"వాఙ్మూలం ఇవ్వటానికి సిద్ధంగా వున్నాను," అన్నాను.

"ఇదే ఉత్తమమైన మార్గం."

"అన్ని పనులు పూర్తి అయినవా?"

"అయినవి."

"మీకు చాలా కృతజ్ఞుణ్ణి."

"నీవు నాకు కృతజ్ఞత తెలుపవలసిన విషయం ఏముంది?" అని నవ్వుతూ పాండ్య నా ముఖంలోకి చూశాడు.

"అన్ని యేర్పాట్లు పూర్తిచేశాను. నిన్ను ఎవ్వరూ పట్టుకోలేరు. నేను నీకు ఈపరిస్థితులలో చేయగలిగిన సహాయం ఇదొక్కటే."

మీరు ఇప్పటివరకూ చదివిన కథే చదివిందే నేను రాసిన వాఙ్మూలం. ఇది రాయటానికి అయిదురోజులు పట్టింది. పాండ్యకు నేను చేసినవాగ్దానం ప్రకారం గురువారం మధ్యాహ్నం దీన్ని ఆయనపేర రిజిష్టరుపోస్టులో పంపాను. అయిదు గంటలకు పాండ్య వచ్చాడు. పోస్టురసీదు అయనకు ఇచ్చాను. ఏడుగంటలకు దుస్తులు వేసుకుని నడవటానికి ప్రయత్నించాను. తిరిగి కొద్దిగా భోజనంచేసి విశ్రమించాను. టాక్సీ రాగానే బయటికి వెళ్ళాను.

ఓడ పైభాగంలో కుర్చీలో కూచున్నాను. సముద్రపు నీళ్లలోకి చూస్తూ పాండ్యప్రవర్తననుగురించిఆలోచిస్తున్నాను. నా ప్రక్కన వున్న కుర్చీ కదలినట్టు చప్పుడైంది. ప్రక్కకు తిరిగి చూశాను. కుర్చీలో కూచున్నది కోమలం! నాకు ఆశ్చర్యం వేసింది.

"మీ మేనేజరు పాండ్య పెళ్ళిళ్లు ఏర్పాటు చేయటంలో నిపుణుడు," అంటూ ఆమె నన్ను ఆప్యాయంగా పలకరించింది.

"అతడు అనుభవశాలి. రసికుడు," అన్నాను.

నేను ఆమె ముఖంలోకి చూశాను. ఆమె నాచేతికి ఒక పత్రిక ఇచ్చి ఇలా అంది.

"దీన్ని చూశారా? ఓడలోకి వచ్చిన పత్రిక."

"చూడలేదు. అది చూడాలని నాకు ఆసక్తి లేదు," అన్నాను.

"అందులో వుంది."

"ఏమిటి?"

"మధుసూదన్, కమలాక్షి పెళ్లి చేసుకున్నారు."

"సంతోషం."

"పాండ్యే ఈ పెళ్ళి జరిపించాడట."

"మనవిషయం కూడా పత్రికలో వచ్చింది. మనం ఇక్కడ మారుపేర్లతో ఉన్నాం. ప్రయాణీకులు అందరు ఈ వార్తలు శ్రద్ధతో చదివారు."

"నీకేమీ విచారం ఉన్నట్టు కనపడటం లేదే?"

"నేను వేరేవిషయం ఆలోచిస్తున్నాను." అని మధుర భావాన్ని ఒలికిస్తూ ఆమె నవ్వింది. అలాంటి భావం ఆమెలో నాకు ఇదివర కెప్పుడూ కనపడలేదు.

"నీవు ఏవిషయం ఆలోచిస్తున్నావు?"

"మనం ఎందుకు పెళ్లి చేసుకోకూడదని?"

"ఎందుకు చేసుకోకూడదు? తప్పకుండా"

అక్కడ కొన్నిగంటలు కూచున్నాం. సముద్రంలోకి చూస్తూ ఆమె సంభాషణ ప్రారంభించింది.

"మనకు ఇప్పుడు చిక్కులేమీ లేవు," అంది.

"ఔను."

"నేను ఎక్కడికి వెడుతున్నానో తెలియదు నీకు."

"తెలియదు," అన్నాను.

"సమయం వచ్చింది."

"దేనికి?"

"సరిఅయిన భర్తను చూడటానికి, నిజంగా ప్రేమించటానికి, ఇదే ప్రేమ అని తెలుసుకోవటానికి, నామనస్తత్వాన్ని అర్థం చేసుకుని నన్ను తృప్తిపరచ గలవాణ్ణి చూడటానికి సరిఅయిన తరుణం లభించింది."

నేను ఆమెభుజంమీద చేయి వేశాను. ఇద్దరం కొంచంసేపు అక్కడ పచార్లు చేశాము. మా సమీపాన ఉన్న నావికుడు నీళ్ళలోకి చూస్తూ:

"సొరచేప మన ఓడవెంటే వస్తూంది," అన్నాడు. నాకు అటువైపు చూడటం ఇష్టంలేదు. తిరిగి వెనుకకువెళ్ళి కుర్చీలలో కూచున్నాము.

"చంద్రోదయం అయ్యేవరకు ఆగుదాం," అన్నాను.

"సరే," అంది.

ఓడ కెప్టెను మేము ఓడలో ఎక్కినప్పటి నుంచి, మావైపు వింతగా చూస్తున్నాడు. నాకు గొంతులోనుంచి రక్తం రావటం ప్రారంభించింది. నా మనసు అప్రయత్నంగా నావికుడు చెప్పిన సొరచేపవైపు మరలింది.

ఇది ఓడగదిలో కూచుని రాస్తున్నాను. రాత్రి తొమ్మిది గంటలైంది. ఆమె అలంకరించుకోటానికి తనగదిలోకివెళ్లి ఆమె పెదవులకు ఎర్రరంగు వేసుకుంది. మెడకు ఎర్రని సిల్కు మఫ్లరు కట్టుకుంది. ఆమెగది తలుపు తీసిన చప్పుడు కాలేదు. నేను రాస్తున్నాను. ఆమెవచ్చి నాప్రక్కనే కూచుంది. ఆమె శరీరపు వేడి నాకు తగులుతూంది.

చంద్రోదయ మైంది!

[అయిపోయింది]


అమాయకులను క్షోభపెట్టే
పెద్దరికాలపై తిరుగుబాటు....
సారధి చిత్రం
పెద్దరికాలు
ఏప్రిల్ 25 వ తేది మొదలు
దర్శకత్వం. తాపీ చాణక్య
నవయుగ విడుదల...

మాండవి

ఎమ్. లక్ష్మీదేవి



ప్రాతఃకాలం పుష్ప గుచ్ఛాలతో అలరారే ఉద్యానవనంలో మాండవి విహరిస్తున్నది. ఒక తుమ్మెద ఎగురుతూ వచ్చి ఆమె చుట్టూ రింకారం చేసింది.

"మాండవీ!" అని పిలిచినట్లు ఒక ధ్వని వినిపించింది. అయినా ఆమె తిరిగి చూడలేదు. చిరునవ్వు నవ్వింది. ప్రవాళసదృశము లైన ఆమె అధరోష్ఠములు ముకుళించినవి.

"మాండవీ!" అని మరొకసారి మధుర స్వరం వినిపించింది. మాండవి వదనాంబుజం వికసించినా తన సౌందర్యాన్నంతటినీ పలికి తొలకరిస్తూ మెల్లిగా వెనుదిరిగి చూసింది.

ఎదుటనే ఆమె అనుంగుభర్త భరతుడు నిలబడి ఉన్నాడు.

"మాండవీ! నాపిలుపుకు ప్రత్యుత్తరం లేకపోవడానికి నే జేసిన నేరమేమిటి?" అన్నాడు.

"మధురస్వరం కలిగివుండటం మన్నింపరాని నేరంగదా! మీరు మధురస్వరంతో నాపేరు ఉచ్చరిస్తూంటే, మౌనంగా దాన్ని వినడంలో ఎంత హాయి కలుగుతుందో తెలుసునా? మధువును గ్రోలినట్లుంటుంది!"

"మాండవీ! మధురస్వరయుతులైన మంజుభాషిణులకు అందరి స్వరంలోనూ మాధుర్యం ప్రతిధ్వనిస్తుంది గాబోలు! మకరందాన్ని గ్రోలే ఈ తుమ్మెదలను అడుగు, నిజం తెలుస్తుంది," అన్నాడు భరతుడు.

"సూర్యాస్తమయం వరకు కుసుమాలు వికసించి వుండడం సహజధర్మమే గదా! పుష్పగుచ్ఛాలకన్న నేను భాగ్యశాలినే! ఎందుచేత నంటారేమో! ప్రతిరోజూ సూర్యుడు పుష్పాలను శోకతప్తులుగా జేసి మరుగుపడి పోతాడు. కాని, మీరెల్లప్పుడూ నాదగ్గరే ఉండి, నాహృదయాన్ని వికసింపజేస్తారు. అది నా భాగ్యముకాదా?"

"మాండవీ! నీవు చాలా బుద్ధిమంతు రాలవు. ఒకమాట. నేను, తమ్ముడు శత్రుఘ్నుడు మా మేనమామ ఇంటికి వెళ్ళవలెనని నాతలిదండ్రుల ఆజ్ఞ. ఈ మాట నీతో చెప్పి సెలవు తీసుకొందామని వచ్చాను."

మాండవి కళ్ళలో నీళ్లు తిరిగినవి. ఆమె నోట మాటరాలేదు. భరతుడు సముచితమైన మాటలతో ఆమెను ఓదార్చి, ఉద్యానవనాన్ని విడిచి బయలేరాడు.

మాండవి కళ్ళనుంచి అశ్రుకణాలు రాలినవి. "అయ్యో! ఇదేమి? కుడికన్ను అదురుతున్నదే!" అనుకుని కళ్లు బాగా తుడుచుకొన్నది. కాని ఇంకా అదురుతూనే ఉన్నది. ఆమె భయవిహ్వల అయింది. వెంటనే పక్కన వున్న చెలికత్తెను పిల్చి, "చెలీ! వాసంతీ! పరుగిడివెళ్ళి వెంటనే నా ప్రభుని పిల్చుకొనిరా! నా దుఃఖాశ్రువులను ఆపటానికి సాధ్యమవటంలేదు. కుడికన్నేమో అదురుతున్నది. అయ్యో! నేనేమి చేసేది! నా నాథుని కొరకు ఏ ఆపద కాచుకొని వున్నదో! ఓసీ! ఎందుకు ఇంకా నిలబడి ఉన్నావు? వెళ్లు! వెళ్లు! నా ఆత్మవిభుని అత్యవసరంగా తీసుకురా! నేను ఆయన లేనిదే ఏమీ చేయజాలను," అని చెలికత్తెను తొందర పెట్టింది.

"అమ్మా! ప్రయాణసన్నద్ధులై రథముపై

వధిరోహించిన వారిని వెనుకకు పిల్చుట మంచికొరకు గాదు." అని వెళ్లి వచ్చిన వాసంతి విన్నవించింది. మాండవి చంద్రకాంత శిలావేదికపై కూలబడిపోయింది. దిక్కు తెలియని భీతి, శంక ఆమెను ఆవహించినవి.

* * *

"వాసంతీ! మల్లికా! శుభ చంద్రికా! రోహిణీ లేవండి! లేవండి! బాగున్నది. మీ నిద్ర! ఈరోజు మా అక్కయ్య పట్టమహిషి కాబోతున్నది. చక్కగా అలంకరించుకొని ఉత్సాహంతో పొంగిపోదాం!" అంటూ వచ్చింది, మాండవి.

చెలికత్తెలందరు తమ కన్న ముందే లేచి చక్కగా అలంకరించుకొని ఉత్సాహంతో పొంగిపోతూన్న మాండవిని చూసి సిగ్గుపడ్డారు. తొందరపాటుతో అందరూ లేచారు. శోభాయమానమైన మాండవి ముఖకాంతిని చూచి అందరూ సూర్యుణ్ని సమిగూడి ఉన్నట్లు భ్రమించిపోయారు.

చీని చీనాంబరాలతోను, పట్టుదుకూలాలతోను, రత్నాభరణాలతోను, అలంకృతులైన దాసీజనులు వెంటరాగా చిరునవ్వు చిందులు త్రొక్కుతూండగా మాండవి బయల్దేరింది. గూని మందర ఎదురుపడ్డది. పట్టుజరీచీర కట్టుకొని ఉంది. చెవులకు, రత్నాలు తాపిన బంగారు కుండలాలు. మెళ్ళో మోయలేనన్ని రత్నాల హారాలు. చేతులకు పైడి కంకణాలు. ఆమె రూపరేఖాలంకారాలు చూచి మాండవి, ఆమె చెలులు, ఫక్కున నవ్వారు.

"ఓసీ! వాసంతీ! ఈపట్టాభిషేక మహోత్సవానికి ముసలి పెద్దలకు కూడా తమ్ము చక్కగా అలంకరించుకొని ఆనందాన్ని అనుభవించడంలో ఎంత ఆతృతో చూశావా?" అన్నది మాండవి.

"అవునే! చిన్నదాల నీవు నా అపరంజి బొమ్మవే! ముద్దుగుమ్మవే దానికోసమే కదూ నేనింత పన్నాగం పన్నాను. నీ పట్టాభిషేక మహోత్సవాన్ని నా ఈ కళ్లతోనే చూడబోతున్నాననే సంతోషం పట్టలేక పోతున్నాను. అందుకే చక్కగా అలంకరించుకొని వచ్చాను," అన్నది గూనిమందర మాండవి అద్దంపు చెక్కిళ్లను అదిమి ఎత్తిన నొక్కుని, దృష్టి తీసింది. మాండవికి ఆమె మాటలు వేడుకవలె తోచినవి.

"ఓసి అవ్వా! నీ వీమాటలు పరిహాసంకోసం చెప్పడం తగదు. నాకు పట్టమహిషిని కావాలనే అభిలాష కలలో కూడా లేదు. రాజు, రాణి అనిపించుకుని, ప్రజలకు [illegible] కనిపెట్టుకొని తృప్తి గల్గించే ఆ గొప్ప బాధ్యత, అధికారము నాకక్కర లేదు లే. నాభర్త జ్యేష్ఠ పుత్రులుగా జన్మించలేదు. కనుకనే రాజ్యభారము వహించే చిక్కు లేదు. అంతవరకు నేను అదృష్టవంతురాలినే" అన్నది మాండవి మందరతో.

"పిచ్చిదానా! పట్టమహిషి అనే గౌరవం పొందడానికి ఎంత అదృష్టంచేసి ఉండాలి? అబ్బబ్బ! నీ అత్తగారి మనస్సును మార్చడంలో ఎంత శ్రమపడ్డానో తెలుసా? నా పంతం నెరవేరింది. ఈ సంతోష సమాచారాన్ని నీకు తెలియచేద్దామని పరుగు పరుగున వచ్చాను," అంది మందరం, తర్వాత తను కైకేయి వద్దకు వెళ్ళి ఏ విధంగా ప్రబోధించిందీ, కట్టకడకు ఆమె మనస్సు మార్చి దశరథమహారాజు దగ్గర ఏ విధంగా వరమడిగించిందీ దశరథమహారాజు సత్యవాక్పరిపాలనార్థం శ్రీరామచంద్రుని గురించి విలపిస్తూ ఏ విధంగా మూర్ఛిల్లిందీ, కైకేయి వేకువజామునే శ్రీరామచంద్రుని పిలిపించి పిత్రాజ్ఞను ఏ విధంగా తెలియజెప్పిందీ, శ్రీరామచంద్రుడు తండ్రియాజ్ఞను ఔదలదాల్చి కారడవులకు వెళ్ళడానికి ఎలా సమ్మతించిందీ, జరిగిన విషయాలన్నీ సవిస్తరంగా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

ఇవన్నీ విన్న మాండవి నిలువునా కంపించిపోయింది. మూర్తీభవించిన క్రోధోన్మత్త విగ్రహమైపోయింది.

"ఛీ! పాపిష్ఠురాలా! ఎంత పనిచేశావు! జ్యేష్ఠపుత్రుడుండగా తక్కినవాళ్లు రాజ్యార్హులు ఎట్లా అవుతారు? అదీగాక, శ్రీరామచంద్రుడు మాకు దైవసములు. వారియందు అత్యంత భక్తివిశ్వాసములుకల నా నాథుడు ఈ వార్తను వింటే తల్లడిల్లిపోడా? అదీగాక అన్నా వదినెలను అడవులపాలు చేసిరన్న అపవాదును నిరపరాధులైన మామీద వేస్తున్నావా? పరమ ఛండాలీ! విషసర్పాన్ని పాలుపోసి పెంచినట్లు వంచకియగు నిన్ను దరిజేర్చి మా అత్తగారు నిప్పుల నొడిగట్టుకొన్నారుగదే! నీమూలాన తీరని అపవాదును కొనితెచ్చుకోవలసి వచ్చింది. నారీప్రపంచానికే అప్రతిష్ఠను తెచ్చిపెట్టావు గదే! ఓసీ నీచురాలా! ఛండాలీ! వెళ్లు వెళ్లు! నా ముందు నిలబడకు. వాసంతీ! రా! రా! మనం అత్తగారి దగ్గరికివెళ్ళి దీని మూలాన్ని చంచలమైన వారి మనస్సును కుదుటబర్చుదాం" అని ఆవేశంతో చరాచరా నడవ ప్రయత్నించింది మాండవి.

సుడిగాలివలె చెలరేగిన ఆ భావాందోళన కల్లోలంతో తల్లడిల్లిపోయింది మాండవి. ఆ వేగంలో గడప దాటకుండానే మూర్ఛిల్లి క్రింద పడిపోయింది. నొసట గాయం తగిలింది. ఆరోజల్లా మాండవి మూర్ఛ తేరలేదు.

* * *

నిర్మల తటాకంలో ఒక సుందర పద్మము ఒడ్డున శ్రీరామచంద్రుడు తన సహోదరులతోనూ, వారి భార్యలతోనూ నిలబడి ఉన్నాడు. అందరూ ఆ సుందర సరోజముపై దృష్టి నిగిడిస్తారు. శ్రీరాముడు తటాకంలో దిగుతాడు. వెంటనే భరతుడుకూడ మాండవి చేయి పట్టుకొని శ్రీరామచంద్రునికి అడ్డంగా తటాకంలో దిగుతాడు. ఉన్నట్టుండి ఒక పెద్ద తుఫాను చెలరేగుతుంది. మాండవి ఆ గాలివానలో చిక్కుపడిపోయింది. భరతుడు ఆమెచేయి వదలిపెట్టి ఎక్కడో మాయమైపోయ్యాడు. మాండవి దిక్కు తెలియక ప్రవాహంలో మునిగిపోతూన్నది. సుడిగుండంలో దిగిపోయిన మాండవి, "అయ్యో! నన్ను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లారు?" అని విలపిస్తున్నది. కాని భరతుడు చాలాదూరం వెళ్లినట్లుంది. ఆమెకు కన్పించనే లేదు.

భయంతో కళ్లు తెరిచింది మాండవి. అంతా స్వప్నం. ఈలాంటి భయంకర స్వప్నాలు అప్పుడప్పుడు ఆమెకు కలుగుతూనే వుంటవి. శ్రీరామచంద్రుని వనవాసం, తన మామగారి మరణం ఇవి మరపురాని సంఘటనలు. ఇప్పుడు తల్చుకుంటే ఆమెగుండె బ్రద్దలైపోతుంది.

"అమ్మా! భరతమహారాజులుంగారు వచ్చి ఉన్నారు" అన్నది వాసంతి. కాని ఆమె వదనంలో ఆనందం కన్పించలేదు. మాండవి హృదయం దడదడ కొట్టుకుంది. ఏదో ఒక భీతి ఆమె నావేశించింది. భయంతోను, దిగులుతోను భర్తకు స్వాగతమివ్వటానికి బయల్దేరింది.

"దేవి! కాస్త ఆగండి. మీరిప్పుడు వెళ్ల వద్దు. ప్రభువుగారు మొదట మాతృదేవిని దర్శించడానికి వెళ్ళిఉన్నారు. అక్కడ అన్ని సంగతులు కనుగొని రానియ్యండి" అన్నది వాసంతి.

"ఓసి పిచ్చిదానా! ఇన్నాళ్లు వారితో మెలిగాను. వారిస్వభావం నాకు తెలియదనుకున్నావా? వారికి రాజ్యాపేక్ష అసలే లేదు. సోదరులు కానలపాలైనారని వినగానే, వారి మనస్సు ఎంత తల్లడిల్లిపోయిందో! ఎన్ని వ్రక్కలైపోయిందో! వారెప్పుడూ సహోదరుని సేవలోనే ఆనందాన్ని అనుభవించేవారు. మొదట నేను వారిని కలుసుకుని వారి మనస్సుకు ఊరట కల్గించి శ్రీరామచంద్రుని మరల అయోధ్యకు పిలిపించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి" అని పలికి కైకేయి అంతఃపురానికి బయల్దేరింది.

మాండవి రాకముందే, భరతుడు కైకేయిని దర్శించి సకలవిషయాలను సవిస్తరంగా తెలుసుకుని క్రోధాకారుడై ఆమెతో

వాగ్వాదం జరుపుతున్నాడు. మాండవి దిగులుతో మెల్లగా జంకుతూ ప్రవేశించింది. మాండవిని చూడగానే కైకేయి, "అమ్మాయి! మాండవీ! నీవైనా నీభర్తకు బోధించవమ్మా! రాజగద్దియ నధివసించి నాల్గు దిక్కులా కీర్తిని, ప్రతాపాన్ని విరజిమ్ముతూ, రాజ్యభోగము లనుభవించు. మంచి అదృష్టం కలుగజేశాను. కాని ఇతడేమో, కన్నతల్లి అని అయినా చూడకుండా కఠినోక్తులతో నన్ను నిందించుతున్నాడు. మీ సౌఖ్యము కోసం నేను పడిన శ్రమ కిదియా ఫలము?" అనిఅంది.

మాండవి అత్తగారికి ఎదురుమాటాడి ఎరుగదు. ఏమిచెప్పాలో తోచక, కళ్లవెంట నీరు కార్చుతూ నిలబడిపోయింది. ఏవిధంగా న్యాయాన్యాయాలను సమర్థించి వారిద్దరినీ సమాధానపర్చవలెనో తెలియక మాండవి నిశ్చేష్టురాలై నిల్చిపోయింది. భరతుడు ఆమె మౌనాన్ని విపరీతంగా తల్చుకున్నాడు. కన్నుల నిప్పులు రాల్చుతూ, "అమ్మా! చాలు చాలు! అత్తాకోడళ్లు అత్యాశాపరులై పన్నిన పన్నాగంచేత అపహరించిన రాజ్యం నా కక్కరలేదు. మీ నీచత్వం ఈనాటికి తెలిసింది. ఇక మీ సంబంధం నాకు అక్కరలేదు. నువ్వు నా తల్లివి గావు; మాండవి నాపత్ని గాదు" అని కఠోరంగా కేకలేశాడు భరతుడు.

ఈమాటలతో మొదలునరికిన అరటిచెట్టువలె కూలిపోయింది మాండవి. ఆమె హృదయం వెయ్యి వ్రక్కలైపోయింది.

"అయ్యో! నాకీ విషయంతో ఏమీ సంబంధమే లేదు. ఇన్నాళ్లు చూస్తున్నా నాగుణం మీ కింకా తెలియలేదా? నన్ను నమ్మండి. మనమిప్పుడే బయల్దేరి అన్నగారిని, వదినను పిల్చుకొని వద్దాము" అని మాండవి వెక్కివెక్కి ఏడ్చింది.

"నీ ఈ సాహసాలు నాదగ్గర పనికిరావు. స్త్రీలను నమ్మరాదని బాగా తెలిసిపోయింది. మా అన్నయ్య మీద మీరు చూపిన ప్రేమ అంతా అబద్ధం. వట్టి భ్రమ. నీకు సత్యమైన ప్రేమ ఉంటె ఎందుకు మాఅన్నయ్యను వనవాసం వెళ్లకుండా విరమింపచేయలేదు? తన పతిమరణానికి కారకురాలైన నీ అత్తగారిని ఎందుకు భస్మం చేయలేకపోయావు? భర్త రాగానే చక్కగా సింహాసనమెక్కి కూర్చొని అష్టయిశ్వర్యసుఖభోగాలను అనుభవించాలన్న దురాశకదా నిన్నీవిధంగా అడ్డుపెట్టింది? ఇక మీముఖాలు చూడడమే మహాపాపము," అని గద్దించి, వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

భరతుడి నోటినుంచి వెలువడిన కఠినోక్తులు వినగానే మాండవికి కొరడాతో కొట్టినట్లు అనిపించింది. ఆమెకు లోకమంతా చీకట్లు కమ్మినట్లయింది. కళ్ళు గిర్రున తిరిగిపోయినవి. ఇంతలో అటువైపునుంచి వచ్చిన సుమిత్ర, కూలి పడబోతూన్న మాండవిని పట్టుకొంది. "మాండవీ!" అన్నది. మాండవి సుమిత్రను గట్టిగా కౌగలించుకొని, "అత్తగారూ! మీరైనా నన్ను నమ్ముతారా! నేనేపాపం ఎరగను. ఈ భయంకరమైన నింద మోయలేను. నేను నిరపరాధిని. మీ పుత్రునితో చెప్పండి," అని బ్రతిమాలింది.

"అమ్మాయి! భరతుడు అత్యుగ్రకోపంలో ఉన్నాడు. నీ నిర్మలస్వభావం అతని కిప్పుడు గోచరించదు. లోకం నీ నిర్దోషత్వాన్ని గ్రహించడానికి కొంతకాలం గడవాలి. అంతవరకూ ఓర్చుకో!" అన్నది సుమిత్ర.

"అమ్మా! భర్తచే తిరస్కరించబడిన స్త్రీ హృదయం ఎన్నివ్రయ్యలైపోతుందో మీకు తెలియదా! అయ్యో! విరహార్తిని భరించడం కూడా అంత దుఃఖకరంగా తోచదు. కాని పతి సమీపంలోనే వుంటూ ఆ తిరస్కారభావాన్ని భరించడం దుర్లభం. భర్త ప్రేమేకదా స్త్రీకి జీవిత సౌభాగ్యం" అని మాండవి రోదించింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న మాండవిని ఓదార్చుతూ తోడ్కొని వెళ్ళింది సుమిత్ర.

* * *

అడవికి వెళ్ళిన అగ్రజుని తీసుకురావడానికి భరతుడు సపరివారంతో బయల్దేరాడు. మార్గంలో భరతుడు స్వజనులందరి సౌకర్యాసౌకర్యాలను తెలుసుకొంటూ, కావలసిన సదుపాయాలన్నీ చేశాడు. కాని కైకేయిని, మాండవిని కన్నెత్తిఅయినా చూడలేదు. మాండవిహృదయం వేదనతో కృంగిపోతున్నది, దుఃఖంలో కృశించి పోతున్నది. కైకేయి, సౌందర్యరాశియైన మాండవికృశించిపోవడం చూసింది, పశ్చాత్తాపం కల్గింది. "మాండవి! నేను పరమపాపిని, దౌర్భాగ్యురాలను. పతి మరణానికి మాత్రమే గురికాలేదు. మీ దంపతుల చిరవియోగానికి హేతువైనాను" అని దుఃఖాశ్రువుల రాల్చింది.

మాండవికి అత్తగారిపై అనుతాపం కల్గింది. ఇక తనుతప్ప అత్తగార్ని ఆదరించే దెవరు? అందరూ ఆమెను ఆడిపోసేవారే. తిట్టిపోసేవారే! "అమ్మా! మనం విధివశలమై వున్నాము. ఏమి చేయగలము?" అన్నది మాండవి. అంతకుమించి మరేమి చెప్పగలదు?

భరతాదులతో సంతోషంగా సంప్రదించి, శ్రీరామచంద్రుడు కైకేయినే మొట్టమొదట పలకరించాడు. అంతలో సీత మాండవి దగ్గరికి వచ్చింది. "అయ్యో! మాండవీ! ఇదేమి! ఇట్లు చిక్కి శల్యావశిష్టవైపోయావు?" అని అంగలార్చింది సీత.

మాండవి సీతను కౌగిలించుకుని కన్నీళ్లతో అభిషేకించింది. సుమిత్ర, సీత

మాండవి

మాండవి దుఃఖకారణాన్ని అడగటానికి వీలు లేకుండ తన దగ్గరకు పిల్చుకొంది.

భరతుడు విఫలమనోరథుడై శ్రీరామచంద్రుని ఆజ్ఞమేరకు పాదుకలను నెత్తిన దాల్చి అయోధ్యకు మరలివెళ్లాడు. సకల పరివార బంధుమిత్రాదులు అతని ననుసరించారు. కాని మాండవి అక్కడే కూలబడిపోయింది. సుమిత్ర "అమ్మాయీ! లే!" అని లేపింది. కాని మాండవి లేవలేదు.

"అత్తయ్యా! నేనెక్కడ ఉంటే ఏం? అంతఃపురంలో ఏ సౌభాగ్యాన్ని అనుభవిస్తాను? భర్తృ తిరస్కారాన్ని పొందిన స్త్రీకి ఈ ప్రపంచంలో ఎక్కడా తావు లేదు. కాబట్టి అత్తయ్యా! నేను భర్తకు కంటకంగా నగరిలో ఉండడం కంటే ఈ అడవిలోనే ఉండిపోతాను," అన్నది మాండవి.

"అయ్యో! పిచ్చిపిల్లా! లోకమెరుగని దానవు. నా కోడలు ఊర్మిళకంటే నీ మనోవ్యథ గొప్పదని నే నెరుగుదును. సహనంతోను, సేవా శుశ్రూషలతోను, త్యాగంతోను నీ భర్తమనస్సును మళ్ళించుకోవమ్మా! పతి ప్రాపున ఉండవలసినదే సతీ ధర్మము. లేవమ్మా!" అన్నది. మాండవి చేసేది లేక సుమిత్రతో బయలుదేరింది.

* * *

నందిగ్రామంలో ఒక పర్ణశాల. ఆశ్రమంలో మాండవి జీవచ్ఛవంవలె తిరుగుతున్నది. ఆమె ఆభరణాదులను ధరించడం లేదు. సాధారణ స్త్రీ వలె ఉన్నది. ఆమె ఆశ్రమాన్ని శుభ్రంచేస్తున్నది. ఇప్పుడామెకు చెలికత్తెలు లేరు. దాసీదాసజనం లేరు. పుష్పమాలలతో శ్రీరామచంద్రుని చిత్రపటాన్ని అలంకరించింది. పూజకోసం పుష్పాలను ఏరింది.

ఇంతలో భరతుడు సుస్నాతుడై ఆశ్రమానికి వచ్చాడు. మాండవి నమ్రతతో అతని పాదద్వయాన్ని కడిగి పూలతో పూజించింది. చల్లటి నీళ్లతోపాటు, రెండు వేడి కన్నీటి చుక్కలు ప్రతిరోజూ అతని పాదాలపై రాల్చేది. కాని భరతుడు చలించలేదు. అయినా భరతుని మనస్సులో మటుకు ఏదో వేదన. మాండవితో మౌనవ్యవహారమే తప్ప నోరు విప్పి ఒక్కమాట కూడా ఇంతవరకూ మాట్లాడలేదు.

పద్నాలుగేండ్లు ఇట్లాగే సేవా శుశ్రూషలోనే గడిపింది—మాండవి. భరతునికి కందమూలఫలాలు సమర్పించి అత్తగారి సేవకు పూనుకొనేది. కైకేయి సకల జనుల దూషణ భారంచేతనూ, అవమానంచేతనూ కృంగి

(56-వ పేజీ చూడండి)

పట్టుబడిన దయ్యం

ఆ కుటుంబం క్రొత్తగా ఊరి వెలుపల వున్న ఆయింట్లో అద్దెకు దిగింది. కుటుంబ యజమాని ఆ ఇంట్లో దిగబోయేముందు అనేకమంది చెప్పారు: "అందులో దయ్యాలు నివసిస్తున్నాయి......అందులో దిగకండీ" అని. కాని ఆయనకి నమ్మకం లేక పోవడంవల్లనూ, తక్కువ అద్దెకు అంత మంచిఇల్లు కుదురుతూందన్న ఉద్దేశ్యంతోనూ, ఊరికి కొస్త దూరం అయినప్పటికీ అందులో ఉండటానికే నిశ్చయించుకుని కుటుంబ సమేతంగా దిగాడాయన.

అంతకుముందు అనేకమంది అందులో అద్దెకున్నారు...రాత్రిళ్లు వాళ్లకేవో కూతలు వినపడ్డం...కొన్ని కొన్ని సామాన్లు కనబడకుండా పోవడం జరిగింది. ఒకాయన కూతురు భయపడి తీవ్ర జ్వరానికి పాల్పడి బ్రతికి బయట పడేటప్పటికి బ్రహ్మాండం అయింది. అప్పటినుండీ ఆ ఇంటికి 'దయ్యాలకొంప' అనే సార్థక నామధేయం కూడా వచ్చింది.

ఆయీ విషయాలు సమగ్రంగా తెలుసుకుని లెక్కే-మిటన్నట్లుగా అందులో దిగాడు ఆ కుటుంబయజమాని వెంకట్రావుగారు. ఆ ఇల్లుయజమాని పట్నంలో నివసిస్తున్నాడు. ఎవ్వరూ అందులో ఉండటానికి ధైర్యం చెయ్యకపోగా అంత ఇంటినీ వెంకట్రావుగారికి తక్కువ అద్దెకిచ్చాడు ఇంటి యజమాని రామారావు.

వెంకట్రావుగారి కుటుంబం అంత పెద్దదీ కాదు అంత చిన్నదీ కాదు. ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్ళూ. కూతుళ్లిద్దరికీ పెళ్ళిళ్లు చేశాడు. అత్తవారిళ్లకు పంపాడు. ఇంక ఇంట్లో ఉంట ఇద్దరు కొడుకులూ తనూ భార్యా. పెద్ద కొడుక్కి పెళ్ళయింది. అతని పేరు సుబ్బారావు. భార్య పేరు సుశీల. అతను టైపిస్టుగా ఇంజనీరు ఆఫీసులో పని చేస్తున్నాడు. వెంకట్రావుగారు హైస్కూలు టీచరు. ఇంక నాలుగైదేళ్లలో రిటైర్ అవ్వడానికి సిద్ధంగా వున్నాడు. ఆయన ఖర్చు విషయంలో కొద్దిగా వెనకతీసే స్వభావంగల వ్యక్తి. రెండో కొడుకు ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాడు.

వెంకట్రావుగారు చేరిన కొత్తలో "ఇటువంటి ఇంటికి అలాటి పేరెలా వచ్చిందా?" అని ఆశ్చర్యపడ్డారు. ఆ ఇంటికి చుట్టుపట్ల ఎక్కడా ఇళ్ళులేవు. పట్నం పోవడానికి ఒక మైలుదూరం నడవాలి. దూరంగా మిల్లు మాత్రం వుంది...ఎటువైపు చూసినా దట్టంగా చెట్లు...దూరంగా కొండలు, పచ్చని... అంతా అందంగా వుంటుంది...హాయిగా ప్రాణం లేచివచ్చేటట్లుగా చల్లటిగాలి! దీంతో వెంకట్రావుగారు చాలా సంబరపడ్డారు. సైకిలుమీద స్కూలుకి వెళ్లి వస్తూంటారాయన.

ఆయన నేకసార్లు దయ్యాలు లేవని వాదించాడు. ఉంటే చూపెట్టమన్నాడు. అప్పుడు ఒక స్నేహితుడన్నాడు: "అమావాస్యనాటి రాత్రి ఒక్కడివీ శ్మశానవాటిక దగ్గరకు వెళ్లిరా తెలుస్తుంది...ఐదు రూపాయలు పందెం!" అన్నాడు. వెంకట్రావ్ గారు ఆ అమావాస్య నాటిరాత్రి దుడ్డుకర్ర పుచ్చుకొని శ్మశాన వాటిక దగ్గరకెళ్లి హాయిగా

"మధుశ్రీ"

తిరిగి వచ్చి ఐదు రూపాయలూ పుచ్చుకున్నాడు. అలాంటి దిట్ట ఆయన. ఆవిషయంపై ఆయనతో ఎవరూ గట్టిగా వాదించరు.

అలాంటి అధైర్యం వుందిగనుకనే ఆయన అందులో అద్దెకు దిగగలిగాడు!

భార్యా కొడుకూ చెప్పి చూశారు అనేక విధాల. కాని ఆయన వినలేదు. కోడలికి మరీ భయం...ఆయనభార్యా కోడలూ ఆంజనేయ దండకం పఠించందే ఏరాత్రీ నిద్రపోరూ!

ఇలా ఒక వారంరోజులు సవ్యంగానే సాగింది. ఒకరాత్రి:

ఆ రాత్రి పన్నెండయింది. ఇంట్లో అందరూ గాఢసుషుప్తిలో మునిగి వున్నారు. ఒక ముసుగు వేసుకున్న ఆకారం పీధివైపు నున్న సామానుగదిలో ప్రత్యక్షం అయింది. అది సామానుగది. ఆ ఇంట్లో అద్దెకున్న వాళ్లకీ ఆగదికి సంబంధంలేదు. అందులో విరిగిన కర్ర కుర్చీలు...డబ్బాలు...చెత్తా చెదారం వుంటాయి. ఆగది ఇంటియజమానికే వుంచబడింది. అంటే ఆగది మినహాయింపుగా ఆ ఇల్లు అద్దెకిస్తారు. నల్లటి ఆకారం గదిగోడ తడిమి ఒక మీట నొక్కింది. గోడలో కొంతభాగం ప్రక్కకి తప్పుకుంది. అక్కడేర్పడిన ద్వారంగుండా వెడితే సుబ్బారావు సుశీలా పడుక్కునే గదిలోకి వెళ్లి వచ్చు.

ఆ ఆకారం గదిలోకి వెళ్ళింది. ముఖం మీద ముసుగు తీసింది. వికృతమైనముఖం... ఎంత గుండెదిటవున్నవాళ్ళయినా నిలువునా నీరయిపోతారు! అంత భయంకరమైన ముఖం. గదిలో బెడ్‌రూంలైటు వెలుగుతూంది....

సుశీల మంచి అందమయినది. మందమందంగా వున్న బెడ్‌రూంలైటు వెలుగులో ఆమె శరీరం మెరుస్తూంది. ప్రక్కనే సుబ్బారావు గుర్రుపెట్టి నిద్రిస్తున్నాడు. ఒక వింత అందాన్ని ప్రతిఫలిస్తూంది ఆమె ముఖం... చూడబోయేటప్పటికి ఆ ఆకారం మనసులో ఏవో శక్తులు కదిలాయి...

ఆకారం నెమ్మదిగా కదిలింది...నిద్రపోతున్న ఆమె చెక్కిళ్ళపై ముద్దు పెట్టుకుంది...మెళ్ళో నెక్లెస్ మెరిసింది. నెమ్మదిగా ఆ నెక్లెస్ తీసి మొలలో పెట్టుకుని ఆ ఆకారం ఆమె ముఖంలోకి చూస్తూ వెనక్కి కదిలింది. వెనక్కి వెళ్ళడంలో మేజామీదున్న మంచినీళ్ళ గ్లాసు క్రిందపడి గణగణమని చప్పుడయింది.

ఆ చప్పుడికి సుశీల మేలుకుంది. లేచి కూర్చుంది...నలువైపులా చూసింది...ఆ ఆకారాన్ని చూసి కెవ్వుమని ఒక్కకేక వేసి క్రింద పడిపోయింది.

ఆ కేకతో ఇంట్లో ఉన్నవాళ్లందరూ లేచారు. గబగబా సుశీలగదికి చక్కా వచ్చారు.

ఆ ఆకారం మాయమైంది! సుశీల నందరూ చుట్టుముట్టారు...సుశీలకి శ్వాసమాత్రం ఆడు

★ పట్టుబడిన దయ్యం ★

తూంది...అందరూ కంగారుపడడం మొదలు పెట్టారు. సుబ్బారావు చెంబుతో చన్నీళ్లు తీసుకువచ్చి సుశీలముఖంపై చిలకరించాడు. కొంతసేపటికి సుశీల నెమ్మదిగా కళ్ళు తెరిచింది...గది నలుమూలలా పరికించింది... గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి...

"వెళ్ళిపోయిందా?" నీరసంగా ప్రశ్నించింది.

"ఏమిటి?..." అన్ని కంఠాలు ఒక్కసారి భయోద్వేగంతో అడిగాయి.

"దయ్యం...!" అంది సుశీల కళ్లు గట్టిగా మూసుకుంటూ.

"ఎక్కడ? ఏమిటి?" అని తొందరగా ప్రశ్నించింది అత్తగారు వొణికిపోతూ.

"మరేం కంగారుపడకండి!" అన్నారు వెంకట్రావుగారు.

"మీరంతా కంగారుపడి ఆమెని భయపెడతారేం ఇవతలకు రండి!" అని మళ్లీ గట్టిగా చివాట్లుపెట్టేధోరణిలో అన్నాడు.

ఎవ్వరూ నోరు మెదపలేదు...

సుశీల దగ్గరకు వెంకట్రావుగారు వచ్చి "అమ్మాయ్ సుశీలా-ఇలా చూడు ఏం జరిగిందో అసలు చెప్పు...భయపడకు మేం వున్నాంగా..." అన్నాడు.

వొణికే కంఠాన్ని సుశీల సర్దుకుంది.

ఏలాగో చెప్పసాగింది.

"నిద్దట్లో నాముఖాన్ని ఎవరో ముట్టుకున్నట్లుగా అనుమానం వచ్చింది. నాకు పూర్తిగా మెలుకువరాలేదు...ఒత్తిగిల్లి పడుకున్నాను ఆ మగతనిద్రలోనే!" అని కళ్ళు మూసుకుంది కొద్దిక్షణాలూరుకుని మళ్ళీ చెప్పింది.

"మేజామీద వున్న నీళ్ళగ్లాసు క్రిందపడి చప్పుడయింది...నాకు మెలుకువవచ్చి లేచి కూర్చుని గదంతా కలయచూశాను...అబ్బ భయంవేస్తోంది తల్చుకుంటే...ఏదో ఒక వికృతమైన ముఖం కనబడింది. వొళ్ళంతా నల్లటిముసుగు...చూస్తూండగానే మాయమయింది...ఆతరువాత నాకు తెలియలేదు..." అంది గజగజ వొణికిపోతూ.

వెంకట్రావుగారు గది పరిశీలించారు మంచినీళ్ళగ్లాసు గోడకి వారగా పడిపోయి వుంది. నీళ్లు క్రింద వొలికిపోయి నేల తడిగావుంది...అడుగుల ఆనవాళ్లు మొదలైనవేవీ కనబడలేదు...మేజాక్రిందవున్న నల్లపిల్లి మ్యావ్‌మని అరుచుకుంటూ ఇవతలకు వచ్చింది...వెంకట్రావుగారి ముఖంలో హాసరేఖ లుదయించాయి!

దయ్యాలకొంప అని పేరువినే వీళ్ళసలే భయంతో సతమత మవుతున్నారు. దానికి తోడు ఏం చూచినా అలాగే అనిపిస్తుంది అని సైకాలజీలో వుంది. పరీక్షకి కూర్చున్న అబ్బాయికి పేపర్లో ప్రతీవొక్క నంబరూ తనదిలాగే కనుపిస్తుంది. కలతనిద్రలో భయపడివుంటుంది సుశీల అని స్థిరనిశ్చయాని కొచ్చారు వెంకట్రావుగారు.

"అమ్మాయ్ సుశీలా ఇదిగో ఈపిల్లిని చూడు...ఇదే ఇంత హడావుడి చేసింది. నువ్వసలే భయంతో వున్నావు...అంచాత నీకలా అనిపించింది...దయ్యాలేమిటమ్మా!" అన్నారు తేలికగా. రజ్జుసర్ప భ్రాంతి అన్నది కూడా ఇలాంటిదే. తాడుని చూసి పాముని భయపడితే ఆభయపడ్డ వ్యక్తికి జ్వరంవచ్చే నావకాశం వుంది...అది త్రాడుఅని నిరూపించేవరకూ ఆవ్యక్తి జ్వరం తగ్గదు.

ఇంకా అనేక ఉపమానాలు చెప్పి వెంకట్రావుగారు కోడలికి కొంత ధైర్యాన్ని చేకూర్చారు...

కాని వెంకట్రావుగారికి "ఇదేమిటి? దీంట్లోకుతంత్రం ఏదైనావుందా? దీన్ని లాగ వదిలించటం" అనే ఆలోచనలు పట్టుకున్నాయి. వెంకట్రావుగారికి ఏభయ్ ఏళ్లు దాదాపుగా వచ్చినప్పటికి మంచి బలవంతుడుగాను ఏముప్ఫయ్యేళ్ల వ్యక్తిగానో కనబడతారు. బలానికి తగ్గ ధైర్యవంతుడాయన. ధైర్యానికి తగ్గ చొరవ, చురుకు ఉన్నాయి. దీన్నెలాగయినా ఒక అంతానికి తేవాలనుకున్నారు.

ఇంట్లోవాళ్లందరికీ ధైర్యం చెప్పినప్పటికీ దీని వెనకఏదో వుందనే స్థిర నిశ్చయానికి వచ్చాడాయన. ఎందువల్లంటే కొన్ని కొన్ని స్థలాల్లోవుండే వస్తువులు స్థలాలు మారుతున్నాయి. వాట్లని ఇంట్లో ఎవ్వరూ ముట్టుకోలేదన్నారు.

ఇద్దరు ముగ్గురు స్నేహితులు డిటెక్టివ్‌ని అప్పాయింటు చెయ్యమని ప్రోత్సహించారు. మరికొందరు "మేం వద్దని చెప్పలేదా? మరేం అనుకున్నారు?" అన్నట్లుగా ముఖాలు పెట్టారు. ఊళ్ళో విరివిగా తిరుగుతూన్న డిటెక్టివులని పెట్టడం ఎంత మాత్రం వెంకట్రావుగారి కిష్టంలేదు. "నేనే ఎందుకు ఈవిషయాన్ని కనిపెట్టలేను?" అన్న ధైర్యం ఆయనకుంది.

ఏదైనా వెయ్యిరూపాయిల ఖరీదైన నెక్లెసు పోయింది. నిజంగా దెయ్యమే అయినట్లయితే దొంగిలిస్తుందా? అది అసాధ్యమయిన పని!

"పరిస్థితులు ఎలా మారుతాయో" అనుకుని వెంకట్రావుగారు రాత్రిళ్లు కాస్త మెలుకువగా వుండటం మొదలుపెట్టారు.

రెండురోజులు మళ్లీ ఏవీలేదు. ఆ తరువాత ఏవో కొన్ని చప్పుళ్లవుతున్నాయని కొడుకు సుబ్బారావు చెప్పాడు.

"దీని అంతు తేల్చాలని దీక్షవహించారు వెంకట్రావు గారు.

ఒక నెలరోజులు మామూలుగానే సాగింది. ఇంట్లో అందరూ ఆవిషయం కొద్ది కొద్దిగా మర్చిపోవడం ప్రారంభించారు. ఆ గొడవ అణిగింది. వెంకట్రావుగారు ఇంట్లో వాళ్లకికూడా చెప్పకుండా దుడ్డుకర్ర ఒకటి పుచ్చుకుని కాపలాకాయడం మొదలు పెట్టారు. ఆయనకేమీ ఆచూకీ కనబడ్డం లేదు.

కాని ఆయనకొక అనుమానం వచ్చింది. తిన్నగావెళ్ళి సామానుగది పరిశీలనగా చూశారు. ఎక్కడా ఏవిధమైన గుర్తులూ కనబడలేదు. ఆగదికి ఒకే ఒక గుమ్మం వుంది. అదితాళం వెయ్యబడి వుంది. ఆతాళపుకప్ప ఈమధ్యనెప్పుడు తెరిచినట్లుగా కనబడ్డం లేదు. దుమ్ముతో నిండివుంది. అందులో సామానే వుందా? లేకపోతే ఏం వుంటుంది? అది ఆయన ఆలోచన. ఇంట్లో వున్న తాళాలన్నిటితోటి ఆకప్ప తియ్యడానికి ప్రయత్నించారు. కాని కదల్లేదు.

గునపంతో పెల్లగించి తాళం కప్ప ఊడ బెరికారు. తలుపుగొళ్లెం తీసి లోపలికి వెళ్లారు. మామూలుగానే వుంది...దుమ్ము దుల్లుతూ వుంది. చెదపట్టిన కర్ర కుర్చీలు చిరిగిన చాపలు పడివున్నాయి. గోడకి ఒక అలమార వుంది. దాని తలుపులు కూడా సగం సగం విరిగి ఉన్నాయి...ఎక్కడా అనుమానాస్పదమైన విషయాలు కనబడలేదు. అయినప్పటికి ఆ రాత్రి అందులో దాగికొని చూద్దామనుకున్నారు వెంకట్రావు గారు. దుడ్డుకర్ర పుచ్చుకుని ఒక మూలగా చాప వెనక దాగి కూర్చున్నారు. పొంచి చూస్తున్నారు...అలా చూస్తుండగానే నేలమీద ఒకనాపరాయి లేచింది...జాగ్రత్తగా చూస్తున్నారు వెంకట్రావుగారు. నల్లటి ముసుగుతో ఒక ఆకారం పైకి ఎక్కింది. అటూ ఇటూ చూసింది... చూసి గోడలో ఒక మీటి నొక్కింది... ఆ మీట తెలుసున్నవాళ్ళకి తప్ప ఎక్కడుందో ఎవ్వరికీ తెలియదు. గోడలో ద్వారం ఏర్పడింది...ఆ ఆకారం గోడలో దూరుతూంది. అదేసమయంలో వెంకట్రావు గారు దుడ్డుకర్రతో ఒక పెట్టుపెట్టారు... అంతే "బాబోయ్'' అంటూ ఆ ఆకారం క్రింద పడింది చైతన్య రహితంగా....

"వెంకట్రావు దెబ్బంటే దయ్యాలు పాడులుతాయి, జాగ్రత్త, కదిలావంటే?" అంటూ దుడ్డుకర్ర గుండెల మీద గురిపెట్టి పట్టుకుని సుబ్బారావుని పిల్చారు వెంకట్రావు గారు. ఇంట్లో వాళ్లందరూ లేచారు. సుబ్బారావు గదిలోకి వచ్చాడు.

"దయ్యం దొరికి పోయిందిరా అబ్బాయి. త్రాడు తీసుకురా కట్టివేస్తా!'' అన్నారు వెంకట్రావుగారు నవ్వుతూ.

సుబ్బారావు త్రాడు తీసుకునిరాగా వెంకట్రావుగారు కొడుకుతో కలసి దయ్యాన్ని వీధి స్తంభానికి కట్టిపెట్టారు.

"హమ్మయ్య" అనుకున్నారందరూ.

తెల తెల్లవారుతూంది. ఆ వ్యక్తి ముఖం చాలా వికృతంగా వుంది. పోలీసులను రమ్మంటూ రిపోర్టు ఇచ్చారు.

అందరూ వచ్చారు. వెంకట్రావుగారు దయ్యం ముఖంమీద పిడికిలి బిగించి ఒక్క గుద్దు కసిదీరా గుద్దారు. అసహ్యమైన తొడుగు ముక్కలు ముక్కలై క్రింద పడింది.

ఆ అసలు ముఖంచూసి అందరూ ఆశ్చర్య పోయారు!

ఎవరూ?

ఇంటి యజమాని రామారావు!

నిర్ఘాంత పోయారందరూ. గదిలోకి వెళ్లి సొరంగంలోకి దిగారు. అది తిన్నగా కొంపొండు అవతలగా వున్న పొదలోకి వుంది! రామారావు పట్నంలో వుంటున్న ఇల్లు సోదా చెయ్యగా ఆ సొరంగం దొరికింది!

అప్పుడు సబ్ ఇన్‌స్పెక్టరుతో ఈ మాదిరిగా చెప్పటం ప్రారంభించారు వెంకట్రావు గారు:

"రామారావుగారికి వుద్యోగం లేదు. ఆయన పట్నంలో ఇంట్లో వుంటూ ఈ ఇంటిని తక్కువ అద్దెలకిస్తూ, అద్దె కుంటున్న వాళ్లని బెదరిస్తూ అందినంతవరకు దొంగిలిస్తూ ఆస్తిని సంపాదించాడు. నాకసలు మొదటి నుంచీ అనుమానమే ఇంత ఆస్తి ఈయన కెలాగ వచ్చిందాఅని...నాకు దయ్యాలంటే నమ్మకం లేదు. దాన్ని పట్టుకుందామనే ఈఇంట్లో దిగాను..." అంటూ తను చేసినదంతా వివరించాడు వెంకట్రావుగారు.

ఇన్‌స్పెక్టర్, వెంకట్రావుగార్ని అభినందించాడు. ఒక వెండి పొన్నుకర్రని బహుమతీ చేశాడు. ★

పరమ శివార్చన

గత సంచిక తరవాయి

౮

వెంటనే శూరమంత్రి అరత్నాంగుళీయకం భూతేశ్వరస్వామి ఆలయ ధర్మాధికారికి అప్పగించివేశాడు. అప్పటికా విషయంలో అతని హృదయభారం కొంతవరకు తగ్గింది.

కాని పినాకధన్వను భవంతిలోనించి వెళ్ళగొట్టినప్పటినించీ జయమంగళ తిన్నగా అన్నపానాలే ముట్టడం మానేసింది. కుమారుడు వెళ్ళిపోగానే మంత్రికూడా బాగా కించపడ్డాడు. జయమంగళతో ఆ విషయమే చెప్పి నెమ్మదిగా ఓదార్చాడు:

"అప్పుడైనా జరిగినదంతా ఉన్నది ఉన్నట్టుగా నాతో చెబుతాడేమోనని నయానా భయానా అనేకవిధాలుగా బుజ్జగించిచూచాను. జరిగినదంతా చెప్పిఉంటే అది మహారాజసన్నిధిని విన్నవించి ఎలాగోఅలాగ ఆయన క్షమాభిక్ష వేడి ఉందును. కాని మాటిమాటికీ నన్నే మోసగిస్తే నేనేమి చెయ్యగలను? శివద్రవ్యం అపహరించినవారీమధ్యనే నా చేతుల్లో దారుణ మరణదండన లనుభవించారు! శివద్రోహిని ఇంట్లో పెట్టుకున్నానంటే నేనెలాగ శివార్చన చెయ్యగలను? లోకులేమంటారు? ఇక మహారాజును నే నేముఖంపెట్టుకుని చూడగలను! అదీగాక మా వంశీయులెవరైనా ఇలాంటి అధర్మకృత్యాలాచరించారా? అప్పటికీ నేను ఆ శిక్ష గృహనిర్వాసనంతో సరిపెట్టాను. దీనికే లోకులు నన్నేమని ఆడిపోసుకుంటారోనని భయపడుతున్నాను."

జయమంగళ అదంతా వినీ విననట్టు ప్రశ్నించింది:

"ఇంతకీ మన ధన్వ ఎక్కడికి వెళ్ళిందీ ఏమైనా తెలిసిందా?"

"లేదు. వేగులవారందరు అతని జాడే తెలియలేదని అంటున్నారు! ఒకవేళ మిగిలిన బందిపోటు దొంగలతో కలిసి హిమవన్నగ ప్రాంతాలకు పారిపోయాడేమోనని భయపడుతున్నాను."

"అయితే ఇక నే నీభవంతిలో ఒక్క క్షణం ఉండలేను! నన్నుకూడా మా పుట్టింటికి పంపించివెయ్యండి! ఆ ఈపైన మీరొక్కరు ఇక్కడ ఉండి ఈ రాజ్యం అంతా ధర్మదేవత నాలుగు పాదాలతోను నడిచేటట్టుగా అతిజాగ్రత్తగా ఏలుకోండి!"

జయమంగళ మళ్ళీ వలవలా ఏడ్చింది. పుట్టింటికి పోతానని పట్టుపట్టింది. మంత్రికికూడా ఆసమయంలో ఇక అదే శరణ్యమని తోచింది. అదీగాక ఆ దుఃఖావేశంలో ఆమె అక్కడఉండేటట్టుకూడాకనబడలేదు. ఇక చేసేదేమీలేక ఆమె నామరునాడే పుట్టింటికి పంపించివేశాడు. ఇక ఆభవంతిలో మిగిలిన దతడు, రత్నవర్ధనుడు, మరికొందరు పరిచారికాపరిచారకులు మాత్రమే!

పినాకధన్వ నిర్వాసనంతో మంత్రికి తన ధర్మనిర్వహణంలో కొంతవరకు సంతృప్తి కలిగింది. కాని ఆభవంతి అంతా అతనికి కేవలం శ్మశానప్రాయంగా కనిపించింది. అయినా అతడు తన ధర్మనిర్వహణ శ్రద్ధ ఏమరలేదు! కాశ్మీర రాజ్యంలో దేవాయతనాల రక్షణకు కావలసిన గట్టికట్టు దిట్టాలన్నీ చేయించాడు. దైవద్రవ్యం అపహరించిన వారినందరినీ గాలించి గాలించి పట్టుకుని మదించిన ఏనుగుల కాళ్ళకింద పడవేయించి మట్టించి వేయించాడు.

అయితే భూతేశ్వర దేవాలయ సంరక్షణే అతనికంతగా సంతృప్తికరంగా కనిపించలేదు. అది శ్రీనగరానికి కనతిదూరంలో పర్వతమధ్యంలో నిర్మించిన దేవాలయం! ఆలయప్రాకారం దాటి పదిఅడుగులదూరం సాగిపోతేఆపైనకనిపించేదంతా సాంద్రారణ్యమే. ఆదేవాలయానికి సంబంధించిన మడిమాన్యాలాఅరణ్యప్రాంతాని కానుకునే ఉన్నాయి. పర్వత ప్రాంతాలలో నుంచి వచ్చిన బందిపోటు దొంగలప్పుడప్పుడాఆలయం దోచుకుపోవడం జరుగుతూనే ఉంటుంది. అయితే శూరమంత్రి ఆదొంగలలో చాలామందిని హతమార్చివేశాడు. ఇక మిగిలినవారందరూ పడలెత్తిపోయి కొండలు గుట్టలు పట్టిపోయారు.

అలాగ పది పదిహేను రోజులు గడిచిపోయినా శూరమంత్రికి మరి పినాకధన్వ జాడే తెలియలేదు. బందిపోటు దొంగలతో కలిసి అతడెక్కడో ఏపర్వత గుహాలోనో దాగిఉండవచ్చునని మంత్రి నిశ్చయించాడు. ఆపైన ఎన్ని విధాల ప్రయత్నించినా అతనికి ధన్వజాడ దొరకలేదు. పుట్టింటికి వెళ్ళిన జయమంగళ ఇంకా తిరిగి రాలేదు. క్రమక్రమంగా అతనిలో ధైర్యం సన్నగిలింది. మళ్ళీ వారణాసికి వెళ్ళిపోవాలనే సంకల్పం బాగా బలపడింది. ధన్వ వెళ్ళినప్పటినించీ, శివస్వామికి మంత్రి భవంతికి వచ్చి ఆయనతో కొంతకాలంపాటు ఇష్టాగోష్ఠి జరిపివెళ్ళడం ఒక పరిపాటిఅయింది. ఒకనాడుదయమే అతడు మంత్రి భవంతికి విచ్చేశాడు. మంత్రి అతనితో కొంతకాలం ఇష్టాగోష్ఠి జరిపాడు. వారిద్దరి ప్రసంగము క్రమంగా ధన్వమీదికి తిరిగింది. మంత్రి ఉసూరుమని ఒక వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు:

"స్వామీ! నేనీ అమాత్యాధికారం చేపట్టి అప్పుడే ఒక పుష్కరం పైగా గడిచిపోయింది. నే నెరిగి ఉన్నంతవరకు ఎవరికీ ఏ విధమైన అపకారము చేసిఉండలేదు. నా కిటువంటి శివద్రోహి దత్తపుత్రుడుగా సంప్రాప్తించడానికి కారణమేమిటి?"

మంత్రి మళ్ళీ నిట్టూర్చాడు. శివస్వామి అతని నోదార్చాడు:

"దీనిలో అంతగా ఆశ్చర్యపడవలసింది నా కేమీ కనిపించడంలేదు. పరమశివార్చన తదితర దేవతారాధనకన్న బహు దుష్కరమైనదని శివాగమశాస్త్ర వేత్తలు సెలవిస్తున్నారు! అందులోను మీరా పరమశివుని కేవలం ధర్మమూర్తిగా భావించి అనుక్షణము ఉపాసిస్తున్నారు. కనక నే మీ కిటువంటి అగ్నిపరీక్ష తటస్థించింది. భక్తుల ననుగ్రహింప దలిచినప్పుడా పరమేశ్వరుడు వారికెన్నైనా కష్టపరంపరలు కల్పిస్తూంటాడని పెద్దలంటారు. అయినా



విజ్ఞులు, మేరుధీరులు అయిన మీకు నేను వేరే విన్నవించవలసింది ఏముంది?"

మరికొంతసేపటికి వారి ప్రసంగం వారణాసి యాత్రమీదికి తిరిగింది. మహారాజెన్నిమార్లు ప్రార్థించినా తన కోరిక మన్నించడం లేదని మంత్రి ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు. శివస్వామి అందుకొన్నాడు:

"నాదొక్క మనవి! మీరు నాకిచ్చిన చనువును పురస్కరించుకుని మీతో ఒక చిన్న విషయం ముచ్చటించాలని ఉవ్విళ్లూరుతున్నాను. సెలవైతే—"

మంత్రి జిజ్ఞాసార్థకంగా, బొమముడి విరిచాడు. శివస్వామి సవినయంగా విన్నవించాడు:

"మీ ధన్వ ఆకతాయితనం బాగా పెచ్చుపెరిగినకొద్దీ మీలో ఈ యాత్రాసంకల్పం బాగా బలపడింది. అంతకు పూర్వం యీ సంకల్పం మీలో ఇంతగా బలపడలేదు."

శూరమంత్రి తల ఎత్తి శివస్వామివైపు చూచి అతని మాటలలోని అంతరార్థం నిశితంగా అర్థం చేసుకొన్నాడు. మంత్రికతని మాటలలో కొంతవరకు యాథార్థ్యం లేకపోలేదని అనిపించింది. తక్షణమే అతని కాతరుణంలో తిరిగి ఒక కనువిప్పు కలిగింది. తన విద్యుక్తధర్మ నిర్వహణ భీతివల్లనే, తన్వమీది మమకారంవల్లనే తనకిటువంటి యాత్రాసంకల్పం కలిగిఉండవచ్చుననీ ఇన్నాళ్లనించీ ఆవిషయం అంతరాంతరాలలో అజ్ఞాతంగానే ఉండిపోయిందనీ మంత్రి కొంచెం గుర్తించుకొన్నాడు. కాని ఆ పరాజయం అంగీకరించడానికతడిష్టపడలేదు:

"స్వామీ! విజ్ఞులయిన మీకు నేనేమని విన్నవించగలను! కాని నా తల్లిదండ్రులు

★ పరమశివార్చన ★

నాకు 'శూరు'డని నామకరణం చేశారు. ఇంతవరకు నాజీవితంలో వారు పెట్టిన నామ ధేయానికి ఎన్నడు అపఖ్యాతి రాలేదు. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు ఇక ముందుకూడా అటువంటి అపఖ్యాతి రానే రదు. భీరుత్వం అనేది మా ఇంటా వంటా ఎన్నడూ వినబడలేదు. ఇకముందు కూడా వినబడనేరదు!"

మంత్రి గర్జనవిని శివస్వామి కిమ్మనకుండా తాంబూల చర్వణలో పడ్డాడు. ఒక నిమిషం నేపూరుకుని నెమ్మదిగా నీళ్లు నమి లాడు:

"ఎంతమాట! మీ శూరత్వం శంకిస్తున్నా నని అనుకొన్నారా? అది కాదు నేనసేది. అతడల్లారుముద్దుగా పెరిగినవాడు. కన్న మమ కారం కన్న పెంచిన మమకారం పెద్దదని అంటారు.! అదీగాక ఒక కుమారుడున్నా లేనట్లే అని ధర్మవేత్తలంటారు! దానా దీనా మీమనస్సేమైనా విషమ సంధిలో పడిం దేమోనని విన్నవించుకొన్నాను. అంతే!" పిమ్మట శివస్వామి మంత్రిదగ్గర సెలవు తీసు కొని తన భవంతికి మరలిపోయాడు.

౨

మరి పదిరోజులు గడిచిపోయే సరికి శ్రీనగ రం అంతా రాబోయే శివరాత్రి మహోత్సవ కోలాహలంతో కలకలలాడింది. ఆనాటి కాశ్మీరంలో శివరాత్రి ఆబాలగోపాలానికీ ఒక గొప్ప మహోత్సవం. కాశ్మీరరాజబం ధువులంతా మహాశివరాత్రికి స్వయంగా శివ పూజ చేస్తారు. శైవ దేవాయతనాలకు దాన ధర్మాలు, శైవాగమశాస్త్రవేత్తల కగ్రహార దానాలు ఇంకా ఎన్నెన్నో ధర్మకార్యాలు చేస్తారు. అవంతివర్మ స్వయంగా భూతేశ్వర స్వామికి పూజాభిషేకాలు చేసి ఆరోజంతా ఉపవసిస్తాడు. ఇక మిగిలిన శ్రీనగర పౌరు లామహోత్సవ కోలాహలంలోపడి మైమరిచి పోవడంలో ఆశ్చర్యం ఏమి ఉంది!

శ్రీనగర దండనాథుడు రాజమంత్రులిద్దరికీ భూతేశ్వరస్వామి దేవాలయ పరిసరపర్వ తాలపై ప్రత్యేక స్కంధావారా లేర్పాటు చేయించాడు. ఆ స్కంధావారా లలో వారికి సమస్త సుఖవసతులు ఏర్పాటు చేయించాడు. దేవాలయార్చకులకు, రాజ పురోహితులకు పూజాపునస్కారాలకు కావలసిన సంభారాలన్నీ సిద్ధం చేయించవల సిందని ఆజ్ఞాపించాడు.

మంత్రి స్వయంగా దగ్గర ఉండి ఆ ఏర్పాట్లన్నీ యథావిధిగా జరుగుతున్నదీ లేనిదీ చాలా జాగ్రత్తగా పరిశీలించాడు.

ప్రధాన వీధులు కొండ రామహోత్సవం కళ్ళారా చూచి ఆనందించాలనే తహ తహతో ఆ పరిసర ప్రాంతాలలో విడుదు లేర్పాటు చేసుకొన్నారు.

అవంతివర్మ అంతఃపురాంగనలతో కలిసి భూతేశ్వరాలయానికి బయలుదేరాడు. అంతఃపురాంగనలంతా పిల్లలతోను పాపల తోను వేర్వేరు పల్యంకికలలో స్వామి ఆల యానికి ప్రయాణమయ్యారు. పల్యంకికల కెదురుగా అవంతివర్మ పట్టపు టేనుగు అటు ఇటు తూగుతూ ఒయ్యారంగా సాగిపోయింది. బంగారు అంబారిలో సుఖా సీనుడై చిరునవ్వులు చిందించే మహారాజును చూచి కాశ్మీర ప్రజ ఆబాలగోపాలము, చేతులెత్తి నమస్కరించి జయజయధ్వానాలు చేశారు!

ఆ మహోత్సవం అంతా కళ్ళారా కలయ జూచిన శూరమంత్రి హృదయంలో గద్గదిక బయలుదేరింది. వేడి వేడి కన్నీరు చెక్కిళ్లపై ధారకట్టి ప్రవహించింది. గడచిన సంవత్సరం శివరాత్రి కతడు జయ మంగళతోను, కుమారుడు రత్నవర్ధనునితోను కలిసి స్వయంగా స్వామికి పూజాభిషేకాలు చేశాడు. పినాకధన్వ కూడా అంటీ అంట నట్టుగా పూజాభిషేకాలు నిర్వర్తించాడు.

మళ్ళీ శివరాత్రి తిరిగివచ్చే సరికతని శిరస్సుపై ఒక పెనుప్రళయం విరుచుకు పడింది. పినాకధన్వ కొండలు, గుట్టలు పట్టి పోయాడు. భార్య జయమంగళ ధన్వలేని భవంతిలో ఉండలేనని పుట్టింటికి వెళ్ళి పోయింది.

రత్నవర్ధను డొక్కడే ఆ మహోత్సవం చూడాలని అతని వెంట వచ్చాడు.

"పరమేశ్వరుని కీశివరాత్రికి నా మీద పూర్తిగా అనుగ్రహం తప్పింది. లేకపోతే నా మీద ఇన్ని ఆపద లొక్కమారుగా ఎందుకు విరుచుకు పడతాయి?"

శూరమంత్రి ఉసూరుమని వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. దూరదూరంగా ఉత్తరదిశలో అతనికి కెదురుగా హిమవన్నగ శిఖరా లసం ఖ్యాకమైన స్ఫటికలింగ స్వరూపాలతో ప్రత్యక్షమైనాయి.

ప్రాతఃకాల సూర్యకిరణా లాశిఖరాలపై దేవకాంచన పుష్పవృష్టి కురిపించాయి. ఇంకా బాగా విడివడని మంచు తెరలలో శ్రీనగర ప్రాసాద శిఖరాలు, శివవిష్ణుదేవా లయాల సువర్ణ కలశాలు మానస సరోవరంలో అప్పుడప్పుడే వికసించే పసిడి తమ్మిపూల తీరులలో కనులకు మిరుమిట్లు కలిగించాయి. భూతేశ్వరస్వామి దేవాలయంలో వేయి బంగారుగంట లొక్కమారుగా ఓంకార నాదా లారంభించాయి. శంఖ మిన్నందుకొన్నాయి. మంగళ తూ ర్యాలు చెవులు చిల్లులు పడేటట్టు ఘోషించి మోగాయి.

ఆ ధ్వనులలో మధ్య మధ్యన పురోహి తనక చమక పారాయణాలు, వేదమ పాఠాలు వీనులకింపుగా వినిపించాయి.

ఆ మంగళ పాఠా లాలకించిన మంత్రి మహారాజప్పుడే శివపూజ కుపక్రమించారని అనుకొన్నాడు.

కొంచెందూరంలో విడిదిచేసిన రాజసైన్య స్కంధావారాలలోనుండి హయహేష గజ బృంహితాలు గంభీరంగా వినిపించాయి.

మంత్రి తన స్కంధావారంలోనికి వెళ్ళి ఆ మహోత్సవపు ఏర్పాట్లన్నీ అతి జాగరూ కతతో పరిశీలిస్తూ వేయికళ్లతో కనిపెట్టి చూస్తున్నాడు.

అంతలో హఠాత్తుగా భూతేశ్వరాల యంలో మంగళ తూర్యధ్వను లొక్క మారుగా నిలిచిపోయాయి.

వెనువెంటనే రాజపురోహితుల వేదమంత్ర పారాయణలుకూడా స్తంభించి పోయాయి. స్వామి దేవాలయంలో గర్భగుడి, ఆ పరిస రాలు అన్నీ ఒక్కమారు గొంతు నొక్కి వేసినట్టుగా నీరవమూర్తులై నిలిచాయి.

ఆ విడ్డూరానికి కారణమేమో శూర మంత్రికి తెలియలేదు. క్రమక్రమంగా అతని హృదయంలో అలజడి ప్రారంభమయింది. అంతలోనే శ్రీనగర దండనాథు డక్కడికి వచ్చి సవినయంగా మంత్రికి నమస్క రించాడు.

మంత్రి కంగారుపడుతూ క్షణకాలం అతని ముఖమైఖరి పరిశీలించాడు. దండ నాథునికి మాటలు తడబడ్డాయి:

"మహారాజు తమపూజాభిషేకాలు పూర్తి కాకుండానే మధ్యలోనే తమ స్కంధా వారంలోనికి వెళ్ళిపోయారు!"

"కారణం?"

"ఏమోగాని విపరీతమైన శిరోవేదనతో బాధపడుతున్నామని అన్నారు. అంతే!"

"అసలు కారణం?"

"ఏమని విన్నవించుకోను! తీరా మహా రాజు పూజ కుపక్రమించేసరికి అక్కడ స్వామి సువర్ణకళాశాలుగాని, రత్నహారాలు గాని చివరికి నైవేద్యం పెట్టడాని కొక ద్రాక్షఫలంగాని కనిపించలేదట!"

"అవన్నీ ఏమైపోయాయి?"

"నిన్న అపరాత్రివేళ బందిపోటు దొంగ లెవరో లోపల ప్రవేశించి అవ్వన్నీ అపహ రించుకుపోయారట!"

మంత్రి తాను వింటున్నానా, కలగంటు న్నానా అని నిర్ఘాంతపోయాడు:

"అయితే మీ రంతా ఇక్కడ ఉండి

ఏమి చేస్తున్నట్టు?" ఒళ్లెరగని క్రోధావేశంతో గట్టిగా గర్జించాడు మంత్రి.

"మేమంతా ఈ ఉదయానికే ఇక్కడికి చేరుకున్నాము. జరిగినదంతా గత రాత్రే జరిగిపోయింది."

"మరి ఆ పూజారులు, రాజపురోహితులు ఏమి చేస్తున్నట్టు?"

"వారందరు తెల్లవారిన పిమ్మటే అంతటిఘోరం జరిగిందని తెలుసుకున్నారు?"

"అయితే వెనువెంటనే నాకీ విషయం ఎందుకు తెలియజేయలేదు?"

మంత్రి కళ్ళమ్మట నిప్పులు రాలాయి.

దండనాయకుని నోట మాట పెగలలేదు. నెమ్మదిగా వినబడీ వినబడనట్లుగా నీళ్లు నమిలాడు:

"అంతవివరంగా తమతో విన్నవించుకోవడానికి వ్యవధి ఎక్కడిది? రాజపురోహితులు పూజారులు గర్భాలయంలో ప్రవేశిస్తూనే అంతటి ఘోరం జరిగిందని తెలుసుకున్నారు! అంతలోనే మహారాజు పూజార్థమై గర్భాలయంలో ప్రవేశించారు. పూజారుల ముఖభంగిమలనుబట్టి ఆయన జరిగినదంతా ఒక్క క్షణంలో అర్థం చేసుకుని శిరోవేదనతో బాధపడుతున్నానని చెప్పి వెంటనే తమ స్కంధావారంలోకి వెళ్ళిపోయారు".

శూరమంత్రి కప్పటికి జరిగినదంతా కొంత వరకు తెలిసింది. అయితే తా నేర్పాటుచేసిన దేవాలయ రక్షకు లేమై పోయారో అతనికి తెలియలేదు. మళ్ళీ దండనాథునిమీద మండిపడ్డాడు:

"మీ కిలాంటివన్నీ చెయ్యడాటిపోతే గాని నా చెవినివెయ్యరు! మరి దేవాలయ రక్షణ కేర్పాటుచేసినవారంతా ఏమైపోయారు! ఎక్కడైనా హాయిగా పడుకుని నిద్ర పోతున్నారా?"

"వారి నందరినీ బందిపోటు దొంగ లంతకు ముందే హతమార్చి వేశారట!"

ఆ ప్రత్యుత్తరం విని మంత్రి దండనాథుని మీదిమీదికివెళ్ళి విరుచుకు పడ్డాడు:

"ఇంత జరిగినా మీరంతా నిమ్మకు నీరెత్తినట్టిక్కడ ఈ ఉత్సవ కోలాహలంలోపడి వినోదిస్తున్నారా? వెంటనే ఆ బందిపోటు దొంగలను పట్టుకుని, ఆ తరవాతే ఇక్కడికి రావాలని మీ కెందుకు తోచలేదు?"

"తమ ఆజ్ఞకోసమే నే నిక్కడికి వచ్చాను. తమ ఆజ్ఞే ఇక తరవాయి."

"చాలెండి! మీసాకులు మీ రూను! వెంటనే మీరందరు సైన్యాలతో కదలిపోయి మధ్యాహ్నంలోగా ఆ దొంగల నందరినీ బంధించి ఇక్కడికి తీసుకురావాలి! అంతవరకు మహారాజు మరి పూజా పునస్కారాలారంభించరు! తెలిసిందా? త్వరగా కదిలి వెళ్ళండి!"

దండనాయకు డక్కడినించి కదిలి వెళ్ళగానే శూరమంత్రి కొక గడియ సేపటివరకు ఇంకా ఆలోచనే తోచలేదు.

"ఎంతటి ఘోరం జరిగింపోయింది! ఎంతటి ఘోరం జరిగిపోయింది! ఇది ఏదో దారుణ దైవదుర్విపాకమే!" అనుకొని తొందరగా అడుగులు వేసుకుంటూ మంత్రి తాను విడిది చేసిన స్కంధావారంలోకి వెళ్లాడు. అతని కావేళ మహారాజు దర్శనం చెయ్యడానికే మనస్కరించలేదు! అతని జీవితంలో అటువంటి మహోత్సవసమయంలో అంతటి ఘోరమెన్నడు జరగలేదు! కాని ఆ విషమసంధిలో అతనికి మహారాజ దర్శనం చెయ్యకతప్పలేదు. కనక ముందుగా ఆ బందిపోటు దొంగల వ్యవహారం పూర్తిగా తేలే దాకా మహారాజదర్శనమే చెయ్యదలుచుకోలేదు.

౬

అటుపిమ్మట శూరమంత్రి మిట్టమధ్యాహ్నం వేళ మహారాజదర్శనానికి బయలుదేరి వెళ్లాడు. అవంతివర్మ అంతవరకు తన స్కంధావారంలో హంసతూలికా తల్పం మీదనే విశ్రమించిఉన్నాడు. మంత్రిని చూడగానే నెమ్మదిగా లేచికూర్చున్నాడు.

"తమ శిరోవేదన ఎలాగున్నది?" అన్నాడు మంత్రి చేతులు జోడించి.


"కొంచెం తగ్గింది. క్రమక్రమంగా తగ్గిపోవచ్చును."

అవంతివర్మ ఊనూరుమని నిట్టూర్చాడు. అంతేనేగాని దేవాలయ చౌర్యాన్ని గురించిగాని మరి ఇంకేవిషయాన్ని గురించిగాని మంత్రితో ప్రస్తావించనేలేదు. మహారాజు మౌనం శూరమంత్రిని మరింత వేధించింది.

అవంతివర్మ కింతవరకు మంత్రి రాజ్యకార్య నిర్వహణాన్ని గూర్చి ప్రశ్నించవలసిన అవసరమేకలగలేదు. ఆ మహాశివరాత్రినాడు మాత్రం అవంతివర్మ కటువంటి అవసరంకలిగింది. కాని అతడు శూరమంత్రియెడల తనకున్న గౌరవంకొద్దీ, సౌహార్దంకొద్దీ ఆ విషయమే ఎత్తుకోలేదు. కనకనే ఆ విషయం మంత్రి నంతగా మథనపెట్టింది. మహారాజు శిరోవేదనకు కారణంకూడా అదేనని శూరమంత్రి అంతకుపూర్వమే అర్థం చేసుకొన్నాడు. మహారాజు మౌనం చవిచూచిన మంత్రి ఒకటి రెండు నిమిషాల వరకు అలాగే చేతులు జోడించి నిలుచున్నాడు. పిమ్మట నెమ్మదిగా విన్నవించాడు:

"మహారాజా! నా అశక్తతమూలంగా తమ మహాశివరాత్రి వ్రతానికొక పెద్ద అంతరాయమే ఏర్పడింది. ఇప్పుడిక ఆ అంతరాయం అంతా పూర్తిగా తొలిగిపోయింది. తమ రిక పూజాభిషేకాలకు ఉపక్రమించవచ్చును! నా బొందిలో ప్రాణం ఉండగా ఇక ఇటువంటి అంతరాయం ఎన్నడూ

(54-వ పేజీ చూడండి)


పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
అవును. రెక్సోనా సబ్బును ప్రతి రోజూ మీరు వాడుచుండుటవల్ల మీ చర్మ సౌందర్యము ఎంతో ఎక్కువ నవనవలాడుచు. కాంతివంతముగా నగును. ఎందుకనగా పరిమళమైన రెక్సోనా ఒక్కటే కేడిల్. చర్మ సౌందర్యము కొరకు నిర్మితమైన నూనెల ప్రత్యేక మిశ్రమము. తోగూడియున్నసబ్బు. రెక్సోనాయొక్క నిలవుండే పరిమళమును, సమృద్ధయిన మృదువగు నురగను వాడి ఆనందించుడు: ఈ సౌందర్యమునిచ్చు సబ్బును ప్రతిరోజూ వాడుడు. రెక్సోనా మీ సహజ మనోహరత్వమును బయల్పరచుటకు సహకరించును.
Rexona
BLENDED WITH CADYL
—ఇది ఒక్కటే కేడిల్‌తో గూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరపున భారతదేశంలో తయారుచేయబడినది
146 A - X 52 TL
రెక్సోనా (సామాన్యసైజు)పై కొత్తవు మూతలు మీకు సొమ్మును మిగుల్చును. నేడే మీ వ్యాపారిని అడుగుడు.

తోటి కోడళ్ళు

చిగువుతూన్న సరస్వతి బాబు ఏడుపు విని తల తిప్పిచూచింది. తప్పటడుగులు వేసే బాబు గుమ్మం దాటలేకపోయాడుగావును గడప మీద బోర్లాపడి ఏడుస్తున్నాడు. బాబుని తియ్యటానికి సరసు లేవబోయింది, గాని ఏదో గుర్తొచ్చినట్టుగా తిరిగి కూర్చుని పుస్తకం అడ్డం పెట్టుకొని వారగా బాబుని చూడసాగింది. ఓ నిముషానికి లేచి కూర్చుని, పక్కగా పడిపోయిన బొమ్మని పొదివిపట్టుకొని రాగం తగ్గించి దిక్కులు చూస్తు నెమ్మదిగా ఏడుస్తున్నాడు బాబు. ఇంతలో వంటగదిలోంచి విసురుగా వచ్చి బాబు నెత్తుకుంటూ "ఏమే అలా బొమ్మలా కూర్చోపోతే పిల్లడు పడిపోయాడుగదా, కొంచెం తియ్యకూడదూ? పసిబిడ్డేడుస్తుంటే అలా వూరుకోటానికెలా మనసొప్పుతుందో!" అంది కోపంగా కన్న.

"అది కాదత్తయ్యా. వాణ్ణిప్పుడు సముదాయింపబోతే అసలే రెచ్చిపోతాడని, చూసీ చూడనట్టూరుకొంటే వాడే వూరుకొంటాడని తియ్యలేదు గానీ, వాడిమీద నాకు కోపమా?" అంది సరసు సైకాలజిస్టులా.

తప్పించుకోటానికి కావలసినన్ని దార్లు. అదే నీబిడ్డయితే యివన్నీ ఆలోచించే దానివా? యిష్టంలేక ఏదో చెప్పుకొస్తావేం? వెధవ్వేషాలూ నువ్వూను" అంది కన్న బాబుని బుజం మీద వేసుకొని పచార్లు చేస్తూ.

"ఇదిగో, నీకనేకసార్లు చెప్పాను. అలా వెధవా, గిధవా అనొద్దని. చెప్పేది వినిపించుకోకుండా ఎందుకలా మాటలు మిగుల్తావ్? మిగిలిన వాళ్ళంతా వెధవలైతే, యికనువ్వేనా పునిస్త్రీగా రాజ్యమేలేది?" అంది సరసు తీక్షణంగా. కన్న కాస్త భయపడింది. "మరే వమ్మా. నేనొక్కదాన్నే సుఖంగా బ్రతకాలని చూస్తున్నాను. ఏమిటో! వెధవలవాటు అలా మాటకిముందు ఆముక్కే వచ్చేస్తుంది. వెధవది. ఐనా నాపిచ్చగాని నాపిల్లాడి గురించి నీమీద సాములెందుకులే. అసలా యేడుపు వినపడేటప్పటికి అన్నం వారుస్తున్నాను. గానీ లేకపోతే నాపిల్లాణ్ణి నువ్వెంటుకోవాలా?" అంది సమర్థించుకొంటునట్టు.

"ఆమాత్రం బుద్ధి ముందు లేకపోయింది గావున్ను మరి. వచ్చీరాగానే వెధవా, పునిస్త్రీ అంటూ మొదలెట్టావ్. అసలు నాకిష్టమైతే ముట్టుకుంటాను లేకపోతే లేదు. దానికి నీ అధార్టీ ఏమిటి?, అసలు నీగురించి బామ్మతో చెప్పకపోతే అప్పుడడుగు. ఆఁ" అంటూ సరసు రుసరుసలాడింది.

"అబ్బో, ఎలాగోమరి! బామ్మ నాతల తీసి మొలేస్తుందేమో? అంతదాకా వస్తే నేను వదినతో చెప్పకపోతానా?" అంటూ వంటగదిలో కెళ్ళిపోయింది కన్న బాబుతో సహా.

*   *   *

సుమారు పన్నెండుగంటల సమయం. కాంతమ్మ, ధనమ్మ చావిట్లో పడుకొని కబుర్లాడుకొంటున్న సమయం. నిప్పులు చెరిగే ఎండలో రంయ్యమని రిక్షాలోదిగింది సరస్వతి విసురుగా. వీధిగుమ్మంలో రిక్షా

దద్దనాల రంగనాయకమ్మ

ఆగటం చూచిన కాంతమ్మ లేచి వీధిలోకి రాబోయింది. సరసు లోపలికొచ్చింది.

"అత్తయ్య రాకుండా నువ్వొక్కదానివే వచ్చావేమే" అంది బామ్మ ధనమ్మ. సరసు మొహం చిట్లించుకొని వూరుకొంది. ఈసారి కాంతమ్మడిగింది "ఏమ్మా, అత్తయ్య రాలేదేం?" అని.

"వస్తుందట" అంది సరసు అంటీ అంటనట్టుగా.

"మళ్లా ఏమైనా పోట్లాడుకొన్నారేవిటే?" అంది బామ్మ ధనమ్మ ఆశ్చర్యంగా.

"వూరుకోండత్తయ్యా. వాళ్లేం చిన్నవాళ్లా ఏమిటీ! చీటికీ మాటికీ పోట్లాడుకోటానికి" అంది కాంతమ్మ.

"కాకపోతే ఏవిటే మరి? దాని వైఖరి చూడరాదూ. దెబ్బలాడే వచ్చింది గావున్ను. అసలు నీమూలాన్నే వీళ్లింత బరితెగిపోయారమ్మా. ఏమే, మాట్లాడవ్? ఏమైనా అనుకొన్నారా?" అంటూ బామ్మ మనమరాలి మొహంలోకి చూచింది ప్రశ్నార్థకంగా.

"అవునా?" అన్నట్టుగా చూస్తోంది కాంతమ్మకూడా కూతుర్ని.

"మీ రేదో పోట్లాటంటారుగాని, మరి అది నన్ను అస్తమానూ ప్రతీ మాటకీ వెధవా, వెధవ్వేషాలూ నువ్వూనూ, అని అంటుందేం మరి? అలా అనొద్దని చెప్పండి దానికి" అంది నేలమాపులు చూస్తూ భయంగా సరసు.

"అవ్వ దానికేం పొయ్యేకాలమే? వెధవ మాటలంటానికి, రానీ కనుక్కుంటాను" అంది బామ్మ బుగ్గలు నొక్కుకుంటూ.

"ఆవిడికి చిన్నప్పట్నుంచీఅలవాటేగాదే! ఏదో సమర్థించుకోవాలిగాని, యీ మాత్రానికే యిలా వచ్చెయ్యటం తప్పుకాదూ?" అంటూ మందలించింది కాంతమ్మ కూతుర్ని.

ఇంతలో ఝామ్మని జట్కాలో దిగింది కన్న బాబుతో.

"అదిగో. అది వస్తోందిగావున్న" అంది బామ్మ కళ్లుచిట్లించి వీధిగుమ్మం వేపు చూస్తూ. కన్న లోపలికొచ్చి బాబుని మంచం మీద పడుకోబెట్టి కాంతమ్మదగ్గరకొచ్చి కూర్చుంది. సరసు మొహం తిప్పుకొంది.


"ఏమే, సరసుతో కల్సి రాలేదేం?" అంది బామ్మ కూపీతీస్తున్నట్టు.

"మీ కావిడ చెప్పలేదూ?" అంది కన్న.

"దానికేంగాని ఇద్దరూ పెద్దవాళ్లయ్యారు గదా. ఇంకా ఒకళ్ళనొకళ్ళు అనుకోటం ఏం బావుంటుంది కన్నా? నీ అలవాటు కొంచెం తగ్గించుకోవాలి మరి" అంది సమర్థిస్తున్నట్టుగా కాంతమ్మ.

"కొంచె మేమిటే? అంతా తగ్గించుకోవాలి" అంది బామ్మ కోపంగా.

"కాదొదినా, నే నేదో నోరుజారి అన్నాననే అనుకో, దానికే పరిగెత్తుకు రావాలా? అసలది ఏంచేసిందో చెప్పలేదన్నమాట. పిల్లవాడు గడపమీద బోర్లాపడిపోయి ఏడుస్తుంటే వాణ్ణి ముట్టుకోన్నా ముట్టుకోలేదే. ఆ కోపంలో అనేశాను" అంది కన్న ఖరాగా.



★ తోటి కోడళ్లు ★

"కాదమ్మా. నేనసలు వాళ్లెందుకు తియ్యలేదంటే..."

"ఆఁ. చాల్లే ఊరుకోందురూ, నేర్చారు. అయినదానికీ, కానిదానికీ తగూపెట్టుకొని, ఊళ్ళో పుట్టిల్లుందిగదా అని చిల్లరామల్లరా రిక్షాలకీ జట్కాలకీ పోసి ఘడిఘడీకీ రావటం నేర్చారు. నామూలాన్నే మీరు చెడిపోతున్నారని మీ అన్నయ్య అంటున్నారు కన్నా! ఇవ్వాళ ఊళ్ళోలేరుగాని వుంటే మిమ్మల్నిద్దర్నీ కేకలేసేవారే తెలుసా?" అంది కాంతమ్మ. కన్న ఏదో చెప్దామనుకొంది గాని, భయపడి వూరుకొంది. సరసు కూడా తలత్రిప్పి కూర్చుంది. బామ్మ అందుకొంది.

"లోకంలో అందరికీ పిల్లలున్నారు, అంతా కాపురాలు చేసుకొంటున్నారు గాని, మీకులా కొట్లాడుకొనే తోటికోడళ్ళెక్కడా వుండర్రా. మరీ మీరిపోతున్నారు. ఎవరేనా వింటే—అవ్వ—ఏమనుకొంటారు? పోట్లాటలాళ్లమ్మా, పోర్లీల వాళ్లమ్మా అని అనుకోరు? మీకు బుద్ధిలేకపోతే మాకులేదా? అంటారు. నేను నలుగురు తోటికోడళ్లతోను, ముగ్గురాడబిడ్డలతోను కాపరం చేశానుగాని మీలా వెలాగబెట్టామా? మీకు అత్తా లేదు ఆడబిడ్డాలేదు. మీలో మీకు పడక అఘోరిస్తున్నారు. అసలా నాదే చెప్పా. వినిపించుకొన్నారా నామాటకి పిల్లిద్దర్నీ వేరేవేరే యిద్దామని చెవినిల్లుగట్టుకొని పోరా. వింటేగా వాడు. పాపం అభమూ శుభమూ ఎరుగని ఆ అన్నదమ్ములికి చెల్లెల్నీ కూతుర్నీ కట్టబెట్టాడు. వాళ్ళనేం వేపించుకు తింటున్నారో పిల్లిద్దరూ కలసి?"

"అబ్బ వూరుకోందూ" అంది సరసు బామ్మ దగ్గర చనువుకొద్దీ. బామ్మ కస్సుమంది "ఏం వూరుకోవాలే? ఇన్నాళ్లూ యిలా వూరుకోబట్టేగా మితిమీరారు.? మళ్లా ఎదిరింపు కూడానా? కిందా మీదా పడుతూ అక్కడే పడివుండక యిక్కడికెగేసుకొస్తారెందుకూ?

వూళ్ళో వున్నందుకు బాగానే వుంది మీ వరస. హాయిగా యిద్దరూ చిన్న పనీ పెద్ద పనీ చేసుకొని కళకళ్ళాడుతూ వుంటే దానికి కీచులాట లెందుకే?" అంటూ అర్ధగంటసేపు గదమాయించింది బామ్మ. కన్నగాని సరసుగానీ ఏమీ చెప్పలేకపోయారు. వాళ్లిద్దరూ ఏడాది క్రిందటివరకూ మేనత్తా మేనగోడళ్లు. ఇప్పుడు తోటికోడళ్లుకూడాను. అతి చిన్న విషయంమీద తగూ పెట్టుకోటం, దాన్ని పెద్దదిగా చేసుకొని, మాటా మాటా అనుకొని పుట్టింటికి బయల్దేరటం, తప్పన్న వాళ్లు చివాట్లుతిని, సాయంత్రానికి యింటికి రావటం పరిపాటైపోయింది. కాని ఈసారి తగూలో ఎవరిది తప్పు? అని బామ్మగాని వదినగాని ఆలోచించకుండానే యిద్దర్నీ కేకలేశారు. వదిన తన పక్షమనుకొనే కన్న నిరుత్సాహపడింది. అకస్మాత్తుగా బామ్మ మారిపోయేసరికి, తన అభిప్రాయం మార్చేసుకొంది సరసు.

"వెళ్తాను వొదినా" అంటూ లేచింది కన్న.

"కాస్సేపుండండమ్మా. కాఫీలు తీసుకొని వెళ్దురుగానీ" అంది కాంతమ్మ.

"వాళ్లింటికి వాళ్ళని పోనీ. వెళ్ళి తాగుతార్లే" అంది బామ్మ.

"అయ్యో వుండండత్తయ్యా. ఏవో చిన్నతనం. వాళ్ళకే తెలుస్తుంది వివరం. తప్పమ్మా అలా పోట్లాడుకో కూడదు. జాగ్రత్తగా వెళ్లండి మరి" అంది కాంతమ్మ.

కన్న వీధిలో కెళ్ళి దారిన పోయే రిక్షాని పిలిచింది. లోపలికొచ్చి బాబుని భుజాన్నేసుకొని "వెళ్తా వొదినా. వెళ్తున్నామే అమ్మా" అని చెప్పి రిక్షాలో కూర్చుంది.

"ఆ వెళ్లండి. వెళ్ళండి. మళ్లా మాగడప తొక్కకండి మేం తీసుకొచ్చేదాకా" అంది బామ్మ వీధిగుమ్మంలోకొస్తూ.

"ఎక్కు సరసూ వెళ్ళి" అంది కాంతమ్మ కూతురితో. చేసేదిలేక సరసు చాలా ఇబ్బందిగా వెళ్లి ఓ మూలగా ఒదిగి కూర్చుంది రిక్షాలో. రిక్షా కదిలిపోయింది.

* * *

"వచ్చేస్తున్నా నత్తయ్యా. వడ్డించెయ్" అంది సరసు తల దువ్వుకొంటూ వంటగదిలోకి వినపడేలా. మొగవాళ్లిద్దరూ భోంచేసి వెళ్లిపోయాక కూర్చున్నారిద్దరూ.

"అబ్బా. ఉప్పెక్కువైపోయిందే" అంది సరసు.

"మరి మన మగవాళ్లకి తక్కువేస్తే పనికిరాదని కొంచెం తగలనిస్తున్నానే. అంతెక్కువయ్యిందా?"

"నీకనేకసార్లు చెప్పాను. కొంచెం తగ్గించకూడదూ? నావంటనాడు వుప్పుతక్కువైందంటున్నారా వాళ్ళు? నీయిష్టంవచ్చినట్టే వండుకో. ఈ కూడు తినకపోతేనేం?" అంటూ రుసరుసలాడుతూ చెయ్యి కడిగేసుకొని, కంచం తీసేసింది సరసు. కన్న తెల్లబోయి తేరుకునేసరికి అంతా ఐపోయింది. "ఏమిటో దీనికింతవిసురు?" అనుకొంది. పుట్టింటి వాళ్ళు పెట్టినచివాట్లు యింకా జీర్ణమైపోలేదేమో. అందుకే తగూ పెరగలేదు. అతి చిన్నవిషయాలమీద అభిప్రాయాలు పడటం, మళ్ళా ఏడెనిమిది రోజులకి కలిసిపోవటం—

* * *

"అత్తయ్యా, బాబుకి వాచీ ఎలా అందింది? నువ్వుగాని యిచ్చావా?" అంది సరసు వాచీని పరీక్షిస్తూ ఆత్రుతగా.

"ఏం? ఏమైంది? పరుపుమీద కూర్చున్నాడుగదా అని దెబ్బ తగలదులే అని యిచ్చానే," అంటూ దగ్గరగా వచ్చింది కన్న.

"అఘోరించవల్సింది. పరుపుమీద నుంచి క్రిందకి విసిరేశాడు గావున్ను అద్దం బద్దలైంది. బాగా పనిచెయ్యటంలేదని డ్రాయర్ మీద పడేసి వెళ్ళిపోయారు. నన్నేం తిడతారో! చిన్నవెధవకి ఆడుకోటానికివ్వటానికి వాచీయే దొరికిందా?"

"దెబ్బ తగలదులే అనుకొన్నానే. విసిరేస్తాడనుకొన్నానా?"

"అనుకోవు. నీకేం నువు బాగానే వుంటావు. నా కొస్తాయ్ చివాట్లు"

"నీదంతా చోద్యం. పసివెధవ చేసినదానికి ఎవ్వరైతే మట్టుకు ఎందుకు తిడతారు? తిడతారు, తిడతారనకపోతే నీకంత తిట్టాలని వుంటే నువ్వే తిట్టరాదు? ఏదో తెలీక ఏడ్చాన్లే వెధవపని"

"ఛీ. నీగుణం నువ్వుపోనిచ్చుకోవు, చేసేవన్నీ యిల్లాంటి పనులూ. పైగానిష్ఠూరాలు," చివాల్న వెళ్ళిపోయింది సరసు.

* * *

"హరి శ్రీరామచంద్రా! పిల్లల్ని కంటాంగాని రాతల్ని కంటామా? మా యింటావంటా యింటివెనకాల వున్నవాళ్లకి కూడా లేవీజగడాలు. తులసమ్మ కడుపున దురదకొండ పుడుతుందట. పిదపకాలం, పిదప బుద్ధులూ అవ్వ అవ్వ" అంటూ బామ్మ తనకి చెరోకవేపునా కూర్చొన్న తోటికోడళ్ళని చూచి ఏకధాటిగా అరగంటసేపు ఆశ్చర్యపడిపోయేసింది. ఇంతలో బామ్మ కొడుకు, కన్న అన్న, సరసునాన్న ఐన విశ్వనాథంగారు వీధిలోంచి వస్తూనే "ఏమమ్మా. ఎప్పుడొచ్చారేమిటి?" అని ప్రశ్నించారు తోటి కోడళ్ళని. తను చెప్తుందంటే తను చెప్తుందని తోటికోడళ్ళిద్దరూ వూరుకొన్నారు.

"వాళ్లెక్కడ చెప్తార్రా. నీ పిచ్చిగాని. మళ్ళా కీచులాడుకొన్నారట. దిగుమతీ అయ్యారు. ఇక వూరుకొంటే లాభంలేదు. అవ్వ-ఎవరైనా వింటే ఎంత అప్రతిష్ఠ. వీరి తగూలకేదో పరిష్కారం చెయ్యి." అని పరిచయం చేసింది పరిస్థితిని బామ్మ. విశ్వనాథంగారు పడక్కుర్చీలో కూర్చొని—

"ఏమ్మా కన్నా-మీ కసలుపోట్లాటలెందుకొస్తున్నట్టు?" అన్నారు ముందుకు వంగి చెల్లెల్ని చూస్తూ.

"మేమసలు పోట్లాడుకోటం లేదే" అంది కన్న విచిత్రంగా.

"ఆఁఆఁ హమ్మ. ఎంతకైనా తగుదువే. అసలు పోట్లాడుకోటంలా. ఆట్లాడుకొంటున్నా రామ్మ" అంది బామ్మ కోపంగా.

ఈసారి విశ్వనాథంగారు పోజు మార్చి, పద్ధతి మార్చి, అడిగారు కూతుర్ని "ఏం సరసూ! నువ్వూ అత్తా యెంతో స్నేహంగా వుంటంలా?" అని. సరసు చిన్నబోయింది.

"కాదు నాన్నా. వాచీ పోయినందుకు కోప్పడ్డానని తనే వచ్చేసింది ముందు" అంది.

"అది వచ్చేస్తే. పోనీ నువ్వుండి పోక పోయావా? ఒకేయ్ ఇద్దర్లోనూ వుందిరా కొంటెతనం. ఇప్పుడిలాగే వుంటారుగాని రేపట్నుంచీ మళ్లా మొదలెడతారు! అస లిలాంటి వేషాలు సాగనివ్వకుండా చూడాలి" అంది బామ్మ కసిగా.

"నలుగుర్లోనూ పేరు పడిపోవటానికొక్కనీ, వీళ్ళకేం గుణమో? అత్త, ఆడబిడ్డల సాయం ఎలాగూ లేదు. వీళ్ళిద్దరూ కల్సి వుంటారనుకొంటే యిలా తయారయ్యారు. ఏం చేస్తాం? ఖర్మ. రోజూ యిలా పోరులాడటం మాత్రం బావుండేమిల్లెండి. నూరేళ్లున్నా చావు తప్పదు. వెయ్యేళ్లున్నా వేరు తప్పదు. ఏదో పరిష్కారం చేస్తేనే మంచిదేమో" అంది అప్పటివరకూ మౌనంగా కూర్చొన్న శాంతమ్మ.

"హుఁ - ఆడగుణం పోనిచ్చుకొన్నారు గాదే. సరే. ఈడు వచ్చిన వాళ్ళకి కూడా ఎంతకని చెప్తాం? వాళ్ళకి తెలిసివుండాలి గాని ఒకవేపున చెల్లెలు. ఒకవేపున కూతురు. వీళ్ల తగూలు తీర్చకంటే వేరే వుంచెయ్యటమే మంచిది. అయితే ఆ అన్నదమ్ముల్ని కనుక్కొని చూస్తాను. పండంటి సంసారాన్ని విడదియ్యటమంటే వీళ్ళకి చీమకుట్టినట్టుగాకూడా లేదన్నమాట" అంటూ విశ్వనాథంగారు విసురుగా కుర్చీలోంచి లేచి పచార్లు చెయ్యసాగారు.

"ఆడవాళ్లంతా కలిసివుంటే ఎంత అండ ఎంత సాయం రేపట్నుంచీ తెలిసొస్తుంది. కష్టమొచ్చినా ఒంటిపిట్ట రాకాసుల్లా చస్తారు. కొస్త ఒంట్లో బాగా లేకపోయినా తప్పదుగదా, అదే కలిసీ మెలిసీ వుంటే! ఆఖరికి తలంటుకోవాలంటే కుంకుడుకాయ రసం పోసేవాళ్లుండరుగదా. అయ్యోరామ. ఒకరి పొడ ఒకరికి పడదుగా" అంటూ గొణుక్కొంది స్వగతంగా-పరగతంగా బామ్మ.

"అదే, అదే, తెలిసొస్తుంది. అనుభవాన్ని మించిన మందు లేదు." అన్నారు విశ్వనాథంగారు కోపంగా. తోటికోడళ్లు తెల్లబోయారు. "సరసూని అడుగుతాను కలిసేవుందామని" అని అత్తయ్య అనుకొన్నప్పుడే "అత్తయ్యనడగాలి" అనుకొంది సరస్వతి.★




ఇంక లాబం లేదూ బళ్లో పడిపోవాలి అనుకున్నాను.

మరి నేను బళ్లో పడిపోయి చదువుకోకపోతే రాజు గారేమో అలాడీనుకి పెళ్లి చెయ్యనన్నారుగదా. అందుకని పరిగేరు కెళ్లిపోయి అమ్మా నేను బళ్లోపడిపోతాను నన్ను బళ్లోపడెయ్యి నన్ను బళ్లో పడెయ్యి అని చెప్పాను.

నువ్వు అల్లరి వాడివి, నిన్ను బళ్లో ఎవరూ పడిపోనివ్వరు గదా ఎలా అంది అమ్మ.

నానపట్టికెళ్లి పడేస్తే పడనిస్తారుగా అని చెప్పాను నేను.



అయ్యో బాబోయ్. నిన్ను బడిలోపడేస్తే మేష్టరు నాకు ప్రెవేటు. చెప్పేయ్యడూ వద్దు బాబూ అన్నాడు నాన చాలా బయపడి పోయేసి.

మరి ఎలా, బాబాయిని తీసు కెళ్లి పడెయ్యమను అని మళ్లీ అడిగాను పాపం నేను.

బాబాయికూడా లాబం లేదు. బామ్మతీసికెళ్తే పడెయ్యనిస్తారు అన్నాడు నాన. అప్పుడు బామ్మ నరేనూ అంది. అంతట్లోకి లావుపాటి పక్కింటి పిన్నిగారొచ్చి మీబుడుగుని బళ్లో పడేస్తూన్నారా నిజంగానే అంది.

నిజంగానేను అంది అమ్మ.

హమ్మయ్యా అంది లావుపాటి పిన్నిగారు యిలా కళ్లుమూసుకుని.

అలా అంటే ఏమిటో నాకు తెలీదు.

ఏమిటే అని అడిగితే నాకూ తెలీదు నాన్నా అంది లావుపాటి పిన్నిగారు.

నరేని బామ్మ నన్ను బళ్లో పడెయ్యడానికి తీసుకెళ్తానంది.

ఇలా కుంచెంకూడా మేం నడిచి వెళ్లామో లేదో, కాని అంతట్లోకే బడిమేష్టరు పరిగేరు కొచేశాడు.

బామ్మగారూ బామ్మగారూ మరేమోను మాబడి మూసేశాం. సెలవులిచ్చేశాం అదండీ సంగతి అన్నాడు......అని హా మ్మ య్యా అన్నాడు.



మేం అందరం రేపో మ్రాడోలుకో ఫొటోతీంచుకున్నాంగదా. ఇందు సీగానపెసూనాంబకన్న పెద్దవాడినిగదా. యేం. అందరికన్నా సీగానపెసూనాంబ తరవాత నాన్న ఛాలా మంచివాడు. నేను బంగారుతండ్రీ అంటారు వాళ్ళు. బా బామ్మ ముందర సీగానపెసూనాంబా, నేను. బామ్మ పక్కని లావుపాటి పక్కింటి పి ఓటి లేదూ. అదే లావుపాటి పక్కింటి పిన్నిగారు. ఛాలా లావుగదా. అందికని పిన్నిగారు ఫొటో చివర అవతల (మనికి కనబడదులే) ఉందన్నమాట. పిన్నిగారు అ వాడు చాలా పొడుగుకదా. మరేమో పిన్నిగారు ఛాలా లావు. నా తలకాయి బాబాయిని ఉంచి. వంకెం లావుపాటి పిన్నిగారిని తీసేశాడు ఫొటోవాడు. అదీ

బుడుగు! చ్చలపిడుగు


బామేమో హోయ్యో ఎలాగరా మరి బుడుగూ బడి లేదుట ఇంక అంది.

పోనీ రేపు పడెయ్యి బడిలో అన్నాను నేను.

రేపుకూడా బడిలేదు. ఎల్లుండి కూడా బడిలేదు. ఇంకా డబ్బైపది ఇరవయి ఏబై తొంబై మూడు రోజులదాకా బడిలేదు వేసం కాలం వచ్చేసిందిగా అందుకని సెలవు లిచ్చేశాను బడికి అని చెప్పేశాడు మేష్టరు గబగబా.

యింకా చాలా వేసంకాలం రాలేదుగా అంది బామ.

బోల్డు వచ్చిందండీ అన్నాడు మేష్టరు.



ముందర ఉన్న బొమ్మ నేను. నేను అందరికన్న చిన్నవాడిగా ఉన్నాను కాని, న్న, నాకన్నా, మా నాన్నకన్నా అమ్మే ఛాలా బావుంది. అమ్మ ఛాలా మంఛిదికూడా. మ్మ కూడా ఒక్కోసారి అంటుందనుకో. బామ్మంటే నా వెనకాల కూచుందీ అదన్నమాట. న్ని గారి ముగుడు కూచున్నాడు. వెనఖ్ఖాల బాబాయి నించున్నాడుగదా. యేం ఈ ఛివ్వర ఈ ఫుటోలో లావుపాటి పిన్నిగారు అంతా లేదు. కుంచెం ఉంది. ఇంకా ఛాలా బోల్డు ంతా ఇందులో పడితే వెనకాల బాబాయి తలకాయ ఎగిరిపోతుందని ఫుటోవాడు చెప్పాడు. లేకపోతే కొట్టేస్తాను అని ఫుటోవాడికి ప్రైవేటు చెప్పేశాడు బాబాయి. అందుకని బోల్డు సంగతి.

దండి అంటే ఏమిటిరా అన్నాను.

దండి అంటే సీతలకాయండి అన్నాడు మేష్టరు కోపంగా.

యండి అంటేనో అన్నాను నేను.

నిన్ను నడ్డిమీద ఛంపేస్తానండి అని మేష్టరు యిలా కోపంగా ముందరికి వచ్చేశాడు.

ననండి అంటేకూడా నాకు తెలీదు కాని బయంవేసింది. హడ్డిలి పోయి యింక లాబంలేదురా అని, యిలా కాలుపెటేశాగదా అడ్డంగా. బాబాయి నేర్పాడులే అది.

యేం. అంతే వాడు గబుకుని యిలా వంగిపోయి పరిగేరుకెల్లి పోయి ఆగి, మళ్లీ వెనక్కి వచ్చాడు.

వచ్చి హు అన్నాడు. హూం అన్నా కానేమో, అందికే నేను బడి మూసేశాను అల్లరివెదవాని అన్నాడు. అంతట్లోకే లావుపాటి పక్కింటి పిన్నిగారు పరిగేరు కొచ్చేసింది.

హా, బడిలేదంటావా, ఎందుకు లేదు. ఇంకా ఫదిరోజులు ఉంది. వీణ్ణి బళ్లో పడేసుకో ఇప్పుడు అంది కోపంగా.

బడియింత అస్సలు కుంచెం కూడా లేదండి అన్నాడు మేష్టరు.

బడి ఇంకా చాలా బోల్డు ఉంది. అపుడే వేసంకాలం రాలేదు అంది లావుపాటి పిన్నిగారు. మేష్టరుకి బయం వేసింది.



యెలాగా. ముందుచూస్తే పిన్నిగారూ వెనక చూస్తే బుడుగూను అన్నాడు.


యేం అపుడేమో మా అమ్మ వీధి అరుగు మీదికివచ్చి ఏమండీ మేష్టరూ మా బుడుగు యింక అల్లరి చెయ్యడండీ, వాణ్ణి బళ్ళోకి రానియ్యండీ అంది.

ండీ అంటే యేమిటో నాకు తెలీదు. అందరూ అలా ండీ ండీండీ అంటారుగాని.

యేం అపుడేమో మేష్టరు యిలా నవ్వేసి చాలండి, వీడిని పంచెం చాలా అల్లరి మానెయ్యనీండి, అపుడు బడి తీశాక - వేసుకుంటాండీ అన్నాడు.

ఇంకేం చెప్తాం. మనం అల్లరి మానేశే దాకా బడి తియ్యరట. అందుకని బడితెరి దాకా అల్లరిమానెయ్యాలన్న మాట.

అదీ సంగతి. అలాని మా తాతయ్య చెప్పాడులే. (హుయిపోయింది★)



కుంటి మరదలు

మరదళ్లు చాలా మందికి వుంటారుకాని మా శశిలాంటి మరదళ్లుమాత్రం ఎక్కడా ఎవరికీ వుండరు-అని నా నమ్మకం.

కుంటిదే అయినా ఆటపాటల్లోకాని, పనిపాటుల్లోకాని ఆమె తన యీడువాళ్లెవరికీ తీసిపోయేదికాదు. అంతేకాదు. చాలా అందమైనది. ఆమాట నేనే అనడంలేదు. చూసినవాళ్లంతా అనేవారు, జాలిపడేవారు. 'ఎంత అందమైనపిల్లో! పాపం! కుంటి కాలు!' అని.

చిన్నతనంలో కడుపులోపుళ్లొచ్చాయట. ఆపరేషను చేయకపోతే చచ్చిపోతుందన్నారట. బలహీనంవల్లో, వాతంచేసో ఆపరేషను తరువాత కాళ్ళు పడిపోయాయట. ఎన్నో మందులూ మాకులూ వాడగా వాడగా ఒక కాలొచ్చింది. రెండోకాలు సరిగా రాలేదు. కొంచెం కుంటుతూవుండేది.

అయినా గంతులేసేది. దాగుడుమూతలూ, తుమ్మ్కండ-యిలాంటి ఆటలన్నీ ఆడేది. ఆమె ఆడుతూ చలాకీగా పరుగెడుతూ వుంటే నేనొకసారి అన్నా కొంటెగా: ఒంటికాలుతోనే విరగబడిపోతున్నావు. రెండుకాళ్ళూ వుంటే భూమ్మీద నిలబడే దానివే" అని. "ఒక కాలుంటేనే చూడలేరు. రెండుకాళ్ళూ వుంటే నీలాంటివాళ్ల కళ్లు పేలిపోతాయని దేవుడు నాకో కాలు కుంటిచేశా"డంది, వెంటనే దవడమీద కొట్టినట్టు. చాల్లా మాటకారి. మాటకారే కాదు. కలుపుగోలుదికూడా. అందుకే నన్నామె యిట్టే ఆకర్షించింది. కొద్ది రోజులలోనే మేము చాలా సన్నిహితులమై పోయాము.

సాధారణంగా బావా మరదళ్లమధ్య ఏవేవో వేళాకోళాలు, వెక్కిరింతలు, వ్యంగ్య సంభాషణలు జరుగుతూవుంటాయి. మా యిద్దరిమధ్యా జరగేవి. కాని వాటికి ప్రత్యేకత వుండేది. మేము చాలా చనువుగా మసలేవాళ్లం.

అన్నిటికంటే యిప్పటికీ ఎప్పటికీ నే మరువలేని దామె మధుర కంఠస్వరం. ఆమె జ్ఞాపకం వచ్చినప్పుడల్లా "బావా!" అని పిలిచినట్టే వుంటుంది.

"నీది శ్రావ్యమైనకంఠం! నువ్వుమాట్లాడినా సంగీతంలాగే వుంటుంది" అన్నా నొకసారి.

"పోబావా! నీకెప్పుడూ వేళాకోళమే," అంది.

"అదుగో! నువ్వు బావా అని పిలిస్తే మళ్లీశ్వరి జ్ఞాపకం వస్తుంది. వేళాకోళంకాదు."

"అయితే ఏంచేయమంటావు?" అదో రకం విసుగుతో.

"ఏమీ చేయమనడం లేదుగాని ఆ విసుగులోనూ ఎంతో అందంగా వున్నావు. ఆ ముఖంలో ఆ దేవిసుగు మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తున్నది."

"ఉండు బాబూ!" బుంగమూతి పెట్టి.

"అలా బుంగమూతి పెట్టేవాళ్ళని చూస్తే నాకు బలే యిష్టం! అదే మా అవిడైతే ముద్దెట్టేసుకొని వుందును."

"ఏవిటే! ఏవన్నావ్! నాముందు అలాంటి మాటలన్నావంటే..." వాయించేస్తా నన్నట్టు చెయ్యి చూపిస్తూ.

"నిన్నేమీ అన లేదు. అలా వాడిగా చూస్తావేం? ఆ చూపులు హృదయాన్ని

కె. శ్రీమన్నారాయణ

కలికి వేస్తాయి. చెయ్యి చూపిస్తున్నావు. కొడతావా! కొట్టినా ఫర్వాలేదు. నీచేతి లెంపకాయలు కూడా తియ్యగానే వుంటాయి."

"నీతో మాట్లాడకూడదు బాబూ! నవ్వించేస్తావు." కిలకిలా నవ్వుతూ ఆమె మాట్లాడే టప్పుడు ఆ మాటలు కెరటాలలా వచ్చేవి.

"అలా నవ్వాలి. నవ్వినపుడు అందమైన తెల్లని పళ్ళన్నీ కనబడాలి. కితకితలు పెట్టాలి. చెప్పలేని ఏవో మధురభావాలు కలగాలి."

"చాలించు నీ కవిత్వం!" అంటూ కూర్చున్నది లేచిపోయి కోటుకళ్ళ రెప్పలు రెపరెపలాడిస్తూ తమాషాగా చేతులతో మెటికలు విరుస్తూ నోట్లో ఏదో తిట్టుకుంటూ వెళ్లిపోయింది కాలీడ్చుకుంటూ.

వెనుతిరిగి వెళ్లిపోతూ వుంటే ఆమె ఎప్పుడూ జడలో పెట్టుకొనే ఒక్కగాని ఒక్క గులాబీపువ్వు (దొడ్లో పూసింది) ఎంతో అందంగా వుండేది. ఆమె అలా నడవడంకూడా ఒయ్యారంగానే వుండేది.

రోజూ యిలాంటి సంభాషణలు చాలా మట్టుకు మా ఆవిడముందే జరిగేవి.

పొగిడించుకోవడం ఎవరికి సరదాగా వుండదూ? అందులోనూ ఆడవాళ్ళకి. దేవుడికి కూడా సరదాయే. దండకాలు రాయించుకొన్నాడు.

"ఇక నీతో మాట్లాడను. నీ గదిలోకి రాను" అంటూ వెళ్ళిపోయే శశి ఓ గంట కూడా నన్ను చూడకుండా, నా గదిలోకి రాకుండా వుండలేకపోయేది. ఏదైనా పుస్తకం యిమ్మనో, ఓ పాట రాసిమ్మనో ఏదో ఒక వంకపెట్టుకొని నా గదిలోకి వచ్చేది.

మళ్ళీ ఆమె నేదో ప్రసంగంలోకి దింపి కవ్వించి ఓపాట పాడమని బ్రతిమాలుకొనే వాణ్ణి.

సిగ్గుపడకుండా ఆమె "ఆలయమున వినబడు నదిగో, అంటూ బాలసరస్వతిని మించి పాడేది.

నేను నా పెట్టెమీద మెల్లిగా మద్దెల వాయించేవాణ్ణి.

మేమింత చనువుగా ప్రవర్తించడానికి వీలు నిచ్చింది ఆమె కుంటి తనమే నేమో!

* * *

ఒకరోజు మధ్యాహ్నం నా గదిలో మంచంమీద పడుకొని చదువుకొంటున్నాను.

బావా! అంటూ వచ్చింది శశి.

"ఏం?" అన్నా.

"ఇవ్వాళ అక్కయ్య షికారుకి రాదట"

"ఎందుకు రాదూ? డొక్క చీరేస్తాను." పుస్తకం మూసేసి.

"ఒంట్లో బాగా లేదట."

"అయితే నువ్వురా!"

"నేనా! ఊరికే అన్నావు కాని నిజంగా తీసికెడతా వేమిటి?"

"కుంటిదానివనా? నాకేం నామోషీ లేదు. నిరభ్యంతరంగా రావొచ్చు. మీ అమ్మగార్ని అడుగు"

"అమ్మ వెళ్ళమంటుంది. నువ్వే! నీమాట ఏదీ నమ్మలేం!"

"నిజంగా నే వెడదాం. ఇప్పుడు టైమెంత యింది?"

"అయిదు."

"ఎటుపోదాం షికారుకి?"

"ఎటేవిటి? ఊళ్లో గోదావరి పెట్టుకొని."

"అయితే చూడు! కిటికీలోంచి చూడు! బ్రిడ్జి అవతల తుమ్మతోపు లేదూ? అక్కడ!

★ కుంటి మరదలు ★

ఆ రెల్లు దుబ్బులవతల కనబడ్డం లేదూ? చెప్తే కనబడకపోతే..."

"కనబడుతున్నాయి బావా!"

"అక్కడ! రెల్లు దుబ్బులికీ తుమ్మ తోపుకీ మధ్య యిసుక తిన్నెలున్నాయి. అక్కడికి నడుస్తూవుండు."

"ఏవిఁటీ!"

"అక్కడికి వెళ్ళమంటున్నాను. ఇప్పట్నుంచీ నువ్వు నడవకపోతే అక్కడికి చేరేదెలా?"

"నడవలేననా? షికారు నడకకైతే నీతో నడవగలను బావా, రైలుకెళ్ళే నడకకైతే నడవలేను గాని."

"అయితే నీ యిష్టం."

"నిజమేనా?"

"నిజమే! వెళ్ళి, పౌడరు డబ్బా స్నో సీసా కాళీచేసేయ్!"

నది ఒడ్డున యిసుక తిన్నెలమీద కూర్చున్నాం. మేము కూర్చున్నచోట గట్టు కొంచెము ముందుకి నీటిలోకి వుంది. వడిగా ప్రవహిస్తూ వస్తున్న నీరు అక్కడ గట్టుకు తగిలి ప్రక్కకు మళ్ళడం వల్ల నీటిమీద ఏర్పడిన చారలు పదిహేనేళ్ళ పడుచు వేసుకొన్న వోణీకి నడుము దగ్గర పడ్డ ముడతలలా వున్నాయి. అలా చూస్తూ యిసుకలోని చిన్న చిన్న రాళ్ళనుతీసి నీటిలోకి విసురుతున్నాను.

"ఎంత బావున్న దిక్కడ! బావా! అటు చూడు! దూరమైపోతున్న పడవలమీద తెరచాపలు చంద్రవంకల్లా కనిపిస్తున్నాయి కదూ!"

"అవును. అదొక్కటేనా? మంచు ముసుగులు పెట్టుకొని నిద్ర పోతున్నట్టున్న కొండలు, కొండల్లోంచి వయ్యారంగా నడచి వచ్చేస్తున్న గోదావరి, యిటు, పైన పరిగెడుతూన్న నీలిమేఘాల మధ్య తెల్లని హారంలా కనిపిస్తున్న కొంగలబారు—ఇక్కడ గాలికి ఏదో విచిత్రగీతం ఆలాపిస్తున్న యీ తుమ్మ చెట్లు, గీతానికి అనువుగా నృత్యం చేస్తున్న రెల్లు మొక్కలు—ఎన్నాళ్ళు ఇలా కూర్చుని చూస్తే తనివి తీరుతుంది?"

"నిజమే బావా! రోజూ వస్తే యెంత బాగుంటుంది?"

"పక్కని మీ ఆయనుంటే మరీ బాగుంటుంది!"

"మొదలెట్టావా? యిక నన్నిక్కడ వుండనియ్యవు."

"ఏం? పెళ్ళి చేసుకోవా?"

"ఉందూ!"

అబ్బో! ఎంత సిగ్గూ!"

"నాకెందుకు సిగ్గు?

"మొగుడంటేను."

"నేనేం సిగ్గు పడవలసిన అవసరం లేదు. నాకు మొగుడు రానూరాడు. ఒక వేళ వచ్చినా నేను చేసుకోను."

అదేవిటి? ఎందుకు రాడూ? కుంటిదానివనా? అయితేనేం? అందంగా లేవా? పని పాట్లు చేయలేవా? పాటలు పాడలేవా? చదువుకో లేదా?"

"నాకంటే అందంగా వున్నవాళ్ళూ, డబ్బున్నవాళ్ళూ ఏ లోపం లేకుండా వున్నవాళ్ళకే అవడంలే దిగోజుల్లో! ఏమీలేని నాలాంటి కుంటిదానికవుతుందా? మొగుడే కావాలంటే దొరక్కపోడనుకో నాకు తగ్గవాడు! ఎందుకు? నాతోపాటు అతగాడొక బరువు మావాళ్ళకి!"

"అదా సంగతి! అలా చెప్పు. మంచి మొగుడు కావాలంటావు. డబ్బంటే సరి, కొండమీద కోతైనా దిగొస్తుంది. మీనాన్న ఏమీ గడించలేదూ?"

"గడింపా! నెల ముప్పైరోజులూ కష్టపడితేనేగాని డబ్బైరాళ్ళు రావు. వచ్చినవి మూడోనాటికే ఆఖరు. అక్కణ్నుంచి అప్పులకోసం యింటింటికీ తిరక్కపోతే సరి గడించినంత ఫలం! చీటికీ మాటికీ నిన్నే అడుగుతుంటాంగదా అప్పులిమ్మని. యీ పాటికి నీకు తెలియవలసిందే?"

"అయితే నీకు పెళ్ళి అవదంటావు? కాదు. చేసుకోనంటావు. మరెలాగ?"

"అదే నేనూ ఆలోచిస్తుంటాను. తిని కూర్చోడానికి పెద్దలు గడించి యిచ్చిన ఆస్తిపాస్తులేమీ లేవుగదా ఆడాబా తప్పించి. అమ్మా, నాన్నా వున్నంతసేపూ ఫరవాలేదనుకో. తరువాత యీ అన్నదమ్ములు చూస్తారని నమ్మకమేవిఁటి?"

"అసలు నువ్వు చదువెందుకు మానేశావు కక్కీ?"

"నేను మానేశానా? మాన్పించేశారు!"

"ఎందుకు మాన్పించేశారు?"

"పెద్దమనిషి నయ్యాననీ!"

"ఎందుకయ్యావు? నాతో చెప్పకుండా"

"ఉండు! నవ్వించకు. పెద్దమనిషైతే చదువు మాన్పించేస్తారా ఎవరైనా మా నాన్న పిచ్చికాని. సరిగ్గా నిరుడీరోజుల్లో నే మానేశా. చదివేసే యీ పాటికి ఫోర్తు ఫారంలో వుండేదాన్ని."

"ఇప్పుడైతేం? మళ్ళీ చదువుకో!"

"స్కూలు చాలా దూరం బావా మా యింటికి. రోజూ పొద్దున్నే కేరేజి పట్టుకొని వెళ్ళిపోయేదాన్ని నడిచి. మళ్ళీ సాయంత్రమే వచ్చేదాన్ని. ఈ నడకవల్ల ఒక్కొక్కప్పుడు జ్వరం కూడా వచ్చేది రాత్రుళ్ళు. ఏ బండిమీదైనా, రిక్షామీదైనా పోదామంటే డబ్బుండొద్దూ? రోజూ ఎలా పోగలం? అసలు డబ్బులేకే నన్ను మాన్పించేస్తే, వూరికే యీ వంక పెట్టారు కాని."

స్కూలుకి దగ్గరగావున్న యింట్లో నే వుండాలి."

"దొరకొద్దూ? దొరికినా అద్దె యిచ్చుకోగలమా? నీకేం! జమీందారులామాట్లాడుతావు."

"గొప్పచిక్కే! పోనీ సంగీతం నేర్చుకోకూడదూ? ఎప్పటికైనా ఉపయోగిస్తుంది."

"ఈ ఊళ్ళో సంగీతం చెప్పే మాస్టరు ఒకడే వున్నాడు. ఇంటికొచ్చి చెప్పడానికి పది, పదిహేనూ అడుగుతాడు. మానాన్నగార్ని గట్టిగా అడిగితే చెప్పిస్తారనుకో, బాధ పెట్టడం నాకే యిష్టంలేదు."

"అయితే హిందీ నేర్చుకో! తేలిగ్గా వచ్చేస్తుంది. నాలుగైదు పరీక్షలు పాసైపోతే మిస్సమ్మ వయిపోవచ్చు."

"ఊరికే హిందీచెప్పే పంతులమ్మగారున్నారు కాని వాళ్ళిల్లూ దూరమే! పోనీ, నువ్వు చెప్పకూడదూ?"

"నేనా! నేనెన్నాళ్లు వుంటాను యిక్కడ?"

ఉన్నన్నాళ్లే! నాఅంతట నేను చదువుకో గలిగిందాకా చెప్పేవంటే చాలు. మీవూరు వెళ్ళిమాత్రం ఏం చేస్తావు? మీరిక్కడ వుండడం వల్ల మాకేమైనా బరువా? మీఖర్చు మీరే పెట్టుకుంటున్నారుగా నాకోసం వుండకూడదేవిఁటి?"

"ఉండొచ్చు. కాని—"

"ఏవిఁటాలోచిస్తున్నావు?"

"అబ్బే! ఏమీ లేదు. ఒక పనిచేస్తాను. నీ మట్టుకు నువ్వు చదువుకొని పరీక్షలకు కూర్చోగలిగే తాహతు వచ్చేవరకూ గబగబా చెప్పేస్తాను. నువ్వు మాత్రం జాగ్రత్తగా నేర్చుకోవాలి"

అలాగే!"

అనుకోని విధంగా మాశశి జీవితం వైపు మళ్లి, సాగిపోయిన మా సంభాషణ నన్ను చాలా కలతపెట్టింది. ఎప్పుడూ ఏదో చిలిపిగా మాట్లాడడం తప్పించి మాశశిపెళ్లి విషయంగాని ఆమెజీవితం గురించి కాని నేనెప్పుడూ ఆలోచించనే లేదు. అంత చిన్న వయస్సులో ఆమె తన జీవితం గురించి ఎంత చక్కగా ఆలోచించగలిగింది! హృదయాన్ని విప్పి అంత నిష్కల్మషంగా మాట్లాడ గలిగే వాళ్లెంతమంది వుంటారు. ఆమె చెప్పిన వన్నీ పచ్చియథార్థాలు. కాని నేనేం చేయగలను? ఇంటికివస్తూ చాలా ఆలోచించాను. ఇంటికి వచ్చేసిన తర్వాత కూడా ఆలోచించాను. ఆరాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు.

చాలీచాలని జీతం, పదిమంది పిల్లలు, వాళ్ళకి చదువులు, అప్పులవాళ్ళు, కుంటిది మా శశి, ఆమె భవిష్యత్తు, నేనేంచెయ్యాలి. ఏదో ఉద్రేకం; నేనేం చేయగలను-ఏదో అసమర్థత-అంతా కలత నిద్ర.

* * *

ఒకనాటిరాత్రి భోజనంచేసిన తర్వాత పడుకోడానికి మామూలుగా డాబామీదికి పోయాను. కార్తీకమాసం. ఆకాశమంతా కడిగేసిన గచ్చులావుంది నిర్మలంగా శరశ్చంద్రుడు నవ్వుతున్నాడు తెల్లగా. లోకంలోని అందమైన వాళ్ళంతా కలిసి పోటీ చేసినా యీ రోజుల్లో తన్నోడించలేరన్నట్లుగా.

"భోజనమయిందా బావా?" పిట్టగోడ కానుకొని చంద్రుణ్ణి చూస్తున్న శశి అడిగింది.

"ఓహో! నువ్విక్కడున్నావా! అందుకే కింద ఏమంత సందడిగా లేదు. మేతి కోసం వచ్చావా?"

"ఏవిటి?"

"గాలి!"

"గాలిమాటకేం! మంచు కురవడంలేదూ? చలివేస్తోంది. ఎలా పడుకుంటున్నావు?"

"ఎలాగా! నేనొక్కణ్ణే పడుకోవడం లేదుగా! మీ అక్కయ్య..."

"ఛీ! నీకు బొత్తిగా సిగ్గులేదు బాబూ!"

"నేనేమన్నాను. ఊరుకున్నవాణ్ని నువ్వే ఏదో ఒకటి కదుపుతావు. నేనేమన్నా అంటే సిగ్గులేదు, గిగ్గులేదంటావు!"

"దానికేంగాని బావా!"

"ఓహో మల్లీశ్వరీ!"

"ఒక సందేహం!"

"ఏవిటో?"

"అడవికాచిన వెన్నెలంటారు కదా! అంటే అక్కడ వెన్నెలంతా వృథా అనే కదూ?"

"ఊ!" అన్నా ఆలోచిస్తూ.

"ఊళ్ళో కాచిన వెన్నెలంతా ఉపయోగం చేసుకుంటున్నారేమిటి? యిక్కడ మాత్రం వృథా కావడంలేదూ?"

తెలివైన ప్రశ్నలాగే కనిపించింది. మామూలు ధోరణిలో. సమాధానం చెప్పేది కాదు. ప్రశ్నలో దాగున్నట్టున్న ఏవేవో భావాలు నన్ను ఆలోచనలో దిగవేసినవి. వంటనే జవాబు చెప్పలేక పోయాను.

ఇంతట్లోకే మాఆవిడొచ్చింది. వచ్చీరావడంతో పక్కమీద కూలబడింది.

"సరేలే! రేపు చెప్పుదువుగాని" అంటూ దిగిపోయింది శశి. నాభావాలు పరిపక్వం చెందలేదు. అయినా ఎందుకో శశిమీద జాలి వేసింది. శశి వెళ్ళిపోయిన దిక్కుకేసే చూస్తూ వుండిపోయాను కొంతసేపు. తరువాత బరువుగా నిట్టూర్చి పక్కమీదికి చేరాను.

"ఆకుంటిదాని గురించేనా ఆలోచించడం!" వెల్లకిలాపడుండి ఆలోచనలో పరధ్యానంగావున్న నన్ను మా ఆవిడ బుగ్గలో పొడిచేసి కోపంగా అటు తిరిగిపోయింది.

బుగ్గ తడువుకుంటూ ముఖాన్ని తిప్పేసరికి ఎడంగా జరిగిపోవాలని ప్రయత్నిస్తోంది. నాకంతగా అర్థంకాలేదామె ప్రవర్తన. శశి, నేనూ యింతచనువుగా మసలడం తనకిష్టంలేదా? లేక ఆమెమీద నాకుండే అభిమానాన్ని అనుమానిస్తోందా? అదే నిజమైతే నాతో మామూలుగా చెప్పొచ్చుగా! ఎందుకీ అర్థంలేని అలుక? నాకూ కోపం వచ్చింది. అప్పట్లో ఆమెకు చెప్పి ఒప్పించాలనే బుద్ధి పుట్టలేదు. వెంటనే దుప్పటితీసి పెనముహంపెట్టి కప్పేసుకొన్నాను.

* * *

తెల్లవారింది. పళ్ళుతోముకుంటున్నాను, రోజూ నీళ్ళు తెచ్చిపెట్టే మా ఆవిడ ఆవేళ తేలేదు. అర్థంకానివీ, యిష్టంలేనివి విషయాల్ని ఖచ్చితంగా అడిగేసి అనుమానాల్ని తీర్చుకోవాలి. అంతేగాని పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే చిరాకెత్తుతుంది. ఇంకా ఉడికించాలనుకున్నాను. వెంటనే శశిని పిలిచాను.

"ఇప్పట్నుంచీ నాకు కావలసిన వన్నీ నువ్వే తెచ్చిపెట్టాలి,"

"అదేం "

"అదేం, గిదేం — అష్టప్రశ్నలు వేయకు వెళ్ళి నీళ్లుతీసుకురా !"

"చిత్తం! గురువుగారూ!" అంటూ చేతులు తిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

పొద్దున్న కాఫీ, మధ్యాహ్నం భోజనం, మంచినీళ్లూ, గించినీళ్ళూ, అన్నీ శశే తెచ్చి



లక్స్ టాయిలెట్
సబ్బును వాడి చూడమని
లలిత మీకు సలహా చెప్పుచున్నది
"శుద్ధమైనది, తెల్లనిది—
ఈ సబ్బు ద్విగుణమైనది!"
...లలిత, తన చర్మ సౌందర్యమును చెక్కు చెదరకుండా కాపాడుకొనుటకు ఎల్లప్పుడూ లక్స్ టాయిలెట్ సబ్బునే వాడుచుండును. దాని సమృద్ధియైన నురగ తన చర్మమును పరిశుభ్రంగాను, నునుపుగాను వుంచుచున్నదని ఆమె గ్రహించింది—మరియు మనోహరమైన దాని పరిమళమును ఆమె చాల మెచ్చుకొనును!
సినీమా తారలవలె చేయుడు—దీని మెత్తని నురగతో మీ చర్మ సౌందర్యమును కాపాడుకొనుడు. దాని అద్భుతమైన తెలుపు లక్స్ టాయిలెట్ సబ్బుయొక్క శుద్ధతకు నిదర్శనము.
లక్స్ టాయిలెట్ సబ్బు
LUX
TOILET SOAP

పెట్టింది. మూడుగంటలకి దోసెలేసి తీసికొచ్చింది. ఆమె వండిందట! ఆ దోసెలు ఎంతకమ్మగా వున్నాయని! నేచెప్పలేను, మాఅమ్మ, దొడ్డమ్మ, అమ్మమ్మ, మా ఆవిడ- ఛ ఛా! ఎవరూ వండిపెట్టలేదు అంతబాగా! మా శశిమీద అభిమానంచేత అవి బావున్నాయనడంలేదు. నిజంగా బాగున్నాయి.

"శశీ! వంటలన్నీ బాగా వండగలవా? లేక దోసెలు మాత్రమేనా?" అన్నా.

"అన్నీ వండగలను. మా నాన్నగారికి కూడా నేచేసిన వంటలే యిష్టం!"

"అయితే రాత్రికి వంటలన్నీ నువ్వే చెయ్యి"

"బాగుంటే ఏమిస్తావు?"

"సర్టిఫికేట్!"

"ఎందుకూ! నాలుక గీసుకోడానికా," అంటూ వెళ్ళిపోయిన శశిమీద మళ్ళీ జాలి వేసింది.

ఆ రోజు సాయంత్రం నాలుగుగంటలకే షికారుపోయాను. ఒంటరిగా వుండడంవల్ల తోచలేదు. మధ్యాహ్నం సగం చదివిన పుస్తకం యింటిదగ్గర వదిలేశాను. అది వున్నా తోస్తుందికదా అని తెచ్చుకోడానికి యింటికి తిరిగి వచ్చేను.

"అప్పుడే వచ్చేసేవేం? ఏం తోచలేదా? గదిలోంచి బయటికి అరుగుమీదికి వస్తూ అంది శశి.

"అబ్బే! హృదయేశ్వరికోసం వచ్చాను."

ఫకాలున నవ్వింది. "పక్కని హృదయేశ్వరి లేందే తోచలేదు. కాబోలు! పాపం" అని మళ్లీ అదే పనిగా నవ్వుతోంది.

ఆమె వుద్దేశం నాకు అర్థమయినా ఆమె అదేపనిగా నవ్వడం నాకు కొంచెం చిరాకెత్తించి "ఎందుకలా నవ్వుతావు? వెకిలి పిల్లా!" అన్నా.

"ఎందుకా? నువ్వోడిపోయి నందుకు. ఎప్పటికైనా మొగాళ్లు ఓడిపోవలసిందే! శేజెమ్మలేవోడిపోయారు. నువ్వొక లెక్కా!"

"ఇంతకీ నువ్వనేదేవిఁటి?"

"ఏవిఁటా! హృదయేశ్వరిని తీసికువెడదామని గబగబా వచ్చావు కాని మీ హృదయేశ్వరీ, మా అమ్మా ఆసుపత్రి కెళ్ళారు. పాపం! తోడెవ్వరూ లేరు మా కొంటె బావకి."

ఆ హృదయేశ్వరి కాదే కుంటిమరదలా! నేను చదువుతున్న పుస్తకం 'హృదయేశ్వరి.'

"అదా?"

"అదే! మొఖం అలా పెట్టావేం? కొంచెం తెచ్చి పెట్టు నా పెట్టిమీద వుంటుంది"

"నీకు మళ్ళీ తెచ్చిపెట్టాలి" అని ఒకసారి మూతితిప్పుకొని లోపలికి వెళ్లి "యిక్కడలేదు బావా!" అంది.

"ఏమయింది; ఎవరు తీసేరు?"

"ఏమిటా కంగారూ పుస్తకాలంటేను. ఇందాక మీ ఆవిడేదో పుస్తకం తీసింది. అదే యేమో."

"ఎక్కడ పెట్టిందో! కొంచెం వెదుకు."

"నే వెదకను. ఏమో! ఎక్కడ పెట్టిందో! అది వచ్చేదాక వుండు.

"రామా! యిప్పుడేంచేయాలి?"

ఏం? యిప్పుడది చదివితే నేగాని కుదరదా! రేపు పరీక్షకు కూర్చోబోతున్నావా? అక్కయ్యవచ్చేదాకా అలా కూర్చొని జపంచేసుకో!" నవ్వింది.

"నువ్వు అస్తమానూనవ్వకు శశీ!"

"ఏం? ఏమిచేస్తారేమిటి?" అనుకుంటూ అరుగుమీద నుంచున్నదల్లా సావిట్లోకిపోయి "బలే! అక్కయ్య మాబాగాదాచేసింది పుస్తకం" అంటూ ఎగురుతోంది.

"ఇప్పుడు వచ్చేనంటే చూడుశశీ! జడ పట్టుకొని తిప్పేస్తాను"

"తిప్పేస్తారేం! నే పారిపోతేను" వెక్కిరించింది.

"అయితే వుండు" అని రెండడుగులు ముందుకి వేశాను. పారిపోవాలని పరుగెత్తింది. గడపతగిలి ముందుకి "దుబ్బ" మని పడిపోయింది.

"మంచిపని జరిగింది. లేకపోతే తెగ నవ్వుతున్నావా? ఏదీ? యిప్పుడునవ్వు! మాబలేపడ్డావులే" అంటూ నేను ఏడిపించాను.

అంతట్లోకి ఆసుపత్రికెళ్ళిన వాళ్ళిద్దరూ తిరిగొచ్చారు. 'ఎప్పుడూ యిద్దరూ నవ్వుతూ వుండేవాళ్లు, యిప్పుడు ఒకరునవ్వుతూంటే యింకొకరు ఏడుస్తున్నారేవిఁటిచెప్మా' అనుకునే గో ఏవిఁటో మాఆవిడ ఏంజరిగిందేవిటండీ? అని అడిగేసింది.

జరిగిందంతా చెప్పేసినతర్వాత జ్ఞాపకం వచ్చింది—మాయిద్దరికీ మాట లేవనేసంగతి. ఏంచెయ్యను? నాలుక కరుచుకున్నాను.

ముందికి బోర్లాపడిందేమో గచ్చుకి నుదురుతగిలి బొప్పికట్టింది. రెండురోజులు నాముఖం చూడలేకపోయింది శశి. పాఠం చెప్పించుకోడానికికూడా రాలేదు. ఆరాత్రి వంటలూ చేసిపెట్టలేదు. 'నామూలంగానే కదా తగిలింద'ని నేనుతరువాత బాధపడ్డాను. ఏమయినా యీ సంఘటనవన్నా, మా ఆవిణ్ణీ కలిపేసింది.

* * *

మనం ఏదో అనుకోవడం, సరిగ్గాదానికి ప్రతికూలంగా జరగడం—అందరికీ అనుభవంలోని విషయమే. నేనెన్నోరోజులు మాశశికి హిందీ చెప్పలేకపోయాను. కారణాంతరాలచేత మేము చాలా దూరప్రదేశం వెళ్ళిపోవలసి వచ్చింది. తర్వాత మళ్లీ ఆమెను చూసే అవకాశం కలుగలేదు. ఏం చేస్తున్నదో? ఏమో?

ఇప్పుడు, ఎవరైనా కుంటి అమ్మాయి కనపడినా, ఎవరు ఎవర్ని 'బావా' అని పిలిచినా నాకు మా శశి జ్ఞాపకం వస్తుంది.

దాగుడుమూత లాడుతూ పరుగెడ్తున్నట్లూ, తీయగా పాడుతూ మైమరపిస్తున్నట్లూ, కమ్మ కమ్మని దోసెలేసి నాకు పెడ్తున్నట్లూ, అద్దంముందు నిల్చొని అందాన్ని చూసుకొంటున్నట్లూ, ఆ డాబా మీద వెన్నెట్లో పిట్టగోడ కానుకొని వెక్కిరిస్తున్న చంద్రుణ్ణి చూస్తూ తిట్టుకొంటున్నట్లూ—ఆమె చేష్టలు ఒక్కొక్కటే జ్ఞాపకంవచ్చి మనస్సు గిలగిల బాధపడిపోతూ ఉంటుంది. చివరికి యింకేమీ చేయలేక త్వరలోనే ఆమెకు మంచిభర్త దొరకాలని మనస్ఫూర్తిగా మనస్సులోనే కోరుకుంటాను. ★

వనితా లోకం

ఆస్పత్రిలో అవస్థలు

పురాణాల దగ్గరనుంచి నేటివరకుకూడ స్త్రీ శాంతమూర్తిఅని, దయాదాక్షిణ్యాలకి పుట్టినిల్లని, మనసు వెన్నలాంటిదని ఎంతో నేర్పుగలదని వర్ణిస్తుంటే చదవడమే గాని నాకుఎక్కడా అనుభవంలోకిరాలేదు. ఎవరిసంసారం వాళ్లు వోర్పుగాచూచుకోవడం గొప్పకాదు. మానవసేవే మాధవసేవ అనే మనదేశంలో బాధ్యతగల వుద్యోగాలు చేస్తూకూడా మనధర్మం మరచిపోతున్నారంటే అతిశయోక్తికాదు. స్త్రీ వుద్యోగాలలో, ముఖ్యంగా వైద్యశాలలోవున్న స్త్రీకి దయ, శాంతం చాలముఖ్యం. ఎందుచేతనంటే ఏదోకష్టసమయంలోగాని ఎవరూ ఆస్పత్రికివెళ్ళరు. ఆ బాధకుతోడు అక్కడ ఆదరణలేకపోతే ఆ రోగి ఎంతబాధపడుతుందో వర్ణించతరంగాదు. న్యాయానికి అక్కడ డ్యూటీలోవున్న స్త్రీగాని, పురుషుడుగానివచ్చిన రోగులమీద విసుక్కుందుకు అసహ్యించుకుందుకు కాదుగదా వారికి గవర్నమెంటు జీతాలుఇచ్చేది? "ఆజీతాలు మనం ఎందుకుతీసుకుంటున్నాము. మనకర్తవ్యం ఏమిటి. మనం ఇక్కడ ఎందుకున్నాము, వాళ్లు ఇక్కడకు ఎందుకువచ్చారు"అని ఆత్మపరిశీలన చేసుకుని వాళ్ళు సంచరించినట్లైతే నేను ఇదంతా వ్రాయవలసిన అవసరమేలేదు.

నామట్టుకు నేను అనుభవించిన అవస్థలు చెబుతాను:

మా కుటుంబంలో నేను, ఆయన, ముగ్గురు చిన్నపిల్లలు వున్నాము. ఆయన ఎలక్షను డ్యూటీకివెళ్ళినరోజు సాయంకాలం, నూతిదగ్గర జారిపడగా నాకాలువిరిగినది. వెంటనే ఇరుగుపొరుగు ఆడవారు మా ఇంటికి మైలు దూరంలోవున్న మాబంధువుల ఇంటికి తీసుకువెళ్ళగా ఆయన ఆస్పత్రిలో చేర్పించినారు. ఆయన రిక్షాలోంచి ఆస్పత్రిలో చేర్చేవరకూ చాల కష్టపడినారు. ఎందుచేతనంటే—

"ఆవిడ కాలు విరిగి బాధ పడుతోంది. తొందరగా చూడండి" అని ఆయన వెళ్ళి చెబితే, "చీటి తెచ్చినావా?" అని ప్రశ్న. ఇప్పుడే కాలు విరిగింది. చీటి ఎలావచ్చింది! పోనీ ఎక్కడ ఇస్తారు అని అడిగితే అక్కడకు వెళ్ళమని ఇక్కడవాళ్ళు, ఇటు వెళ్ళమని అటువాళ్ళు చెప్పడమే గాని సరిగా మాట వినిపించుకుని ఆ చోటు చెప్పడం లేదు. ఎలాగో తెలుసుకుని 15, 20 నిముషాలకు చీటి తెచ్చినారు. ఆ చీటి చూపిస్తే 2, 3 అడుగుల ఎత్తువున్న వరండా మీదకు "ట్రాలీ" (రోగులను పడుకోపెట్టే తోపుడు బండి) వుంచి రిక్షాలోంచి దానిమీద పడుకో పెట్టమన్నారు. నిజానికి వాళ్ళే జాగ్రతగా రోగిని దానిమీదకు చేర్చాలి అని నా వుద్దేశ్యం.

అప్పుడు నాతో వచ్చిన పొరుగు ఆవిడ సహాయంతో, ఆయన దానిమీదకు చేర్చినారు. ట్రాలీమీదకు చేర్చినతర్వాత 10 నిమిషాలు అలాగే వుంచినారు. దానిమీద పడుకుని వుండగా ఇటు అటు హడావిడిగా తిరిగే "మిడ్‌వైఫ్‌లు" (యగ్రజాకట్లు) ఒక్కొక్కరే వచ్చి కాలు ఇటుకదిపి అటుకదిపి చూచేవారు. కొంతసే పూరుకుని బాధపడలేక "ఎందుకమ్మా అల్లా కదుపుతారు డాక్టరుగార్ని రానివ్వండి. కదుపుతుంటే ఎముక కదలి పాడవుతుందని నా భయం" అంటే— అందులో వొకావిడ "ఆ ఇప్పటికే పాడయింది, ఇంకా ఏమిటి" అని కోపంగా వెళ్లిపోయింది. కాలు విరిగి నేను బాధపడుతూ వుంటే వాళ్లకు సానుభూతి లేదు సరిగదా, తమాషా, వేళాకోళంగా వుంది.

ఇంక రెండవ ఘట్టం. ఒక పావుగంట గడచిన తర్వాత మందుల గదిలోకి తీసుకువెళ్ళినారు. అక్కడికి డాక్టరుగారు వచ్చి కాలు క్రింద ఇనుప వూచలు పెట్టి మడమకు వుచ్చుపోసి ఇనుప వూచకు లాగికట్టి పాదం తిన్నగానే వుండాలి కదపకూడదన్నారు. నిజానికి విరిగినకాలి పాదం గట్టికట్టు లేకుండ ఎలా వుంటుంది. విరిగిన చోటుకూడ మోకాలికి పాదానికి మధ్యచోట విరిగింది. సరే బండి తోసుకు పోతున్నారు. నాతో వచ్చినాయన "ఇంతేనా ఇంకేమి చేయరా?" అని అడిగితే, రేపు ఎక్స్‌రే తీసి చూచిన తర్వాతగాని ఏమీ లేదన్నారు. సరే...బండి తోసుకు పోతున్నారు.

అర్జెంటు కేసులు

ఇంక ట్రాలీని మేడమీదకు లాగుటకు ఇంకొంకమనిషి సహాయంకావలసి వచ్చింది. అంతవరకు ఒకమిడ్‌వైఫే లాగుతున్నది. ఇంతలోకే ఇంకొకట్రాలీమీద ఇంకొక రోగిని పడుకోపెట్టి ఇంకొక మగమనిషి తోసుకువస్తున్నాడు. (అతనివుద్యోగం పేరు నాకు తెలియదు)ఆమనిషిని సాయంచేయమని అడిగింది అతను! "నాకేసు చాలసీరియస్ నేనుపట్టడానికి వీలులేదు"అన్నాడు.అతను, ఈవిడకలసి చాలసేపువాదించి దెబ్బలాడుకుంటుంటే నాతోవున్నవాళ్ళు మేమే తోస్తాము మీరు దెబ్బలాడుకోవద్దని పైకి సాయంచేసినారు. ట్రాలీ పైకి వెళ్లింది. తిన్నగా జనరల్ వార్డులోకి తోసినారు.


ఆవార్డులో వుండే.మంచాలు; అశుభ్రత చూస్తేనాకు చాలభయంవేసింది. అప్పుడు నాతోవున్నాయనతో చెప్పి, స్పెషలువార్డులోనికి మార్పించమనిచెప్పగా ఆయన "పర్మిషనుకోసం వెడుతున్నాను ట్రాలీమీద వుంచమనిచెప్పి వెళ్లినారు" ఆయన వెళ్లిన తర్వాత ఇంకొక ఇద్దరు మిడ్‌వైఫ్‌లువచ్చి ట్రాలీమీదవుంచితే ఎల్లాగ, ఆఫీసరుగారు ఇంటికివెళ్ళినారు. ఇప్పుడు స్పెషలువార్డు పర్మిటురాదు. మంచంమీద పడుకోబెట్టి ట్రాలీతీసుకుపొమ్మనిచెప్పి నన్ను నలుగురు కలిసి మంచంమీదకుఈడ్చి ట్రాలీ తోసుకుపోయినారు. వాళ్ళువెళ్లిన ఐదునిముషాలకు పర్మిషను తీసుకుని మా చుట్టాల ఆయనవచ్చి దీనిమీద పడుకున్నావేమంటే ఏమిచెప్పను? సరే మళ్లీ ట్రాలీకోసంవెళ్ళి వాళ్లను తీసుకు

వచ్చి స్పెషలువార్డుకు చేరేటప్పటికి ఇంకొక అరగంట పట్టింది.

ఆస్పత్రికి 6 గంటలకివెడితే 8 గంటలకి మీకట్టూ మందూ లేకుండా వీళ్ళ సాధింపులతో స్పెషలువార్డులోకి చేరడమైంది. నాతో వచ్చినాయన "ఇంకపడుకో నేను పాలు తీసుకువస్తా"నని వెళ్ళినారు. నా దగ్గర ఇంకొక పొరుగావిడ వున్నారు. ఆవిడకు ఆరాత్రివుండేందుకు వీలులేదు. అందుచేత ఇంకొకఆవిడను తీసుకురమ్మని ఆవిడను పంపినాను. ఇంకఆస్పత్రిలో నేను ఒకర్తినే వున్నాను. వీళ్ళిద్దరు వెళ్ళినతర్వాత దాహం ఆరంభించి నోరెండడం మొదలెట్టింది. ఒకనర్సును పిలిచి కొంచెమంచినీళ్ళు ఇమ్మని అడిగాను. మంచినీళ్ళు లేవన్నారు. పోనీ సోడా తెచ్చి పెట్టండి అన్నాను. 'సోడా వాళ్ళంతా వెళిపోయినారు. దొరక' వన్నారు. ఇలా పావుగంట గడచిన తర్వాత ఒక లేడి డాక్టరు, ఇద్దరు నర్సులు, నలుగురు మిడ్‌వైఫ్‌లు రోగుల్ని చూడానికి వచ్చి నా గదికి వచ్చినారు. ఆ డాక్టరుతో "అమ్మా, దాహం వేస్తోంది. మా వాళ్ళింకా ఎవరూ రాలేదు." అని చెబితే ఒక ఆయాని పిలిచి సోడా తీసుకురమ్మని చెప్పి వెళ్ళిపోయి నారు. ఆ మాట విని అల్లాగేనని వెళ్ళిన ఆయా మళ్ళీ అవుపించలేదు.

ఇంక ఆ రాత్రి కాలు యమబాధ పెడు తోంది. కాలు ఇల్లా వుండగా పెద్దడాక్టరు గారు ముందు కాలు కట్టుకట్టిన డాక్టరుగారు (M. B. B. S.), ఇంకొక లేడీ డాక్టరు, ఇంకొక నర్సూ, నలుగురు ఎర్రజాకెట్ల వాళ్లు వచ్చినారు. పెద్ద డాక్టరుగారు నా కాలు చూచి, "ఎవరు కట్టు కట్టినారు? విరిగిన కాలుకు బాండేజి లేకుండా ఇల్లా పడుకో పెట్టినారేమి?" అని అడిగి, చాల దూది, గుడ్డ తెప్పించి కాలు కదలకుండా దూది ఎత్తుపెట్టి ఇల్లా కట్టమని ఆ డాక్టరుగారితో చెప్పి వెళ్లి పోయినారు. వాళ్ళు అటు వెళ్లగానే ఆ డాక్టరుగారు మళ్ళీ వచ్చి కడతానని వెళ్ళి పోయినారు. ఆ రాత్రి ఆయనను ఎవరో "మేల్‌నర్సు" అనుకున్నాను. కాని మరు నాడు ఉదయం ఆయనకూడా పెద్ద డాక్టరే అని తెలియగానే ఆశ్చర్యం వేసింది. ఆయన వెళ్ళిపోయిన తర్వాత మా ప్రక్కయింటి అబ్బాయి పరుపు తీసుకు వచ్చినాడు. ఆ అబ్బాయితో పరిస్థితి చెప్పగా ఎవరినో ఒక నర్సును తీసుకువచ్చి బాగా కట్టించినాడు. ఇక ఆ రాత్రి గడిచింది.

తెల్లవారే టప్పటికి ఆయన వచ్చినారు. డాక్టరుతో మాటాడి తొందరగా ఎక్స్‌రే తీయించాలని తొందరలో వాళ్లతో మాట్లా డేందుకు వెళ్ళిపోయినారు. నాదగ్గర రాత్రి పడుకున్న వాళ్ళు కూడ వాళ్ళింట్లో వాళ్ళే పెద్దలవడంచేత నాదగ్గర పగలు వుండేందుకు



మిలిటరీ నర్సింగ్ సర్వీస్‌లో పనిచేస్తున్న సిస్టర్ టి. కే. సరోజిని అనే యువతి, గత మార్చిలో హుసేనివాలా సంఘర్షణ సందర్భంలో విధి నిర్వహణపట్ల చూపిన శ్రద్ధకు, చేసిన సేవకూ మెచ్చి సైనికాధికారులు ఆమెకు నాల్గ్వ పతకాన్ని బహూకరించారు. ఎడమనుండి: లెఫ్టినెంట్ జనరల్ బి. చౌధురి, సరోజిని, మేజర్ జనరల్ బి. ఎం. రావు.

లేదు. 7½గం॥ వాళ్ళుకూడ వెళ్ళిపోయినారు. మళ్లీ మంచంమీదనే నొక్కదాన్నే అయి నాను. ఇంతలోనే A. D. M. O గారు వచ్చి గదిలో ఎవరూ లేరేమిటనుకొని కాలు కట్టువిప్పి చూచి ఎక్సురేకి తీసుకొ వెడతాము ఇంక కట్టు అక్కరలేదని చెప్పి వెళ్లిపోయి నారు. ఆయన వెళ్లి ఒక నర్సును గదిలో వుండమని చెప్పి పంపినట్లున్నారు. ఆవిడ టకటక నడుస్తూ వచ్చింది. వయసు 22, 23 ఆ ప్రాంతాలలో వుంటుంది. ఆవిడ గదిలోకి వస్తూనే కాలుకట్టి విప్పివుందేమని పాదం పక్కకు వంచి కట్టడం మొదలు పెట్టింది. ఇప్పుడే ఎక్సురేకి తీసుకు వెడతారట కట్టు వద్దన్నారంటే కట్టుకట్టడమే నా డ్యూటి అని పాదం పక్కకు వేసి కట్టి పెట్టింది.

ఆ తర్వాత పక్క మారుస్తాను పక్కకు తప్పుకోమంది. "అమ్మా ఇంకొక పావు గంటలో ఎక్స్‌రేకి తీసుకు వెడతారు. ఇప్పుడు కదలడానికి కాలుచాలా బాధపెడు తోంది. అంటే వినలేదు సరికదా" మెడిసన్ కేసనుకొని వార్డులోకి వచ్చాను ఈ కేసా" అని విసుక్కొని పక్కమార్చింది. ఆతర్వాత పని అంతా సవ్యంగానే జరింగింది. ఎందు చేతనంటే మిగతా పని పెద్ద వుద్యోగులది కనుక అని నా వుద్దేశ్యం.

ఆ తర్వాత 4 రోజులున్నాను. మళ్ళీ ఎవరూ పక్కమార్చలేదు! ఆయాలను రోగుల సంరక్షణకోసం నియమిస్తారను కుంటాను. వాళ్ళు వచ్చి మీ పని ఏమైనా వుందా? అని అడగడంలేదు సరిగదా? పెద్ద డాక్టర్లలాగ వచ్చి మీ కాలుబాధ తగ్గిందా? రాత్రి నిద్రపట్టిందా? ఆకలి వేస్తోందా? ఇవి వాళ్ల ప్రశ్నలు. ఏదైనా పనివుండి కేకేస్తే నేనుగాదు అవళ్లే అమ్మాయిని పిలవండి అనడం ఆ అమ్మాయిని అడిగితే నేను గాదు ఆ అమ్మాయి ఇంకా రాలేదు అనడం అల్లా ప్రతివారు చెప్పడమేగాని వాళ్లు ఏవార్డు వాళ్లో సరిగా సమాధానం చెప్పరు.

చలిగాలి వేస్తుందని కిటికీకి కర్టెన్లు నేను వచ్చేరోజున కట్టినారు.

ఇంత అసందర్భంగాను అరాజకంగాను వుంది మావూరి ఆస్పత్రి. అల్లాగ అంత కష్ట పడి డబ్బు కోసం లోభించి వున్నామా అనుకుంటే ఇంటికి వచ్చేరోజు వాళ్ళబిల్లు చూస్తే గుండె ఆగిపోయింది. స్పెషలువార్డు పేమెంటు కనుక మూడు అంకెలున్న పద్దు కాగితం పైన ఇంకా వుచ్చుకున్నారు. ఆఖర్ని చాలబాధపడినాము ఇంత అయిందని తెలుస్తే ఇంటిదగ్గరే జరుగును గదా అను కున్నాము. ★

నా చదువు ఎందుకు పనికొచ్చినట్లు?

బి. ప్రేమలీల
(పెద్దాపురం)

"ఇంటరు, బి. యస్. సి. లో నేను చదివిన ఫిజిక్సు, కెమిస్ట్రీ, లెక్కలు ఇప్పుడు నాకేంఉపకరిస్తున్నాయి చెప్పండి. నన్నడిగితే ఏవో 'కెరియర్స్' భూజ్ చేసికొనేవారికితప్ప మిగతావారికి ఆచదువులన్నీ అనవసరమంటాను. అలం కారానికి తప్ప మరెందుకు పనికివస్తాయీ డిగ్రీచదువులు" అందామె కూతురుకు జడేస్తూ, ఏమీ జవాబు చెప్పలేక ఆమెను చూస్తూ కూర్చుండిపోయాను.

"నా గృహజీవితంలో నాకు ఉపయోగపడేవిషయాలు నేర్చుకునివుంటే నాచదువు సార్థకమైవుండేది. ఆ కెమిస్ట్రీ, ఫిజిక్సు ప్రాక్టికల్స్ నా సంసారజీవితంలో నాకేం సహాయం చేస్తున్నాయి" అంది మళ్ళీ. ఆమె అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించకపోయినప్పటికీ చాలామట్టుకు అనుభవంలో కూడిన సత్యం నాకామెమాటల్లో కన్పించింది. అయితే ఈవిషయంలో అనేక భేదాలు రావచ్చు. మనం విద్యని జ్ఞానార్జనకోసం చదువుతాంగానీ అది తర్వాత మనకు సహాయంచేయాలనీ, అవసరాలు తీర్చాలనీ చదువుతామా అంటారు చాల మంది. చాలామందికి ఈ చదువో హాబీ. కాలం గడపటానికో మంచిసాధనం: 'ఆ! ఇవన్నీ పెళ్ళిచదువులేగా' అంటారు మరి కొందరు తల్లిదండ్రులు. 'ఆ పెళ్లియ్యేంత వరకు ఏదో ఉబుసుపోకకు కాస్తచదువు' అని చాలామంది ఉద్దేశం. ఈనాడు కళాశాలల్లో పాఠశాలల్లో విద్యార్థినులు నేర్చుకుంటున్నవి పెళ్ళిచదువులేనా? మనం నేర్చిన విద్య భావిజీవితంలో కేవలం అలంకారానికా? అదేనా దాని ప్రయోజనం?

నా స్నేహితురాలొకామె బి. యస్. సి. పాసయి-బి. యల్. చదువుతూ సగంలో 'కట్' చేసి పెళ్లి చేసుకుంది. తన చదువో దరిచేరలేదని, అది ఇప్పుడు తనకెందుకూ ఉపకరించటంలేదని ఆమెకో పెద్ద దిగులు పట్టుకుంది. ఆమెను కలుసుకున్నప్పుడల్లా తన చదువు గురించి చెబుతూ "నాదంతా ముప్పాతికా-పాతికా-పరకా- చదువండీ; ఎందులోనూ సంపూర్ణతలేనిమిడిమిడిజ్ఞానం" అంటుంది నవ్వుతూ. (ఆమె ఉద్దేశం ప్రకారం తనజ్ఞానం బి. యస్. సి. లో 'ముప్పాతికా' బి. యల్. లో 'పాతికా'- ఇప్పుడు గృహిణిగా 'పరకా' అట.)

ఈ అనుభవాలనుబట్టి చూస్తే నేటి మన విద్యావిధానంలో చాలమట్టుకు మార్పులు రావాలి అని మనం ఒప్పుకోక తప్పదు. ఏదో ఒక రంగంలో పరిశోధనలు జరుపాలనో, పెద్ద ఉద్యోగాలు చేయాలనో ఆశయాలు పెట్టుకుని ప్రత్యేకంగా ప్రయత్నించేవారి మినహా, మిగతావారికి ఈనాడు వారు నేర్చే విద్య అలంకారానికి తప్ప మరెందుకూ ఉపయోగించటం లేదు. కాబట్టి బాలికల విద్యావిధానంలో అత్యవసరంగా మార్పులు జరగాలి. భావిజీవితంలో కర్తవ్య నిర్ణయానికి తోడ్పడే విషయాల్లో ప్రవీణతనిచ్చే విద్యాప్రణాళికలు తయారుకావాలి. ఈ విషయంలో ఢిల్లీలోని లేడీ ఇర్విన్ కళాశాల మహిళలను ప్రయోజనకరమైన విద్యలో పట్టభద్రులను చేయడంలో అమోఘమైన కృషి చేస్తూందని చెప్పవచ్చు. ఈ కృషికి అంకురార్పణ చేసిన ఆరోగ్యమంత్రిణి రాజకుమారి అమృతకౌర్ ప్రశంసనీయురాలు.

తప్పనిసరిగా బాలికలకూ, మహిళలకూ ప్రత్యేక విద్యాలయాలు ఉండితీరాలి. ప్రతి బాలికకూ 'డొమెస్టిక్ సైన్సు'లో మంచి శిక్షణ గరపాలి. వారి పాఠ్యభాగాల్లో గృహనిర్వహణ, ఆరోగ్యసంరక్షణ, బిడ్డలపోషణ, మున్నగు విషయాలు తప్పనిసరిగా నేర్పించే విధానాలు అమలుపరిస్తే, విద్యార్థినులు నేర్చిన విద్య ప్రతియువతీ ఇల్లాలుగాతల్లిగా సుఖమయమైన జీవితం సాగించడానికి దోహదం చేసినట్లవుతుంది.

అప్పుడు గృహిణులకు, మాతలకు 'నా విద్య ఇప్పుడు నాకేం ఉపయోగిస్తున్నది' అనే విచారం కలుగదుసరిగదా తాము నేర్చిన విషయాలు గ్రహించిన జ్ఞానం గృహజీవితంలో వినియోగించుకుంటారు. అయితే 'డొమెస్టిక్ సైన్సు'లో కృతార్థులు అయితేనేనా, సంసారాలు హాయిగా చేయగలుగుతారు? ఆవాలెడ్జి లేకుండా బతకటంలేదా అనొచ్చు. ఈ భేదాన్ని మాటలతో చెప్పలేంగాని మామూలు వజ్రానికి, సానపట్టిన వజ్రానికి ఉన్నంత తేడా వుంటుందేమో రెండిటి మధ్యా. రెండో పంచవర్ష ప్రణాళికలో మహిళల విద్యావిధానంలో చైతన్యవంతమైన మార్పులు కొన్నిటిని చేయడానికి ప్రభుత్వం సంకల్పించడం సంతోషకరమైన విషయం. ఇంకా సంవత్సరాని కొకమాటు All India Home Science conference జరుపుతూ దేశంలోని వివిధ మహిళా కళాశాలల, పాఠశాలల అధ్యాపకులంతా ఉత్తమ విధానాలతో గృహపరిపాలన బోధించడానికి తగిన ప్రణాళికలు గురించి చర్చిస్తుంటారు. ఈ సమావేశాలుకూడా మన విద్యావిధానంలో చాలమట్టుకు ప్రయోజనకరమైన మార్పులు కలిగించుతాయని ఆశిద్దాం. ★

కన్యలెలా ఉండాలి

(గతవారం తరువాయి)

మీ బిడ్డ లెలాంటివారయినా సరే సభ్యత తెలుసుకుని ప్రవర్తిస్తే ఎన్నిదోషాలున్నా కప్పిపోతాయి. అవి సరిలేవా ఎంత అందమున్నా, పుట్టింటి ధనమున్నా అత్తవారింట్లో అష్టకష్టాలు పడవలసివస్తుంది. అందం, విద్య వున్న కన్యల్లో ఆ గుణం వున్నదంటే బంగారుకు తావి యబ్బినట్లే.

అందహీనమయిన అమ్మాయీ లెందరు లేరు? వారంతా మంచివారనిపించుకోవడము లేదా? అందంతోనే మంచివారనిపించుకొనేవా రెంతమంది? సభ్యత, కలవాళ్ళు ఇంటినీ, ఒంటినీ, కూడా కళాత్మకంగా సృష్టించుకుంటారు. ఇంటిలోని అందరినీ స్వాధీనపరచుకొంటారు. ఈ సద్గుణం లేనివాళ్ళెంత ప్రయత్నించినా ఎంత భాగ్యవంతులయినా లాభం లేదు. అందరి మనస్సుల్లో వాళ్ళ వ్యవహారమొక అసహ్యభావాన్ని శాశ్వతంగా వదలిపోతుంది.

తిండితినడంలో, త్రాగడంలో, నిద్రలో కూర్చోవడంలో, నడకలో, మాటలో, నవ్వులో, చేతల్లో, ప్రతిపనిలోనూ సభ్యత, వందనం తొణికిసలాడుతుండాలి. మట్టి కొంపను బంగారంగాను, నిత్యోత్సవంగా కళకళలాడే గృహాలను నరకంగానూ, తయారుచేసేవాళ్ళు భవిష్యత్తులో కోడండ్రు కాబోయే ఈ బాలికలే.

దుస్తుల వాడకం

చాలామంది బాలికలకు దుస్తుల వాడకం చేతరాదు. మాపడం చింపడంతప్ప సరిపెట్టుకోవడం, భద్రపరచుకోవడ మెలాగో తెలిసికోరు. ఇతర వస్తువులేవీ కొద్దిరోజులపాటు భద్రంగా వుండకుండా పోతుంటాయి. తెగిన చెప్పులు పారవేయడం చినిగిన గుడ్డలు మరికొంత చినిగేదాకా ధరించడం, ఇదంతా పరిలేని వ్యవహారంతో వచ్చేదే ఇటువంటి ప్రవర్తనలకు లోనుకాకుండా తలితండ్రులు కాపాడుతూ వుండాలి.

గోడకో, తలుపుకో ఆని నిల్చోవడం కొంతమంది బాలికలకు అలవాట్లుంటాయి జీవితమంతా ఇలాటి అలవాట్లు తప్పిపోవు. ఇందువల్ల శరీరంలో సోమరితనం నిండిపోతుంది. గుడ్డలు త్వరగా మాసిపోతాయి. ఇష్టమొచ్చిన చోటల్లా కూర్చోవడం మంచిది కాదు. పరస్పరం బాలబాలికలు చిలిపిచేష్టలు చేసుకోవడం—ఒకరిగుడ్డలొకరు లాగడం—త్రిప్పి వేసి వస్త్రాలు ధరించడం—, ఈ అలవాట్లన్ని పసితనంనుండీ లేకుండాచేయాలి. కూర్చోవడం లేవడంకూడా నేర్పాలి. ఎప్పుడే విధంగా కూర్చోవాలి, లేవాలి? నిగురించాలి? కుర్చీలో కూర్చుంటే కాళ్ళు మడచి కుర్చీపై కూర్చోవటం మానాలి, పెద్దవారి సంభాషణ మధ్య బాలికలను అనవసరంగా కలుగచేసుకోనివ్వకూడదు.

నిదురించేటప్పుడు వస్త్రహీనంగా నిదరించ నివ్వకూడదు. తేలిక గుడ్డలు ధరింపజేయాలి. ఇతర బాలురతో కలిసి యొకే పడకపై పడుకోనివ్వరాదు. నిదురించిన తరువాత శరీరంపైనుండి గుడ్డలు తొలగిపోయే తరహాలో పడుకోనివ్వరాదు.

నవ్వు నాలుగందాల చేటు

నవ్వు నాలుగువిధాల చేటన్నారు మన పెద్దలు. నవ్వుతూ మాట్లాడడం తప్పేమీ కాదు. ఎదుటివారి మాటలు వినపడకుండా, ఆగిపోయేటంత ఇదిగా నవ్వరాదు. ఫక్కున అనవసరంగా నవ్వడం మంచిదికాదు. నవ్వవలసిన విషయంమీద నవ్వినదే అందం. చిరునవ్వు అందర్నీ ముగ్ధుల్ని చేస్తుంది. అదంటే అందరికీ యిష్టమే. కానీ పళ్లు ఇకిలించి కాదు. చిరునవ్వు అందరి ఎదుట పనికిరాదు. ఆత్మీయులైన వారివద్ద తప్ప. రాళ్ళచేల్లో గుంటకతోలినటు మాట్లాడకూడదు. కల్పిత హావభావాలతో కూడిన సంభాషణ మరీ అసహ్యంగా వుంటుంది. మాట్లాడేదేదో శుభ్రంగా వ్యక్తపరచవలసిన భావమేదో తొట్రుపాటు లేకుండా శుద్ధంగా మృదుస్వరంతో కూడియుండాలి. మాట్లాడేటప్పుడు గంభీరంగా నిలబడి మాట్లాడాలి. చేతులు త్రిప్పడం. ఒంటికాలూని-ముక్కు మొహము నేక రీతుల త్రిప్పడం-సంభాషణ పద్ధతికి వ్యతిరేకం.

భోజన సమయంలో

వాళ్లవ విషయం భుజించు పద్ధతెలా వుండాలి. పద్మాసనం ధరించి భుజించాలి. బల్ల భోజనములైతే నిటారుగా కూర్చొని భుజించాలి. గుడ్డలపై మరకలు పడకుండా చూడాలి. జుర్రడము, గట్టిగా చప్పరించడము



టేబుల్ క్లాత్ మీదకు— కుమారి పి. అనసూయ (నెల్లూరు)

★ గృహవైద్యం ★

గురి కుదిరితే గృహవైద్యమంత మంచిది మరేదీ లేదు. అందులో చంటిపిల్లలకు పెద్దజబ్బులైతేతప్ప పెన్‌సిలిన్, యారోమేసిన్ లాంటి మందులు వాడుట మంచిది కాదు. క. పద్మజ (తాడేపల్లిగూడెం)గారు కొన్ని వ్రాశారు. నేను నాకు తెలిసిన అనుభవాలనుబట్టి వ్రాస్తున్నాను.

పిల్లలకు ముఖ్యంగా అజీర్ణము, దగ్గు ఆయాసము (అనగా పాలవుబ్బసము), జిగటవిరోచనాలు, ఆకుపచ్చని విరోచనాలు, ఉడుకు విరోచనాలు సాధారణంగా వస్తూంటాయి.

వీటికి మిరియాలు, సొంఠి, వాము, వస కరక్కాయ వీటితో రకరకాల వైద్యాలు చెయ్యవచ్చు.

పిల్లలకు అజీర్ణము చేసినప్పుడు, అనగా పండగ, పబ్బం వచ్చినప్పుడు, మనం పని హడావుడిలో వుంటే, పిల్లలు చేతికందినదల్లా, యేదిపడితే అదీ, అరటిపళ్ళు, టెంకాయ ముక్కలు మొదలయినవీ, దానికి తోడు మనముచేసిన పిండివంటలూ తినేస్తారు. మర్నాటికల్లా పిల్లలకు అజీర్తి చేస్తుంది. అపుడు మిరియాలు, సొంఠిపొడీ తినమంటే పేచీ పెడతారు. "ఉడుకు మిరియం" ఉడికించిపెడితే ఇక కొస్త పెట్టమంటూ పిల్లలూ తింటారు. అజీర్ణమూ తగ్గుతుంది.

ఉడుకు మిరియం

కావలసిన సామగ్రి: అరటిస్పూను వాము, ఒక చిన్న సొంఠి కొమ్ము, ఒక టేబుల్‌స్పూను బియ్యము, ఒక టేబుల్ స్పూను నెయ్యి, నిమ్మకాయంత బెల్లము.

డి. భాస్కరమ్మ, ఒంగోలు.

చేయువిధము: మిరియాలు, సొంఠి, వాము, బియ్యము బాగుగా నూరుకోవలెను. చిన్న సీలుగిన్నెలో నీళ్లుపోసి బాగా పలుచగా కలిపి కుంపటిమీద పెట్టి అడుగంటకుండా కలుపవలెను. కొద్దిగా గట్టిపడిన తరువాత బెల్లము తిరిగివేసి కలుపవలెను. తిరిగి గట్టిపడగానే ఒక టీస్పూను నెయ్యివేసి కలిపి దించవలెను. చల్లారినతరువాత కుంకుడుకాయంత ఉండలుచేసి పిల్లలకు పెట్టవలెను. ఇది తింటే నెమ్మ హరించి కరకర ఆకలౌతుంది.

అజీర్ణము బాగా ఉండిపోయి తెల్లగా పిండిలా విరోచనాలు వెడుతుంటే ఒక టేబుల్ స్పూను మిరియాలు, ఒక చిన్న చిప్పగరిటెడు జీలకఱ్ఱ (పచ్చివే) తీసుకొని ఎండబెట్టి, ఉప్పువేసి మెత్తగా పొడిగొట్టి ఒక చిన్న సీసాలో పోసుకుంటే పనికొస్తుంది. ఈ పొడిని పిల్లలకి అన్నంలో నెయ్యివేసి ఒక పాలస్పూను పొడుంవేసి కలిపి పెట్టిన అజీర్ణము తగును. ఈ పొడినె బాలింతరాలు కూడా మూడవనెల వచ్చేవరకు వాడితే, తగుమాత్రము పుష్టిచేసి శరీరము తేలిగ్గావుంటుంది.

కరక్కాయతో

దగ్గుకు కరక్కాయను మించిన మందు ఏదీ లేదు. 2-8-0 యిచ్చి కొన్న యారోమేసిన్, 1-8-0 యిచ్చి కొన్న ఖిలోమైసిన్ లాగనె 0-0-8 యిచ్చి కొన్న కరక్కాయ పనిచేస్తుంది. కొంచెము పెద్దపిల్లలైతే చిన్న ముక్క బుగ్గను పెట్టుకుంటే మరి దగ్గురాదు. చిన్నపిల్లలైతే (అనగా నెలపిల్లలైతే) చనుబాలలో 8 చుట్లు అరగదీసి పొయ్యవచ్చును. లేకుంటే చిన్నముక్క ఆముదములో వేసి కాచి పట్టవచ్చును. ఇది సంవత్సరమునుంచి ఐదేళ్ళ పిల్లలవరకు తినమని పేచీపెడతారు. అపుడు 1 డజను కరక్కాయలు దోరగా వేయించి మధ్య వితనం పారేసి మెత్తగా పొడిగొట్టి సీసాలో పోసి దాచవలెను. ఒక తమలపాకులో కొంచెము తేనెవేసి ఒక అరచిటికెడు పొడివేసి తేనె కలిపి పిల్లలచే నాకిస్తే సుళువుగా తగ్గుతుంది. సమయానికి తేనె లేకపోతే, పంచదార పొడిలోగాని పటిక బెల్లం పొడిలోగాని ఒక చిటికెడుపొడివేసి కలిపి ఈయవచ్చును. పెద్దవారికి కూడా కరక్కాయలు పనికొస్తాయి.

వాము

అజీర్ణం చేసినపుడు, ఉడుకు మిరియము గాని, మిరియం పొడిగాని చేయటానికి తీరనప్పుడు ఒక అరస్పూన్ వాము, ఒక చిటికెడు నూరిన ఉప్పు, బాగుగా అరచేతిలో వేసుకొని కలిపి అన్నంలో నెయ్యివేసి చేతిలోని పొడిని అన్నములోవేసి, కలిపి పిల్లలకు పెట్టవలెను. అసలు ఏడాదినుండిమూడో ఏడు వచ్చేవరకు పిల్లలకు గుజ్జు అన్నములో వామువేసి పెట్టితే అజీర్ణము చెయ్యమన్నా చెయ్యదు లివర్ మొదలైన జబ్బులుకూడా రావు. చంటిపిల్లల అన్నములో ఆవునెయ్యి వాడిన మంచిది.

వసకొమ్ము

నెలల పిల్లలకు ఆకుపచ్చని విరోచనాలు అయితే వసకొమ్ము కాల్చి 8 చుట్లు చనుబాలలో అరుగదీసి త్రాగించితే తగ్గగలవు. పసుపు పచ్చగా రోజుకు పది, పన్నెండు సార్లు వెడితే, 4 ఆవునేతి చుక్కలు చంచాలోవేసి చనుబాలు కలిపి రంగరించి పెడితే ఇట్టే తగుతాయి.

రక్త విరోచనాలుగాని, జిగట విరోచనలుగాని వెడితే ½ టీస్పూన్ మెంతులు పెరుగులో నాననిచ్చి, తినిపిస్తే ఇట్టే తగ్గుతాయి. పెద్దవారికికూడా పనికొస్తుంది. మెంతులు తినలేని పిల్లలకు ఒక టేబుల్‌స్పూన్ సగ్గుబియ్యం, నీళ్ళలో ఉడికించి, ఒక టేబుల్ స్పూన్ చక్కెర, పాలుకలిపి పెడితే బాగా తింటారు విరోచనాలు తగ్గుతాయి.

గసగసాలు

గసగసాలు రెండణాలకి తెచ్చి, శుభ్రంగా బాగుచేసి దోరగా వేయించి ఒక్క మిరపకాయ, తగుమాత్రం ఉప్పు, వేసి పొడి

కన్యలెలా ఉండాలి

నోటిలో అన్నంకన్నతూడు వుండగా మాట్లాడడం, తప్పు. అతి త్వరితంగానూ, అధిక ఆలస్యంగానూ భుజించరాదు. వ్రేళ్లు నాకరాదు.

వస్తు అలంకరణ మరో విషయం. ఇంటిలోని వస్తువులను సక్రమపద్ధతిని అలంకరించలేనివారు. చెడినవస్తువులు చక్కచేయ నేర్పులేని కన్యలు, గృహస్థ జీవితంలో చాలా బాధపడతారు. ఏ వస్తువయినా తగినచోటున వున్నప్పుడే రాణిస్తుంది. అలాంటి వస్తు అలంకరణ బాల్యమునుండే అలవాటు కావాలి. ఇంటి అలంకరణ బాలికల పని. వారికి తగిన తర్ఫీతునివ్వాలి. సరియైన వ్యవస్థలో వున్న యిల్లు ఎంత దరిద్రదశలో వున్నా అందంగా కన్పడుతుంది. అస్తవ్యస్తంగా వున్న యిల్లు చూడండి, ఎంత భోగభాగ్యాలతో తులతూగుతున్నా అసహ్యంగా వుంటుంది. అయిదునిముషాలు కూర్చోవడానికి బుద్ధిపుట్టదు. కాబట్టి అలంకరణ బాలికల కివ్వవలసిన శిక్షణ లన్నిటిలోనూ ముఖ్యమయింది.

"సదా ప్రహృష్టయా భావ్యం
గృహకార్యేషు దక్షయా
సుసంస్కృతోపస్కరయా
వ్యయే చాముక్తహస్తయా."

(మనువు)

స్త్రీలు సదా ప్రసన్నచిత్తము కలవారై వుండాలి. ఇంటిపనులయందు నేర్పరితనం. ఇంటి వస్తువులపై, జాగ్రత, వాటిని చక్కబెట్టుకొనుట ఖర్చుచేయుటయందు వితరణ వుండాలి.

సంస్కారంలేని బాలికలు సంఘములో అశాంతిని రేపుతుంటారు. కాబట్టి బాలికల సంస్కరణ తల్లుల ప్రథమ కర్తవ్యం. ★

పులగంపల్లి లక్ష్మి

ఉత్సాహానికి తగ్గ ప్రోత్సాహం ఉన్నరోజున

మొన్నీమధ్య మా స్నేహితురాలింట్లో వాళ్ల పాపకు భోగిపళ్లు పోస్తుంటే వెళ్లాను. పేరంటానికి చాలామంది వచ్చారు. వచ్చినవాళ్లలో ఒకమ్మాయి డాన్సుచేసింది. తరువాత చాలామంది అమ్మాయిలు పాటలు పాడారు. దానితో ఆడవాళ్ల సంభాషణ నృత్య, సంగీతాలమీదికి మళ్ళింది. వాళ్ళమ్మాయిలు సంగీతంలో ఎన్ని పరీక్షలు ప్యాసైనారో, డాన్సులో ఎన్ని ప్రైజులు సంపాదించారో చక్కగా వర్ణించి చెపుతున్నారు. ఒకరి నోటనైనా "మా అమ్మాయికి "చిత్రలేఖనం"పోటీలో బహుమతివచ్చింది" అన్న మాట వినిపిస్తుందేమోనని చూశాను. కాని అలాటి దేమీ కనబడలేదు.

స్త్రీలలో చాల తక్కువమంది చిత్రలేఖనంలో కృషిచేస్తున్నారు. ఏ అమ్మాయి చూసినా, సంగీతమో, డాన్సో నేర్చుకుంటూంటుంది, గాని చిత్రలేఖనం నేర్చుకోదు. ఎంచేతంటే తగిన ప్రోత్సాహం లేక అనుకోవాలి. దేనిలోనైనా తగిన ప్రోత్సాహం లేనిదే స్త్రీలు ముందుకు రారు. మంచి ప్రోత్సాహం లభిస్తే స్త్రీలు మంచి చిత్రకారిణి లవుతారని నా నమ్మకం. మన పెద్దవాళ్ళలో చాలమందికి చిత్రాలపట్ల మంచి అభిప్రాయం లేదు.

ఆమధ్య మా పిన్నికూతురు బొమ్మలు వెయ్యడం నేర్చుకుంటానంది. దానికి వాళ్లనాయనమ్మ ఒకటే గోల పెట్టేసింది. బొమ్మలేయడం ఏదో తప్పుపనైనట్లు మాట్లాడింది. "శుభ్రంగా సంగీతం నేర్చుకోక ఇదేం బుద్ధీ. ఇంకా నయం, డాన్సు నేర్చుకుని తైతక్కలాడతా ననలేదు", అంటూ ఊరికే ఇదై పోయింది. దానికి వాళ్ళనాన్న (మా బాబాయి) తాళం వేశారు. నాయనమ్మ అయితే ఏదో అంది లే, ఆ రోజులలోవాళ్లు ఒకపట్టాన మారరు అని సరిపెట్టుకోవచ్చు. చదువుకునీ ఉద్యోగం చేస్తూ నలుగురితో తిరిగే మా బాబాయి అన్న మాటలకే నాకు విచారం

కోకా శ్యామల

(మద్రాసు)

కలిగింది. చివరికి బలవంతంగా సంగీతం నేర్పించారు. కాని ఆ అమ్మాయి ఎన్నాళ్లు నేర్చుకున్నా సంగీతం రాలేదు. ఇష్టం లేని విద్య నేర్చుకుంటే మాత్రం వస్తుందా? సరదాపడి బొమ్మలు వేయడం నేర్చుకుంటానన్న అమ్మాయిని ఇలాగేనా ప్రోత్సహించడం?

ప్రోత్సహించకపోతే నేర్చుకునేవాళ్ళు మానేస్తారా? అంటారేమో. అందరు మానేయకపోయినా మా పిన్నికూతురులాంటివాళ్లు తప్పక మానేస్తారు. ఇంతెందుకూ, "వనితాలోకం" శీర్షిక చూడండి. ఇందరు వనితలు పాల్గొని, వారికి తెలిసినవి, నలుగురు తెలుసుకోదగ్గవి పత్రికలో వ్రాస్తున్నారంటె దానిక కారణం సంపాదకుల ప్రోత్సాహం కాక మరేమిటి?

పోతే ప్రతిదాన్ని డబ్బుతో కొలవడం మనకు పరిపాటి. "ఆ బొమ్మలు గీస్తె ఏం లాభం? కూటికా, గుడ్డకా," అంటుంటారు. ఆ మాట కొస్తే సంగీత నృత్యాలు నేర్చుకుని ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పరీక్షలు ప్యాసౌవుతున్న వాళ్ళంతా డబ్బు సంపాదిస్తున్నారా? అవసర మొచ్చినప్పుడు, ప్రయత్నిస్తే చిత్రకారిణిలు మాత్రం సంపాదించగలరు.

ముగ్గులురాని తెలుగు స్త్రీ లుండరు. ముగ్గులు చిత్రకళ అంటారు. అలాగే అలంకరణ గూడ ఒక కళే నంటారు. ఇవి తెలిసిన స్త్రీలు చిత్రలేఖనంలో పట్టుదలతో కృషిచేస్తే ఎందుకు రాణించరు? నృత్య, సంగీతాలకన్న, పదికాలాలపాటుండేది చిత్రలేఖనమే. ఇప్పటికి ఎందరో చూచి ఆనందిస్తున్న అజంతా చిత్రాలు ఏనాటిది? వాటిని చిత్రించిన వారెరి? ఇటువంటి ఉత్తమకళను మనవారు ఇలా చిన్న చూపు చూడడం చాల విచారకరం.

మొక్కజొన్నలతో...

మధ్యాహ్నం కాఫీవేళకు ఏదైనా టిఫిన్‌కోసం ఒక్కొక్కసారి వెతుక్కోవాల్సి వస్తుంది. అప్పటి కప్పుడు కావాలంటే మొక్కజొన్నలతో చేసుకోతగ్గ టిఫిను ఒకటుంది.

అవసరమైనన్ని సేర్లు మంచి మొక్కజొన్నలు (ఎండుది) తీసుకుని నీళ్లు చల్లుకుంటూ పోటువెయ్యాలి. నీళ్లుచల్లడం కేవలం పొట్టుఊడడానికే. కనుక మరీ ఎక్కువ చల్లగూడదు. పొట్టుచెరుగుతూ, మళ్లీ పోటువేస్తూ శుభ్రంగా వాటి మొనలు ఊడేదాకా చెయ్యాలి. తరువాత, పొట్టులేకుండా బాగాచెరిగి, వాటిని పెద్దగిన్నెలోవేసి నీళ్లుపోసి బాగా ఉడికించాలి. గుగ్గిళ్లమాదిరి ఉడికిన తరువాత దించివార్చి కొద్దిగా మెత్తని ఉప్పువేసి చేత్తో బాగా కలిపి ఎండ పొయ్యాలి. బాగా పెళపెళ ఎండిన తరువాత డబ్బాలోపోసి ఉంచుకోవాలి. ఎప్పుడు కావాలంటే అప్పుడు బాణలిలో చమురుపోసి అటుకులులాగా వేయించుకోవాలి. అప్పుడవి పేలాల లాగా పొంగుతాయి. వేయించి తీసి ఉప్పూ, కారం, పుట్నాలు (బజార్లో అమ్మే వేయించిన సెనగపప్పు) కొద్దిగా కలవాలి. చాలామందికి దీనిలో వెల్లుల్లిపూరి కలిపితే ఇష్టంపడతారు. కమ్మని రుచితో కరకర లాడుతూ మొక్కజొన్నలతో చేసినవని చెప్పేదాకా తెలియదు.

ఒకవేళ పచ్చిగాఉన్న (బాగా ముదిరిన) మొక్కజొన్న కండెలు దొరికినట్లయితే గింజలన్నీ ఒల్చి మూకుట్లో వెచ్చచేసి వాటిని రోట్లో నానేసు, నానేదు ఊకపోసి పోటువెయ్యాలి. బాగా పోటువేసి, చెరిగి, ఉప్పురాచి ఎండ పొయ్యాలి: మిగతావిషయం పైదానికి మల్లేనే.

తెన్నేటి అహల్యాదేవి. (హనుమకొండ.)

చేసి వేడి అన్నంలో కలిపి తింటే జిగట విరోచనాలు బాగా తగ్గుతాయి. అరటికాయ తెచ్చి కాల్చి పచ్చడిచేసి పెట్టినా తగ్గుతాయి. అన్నింటికన్నా మంచిది వేడి వేడి పాకంతో ఉన్న బెల్లం జిలేబీ తిన్నా తగ్గుతుంది.

ఏదైనా 3 రోజులు మాత్రమే మనవైద్యము. నాలుగవ రోజున తప్పక, పిల్లలకైనా పెద్దలకైనా డాక్టరుకి చూపించాలి.

ఉత్తరాలు:

చిన్న రకం నరకం

మనఆంధ్రలో తెలుగు సినిమాహాల్సు ఎంత దరిద్రంగా ఉన్నాయో పి. పూర్ణిమగారు వ్రాశారు. ఒక్క సినిమాహాలులే కాదు ఇలాంటి ఇబ్బందులు బస్సుప్రయాణంలో కూడా ఉన్నాయి. సినిమాహాలులాగే దీనికి కూడా మనుష్యులలెక్క లేదు. అంత అధ్వానంగా ఉంది. బస్సురూట్ బస్సుసీట్లు లెక్కకి ముప్పైరెండుమాత్రమే! టిక్కెట్లు అమ్మకానికి ఫుల్ స్టాప్ అన్నది లేదు. అడిగినవారందరికీ లేదనకుండా (కాళీఉన్నా లేకపోయినా) డబ్బుపుచ్చుకుని దానంచేస్తారు. బస్సులో కూర్చున్న తరువాత బలవంతాన లేవతీసేసి క్రిందకూర్చోపెట్టేస్తారు. ఆడవాళ్ళసీట్లో ఆరుగుర్ని కూర్చోమని హుకుంఉంటే పదిమందినికూర్చోమని అధికారంచెలాయిస్తారు కండక్టర్లు. ఆడామొగా విచక్షణలేకుండా ప్రవర్తిస్తారు.

ఇంకా సినిమాహాల్సు గుడ్డిలో మెల్లలా కొంతనయమేననిపిస్తుంది. ఎందుచేతనంటే పైభాగం విశాలంగానయినా ఉంటుంది. బస్సుకి అదీలేదు నిలబడితే పైన టాపు తగలడంతో తలబొప్పి కట్టేస్తుంది. బస్సులోకి జనాన్ని, ఎక్కించడం అనడంకంటే తోసెయ్యడం అంటే మంచిదేమో. కిక్కిరిసిపోవడంమాట అలాఉండగా, చుట్టాబీడీల బాధ ఇక్కడకూడాఉంది. మళ్ళీబస్సులో ఒకవైపు ముత్యాలలాంటి అక్షరాలతో "పొగపీల్చరాదు" అని వ్రాసి ఉంటుంది. ఇలావ్రాయడంలో అర్థమేమిటోబోధపడదు. బస్సుకి టైమ్సుఅన్నది ఉండవు. తొందరగా కదిలితే గాలివస్తుందనుకుంటే ఐదునిమిషాలు బస్సుకదిలితే మళ్ళీ అరగంటదాకా స్టార్టవదు. ఏదైనా ఊర్లో బస్సు ఆగిందంటే డ్రయివరుతోసహా దిగిపోయి ఏపాకలోనో చాతాఖానీ కొట్టుకుంటూ కూర్చుంటారు. స్టేషనుఉన్న ఊరయితే ఫరవాలేదు కొన్ని కొన్నిచోట్ల ఇరవైమైళ్ళు బస్సుప్రయాణం చేస్తేకాని స్టేషనుకువెళ్ళడానికి వీలుండదు. సినిమా అయితే మొదటిరోజు కాకపోతే ఇంకో వారం పోయాకా చూస్తాం. ప్రయాణాలు అలాకాదు. అతిముఖ్యమైనవి అర్జంటయినవీ ఉంటాయి. అలాంటప్పుడు మానడానికి వీలుండదు. బస్సులోంచి ఒకమనిషిదిగితే దానిని భర్తీచేయడానికి నలుగుర్ని ఎక్కిస్తారు. ఇంకోచిన్నవిషయం చెక్ ఇనస్పెక్టర్ వస్తున్నట్టు అనుమానం వేస్తే మధ్యదోవలో జనాన్ని దింపేస్తారు. ఆడవాళ్ళని దింపరు. అందుకు కొంచెం సంతోషించాలి. మనఅవసరాలు కనుక డబ్బు ఇచ్చి ఇబ్బందిపడాలి. ఇలాంటివిషయాలు ఒకరికొకరు చెప్పుకోవడంతప్ప క్రియాశూన్యం అనిపిస్తుంది.

ఎస్. రాజేశ్వరి. (మాకవరపాలెం)

ఉత్సాహం ప్రోత్సాహం

ప్రోత్సాహం, ప్రోత్సాహం అంటున్నానే ఈ ప్రోత్సాహం ఎవరివ్వాలి? అని సందేహం కలగొచ్చు; మనమె ఇవ్వవచ్చు. మన ఇంట్లోగాని ఇరుగుపొరుగునగాని ఎవరైన చిత్రలేఖనం పట్ల అభిరుచి నకబరిస్తే వాళ్లని ప్రోత్సహించి, దానిలో మంచిని తెలియచెప్పాలి. ఇంకా స్త్రీల క్లబ్బులు, మహిళామండలి మొదలగు సంఘాలద్వారా ప్రోత్సహించవచ్చు. సాధారణంగా, వార్షికోత్సవాలు, ఇంకా ఇతర ఉత్సవాల సందర్భాలలో నాటకాలు, సంగీత కచేరిలు ఏర్పాటు చేస్తుంటారు. అటువంటప్పుడు చిత్రప్రదర్శనం ఏర్పాటు చేసి స్త్రీలు చిత్రించిన చిత్రాలు అందులో ప్రదర్శించవచ్చు. లేదా చిత్రాల పోటీ పెట్టి బహుమతులివ్వవచ్చు. పోటీ అనగానే మనవాళ్లకెక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఉదాహరణకి ఆంధ్ర వారపత్రిక నిర్వహించిన ముగ్గులపోటీ చూడండి. ఒక బహుమతి ఇవ్వాలని నిశ్చయించుకున్న వారిచేత రెండు బహుమతులిప్పించారు మన సోదరీమణులు.

ప్రోత్సహించలేనివారు మాట్లాడకుండా వూరుకోవడం మంచిది. హేళనచేసి వారిని నిరుత్సాహ పరచగూడదు. హేళన చేసినా గూడా చిత్రలేఖనమ్మీద అభిరుచి వున్న వాళ్లు బెంగపడి మానేయగూడదు. కొన్నాళ్ళ క్రిందట మాకు తెలిసిన వాళ్ళమ్మాయి బొమ్మలు వేసేది. ఆ బొమ్మల్ని చూసి వాళ్ళన్నయ్య హేళన చేసేవాడు. "చూడు చెల్లాయి, నీ బొమ్మలు చూడానికి వచ్చే వాళ్ళకూడ డాక్టర్ని తీసుకురమ్మను. ఎందుకంటె చూసినవాళ్లు మూర్ఛపోతే చికిత్స చేయడానికి" అనేవాడు నవ్వుతూ. కాని ఆఅమ్మాయి "ఏడిశావులే" అనేసేది తేలిగ్గా. అతని ఉద్దేశం ఆడవాళ్ళు బొమ్మలు వేయలేరని. అది పొరపాటని వాళ్ళ చెల్లెలె తెలియచేసింది. ఇప్పుడు ఆ అమ్మాయి వేసిన బొమ్మల్ని వాళ్ళన్నయ్యే మెచ్చుకుంటున్నాడు. "అప్పుడలా ఎందుకన్నానా" అని ఇప్పుడు నొచ్చుకుంటాడు. కష్టపడి పట్టుదలతో కృషిచేస్తే స్త్రీలకు రానిదేముంది? ముదితల్ నేర్వగరాని విద్య గలదే!... ★

మొహమాటం

మొహమాటంవల్ల ఒక్కొక్కసారి చాలా బాధపడాలిసొస్తుంది. ఏ సంగతో ఎందుకూ మనం పట్నం వెళ్తున్నామని పొరుగువారికి తెలిసిందా వెంటనే వచ్చి "ఏమండీ మీరు వూరికి వెళ్తారట. మా సిల్కుచీర వచ్చింది అలాటిది తెచ్చి పెట్టండి అని ఒకరూ, స్టెయిన్‌లెస్ స్టీలు పళ్ళాలు తెచ్చిపెట్టండి బావుంటున్నాయట అనీ ఒకరూ, చెప్పటం మొదలుపెడతారు. తేవటానికి వీలవదని చెప్పవచ్చుగా అంటారేమో! మొహమాటంగా ఒకవేళ తేమని చెప్పినా "ఈ భాగ్యానికేనా మాకు వీలవదు గనుక చెప్పాం కానీ" అంటూ నిష్ఠూరము. పోనీ తెమ్మన్న వారు డబ్బయినా అంతా యిస్తారా అంటే అదీ లేదు. "యింతవరకు తీసుకోండి మిగతాది వచ్చిన తరువాత" అంటారు. తరువాత ఎలాగయినా తీసుకువచ్చినా, మా చీరలా కాదనీ, యింత ఖరీదు లేదటగా అనీ అంటారు. బాధపడి తీసుకువచ్చినా యిలా అన్నారేమిటా అని బాధపడాలి. నాపని ఒకటి రెండుసార్లు యిలాగే అయింది. అప్పటినుండి, తేలేను అని ఖచ్చితముగా చెపుతున్నా. వారు నన్నుగురించి తరువాత ఏమనుకున్నా, ఈ బాధలు లేకుండా పోయాయి.

సాధ్యమయినంతవరకు మొహమాటం లేకుండా వుంటేనే అన్నివిధాలా మంచిదని స్వానుభవంవల్ల తెలుసుకున్నాను.

వై. విమల, నేలకొండపల్లి.

తలనూనె తయారీ

27-3-57 ఆంధ్రపత్రికలో తలనూనెల తయారీ గురించి, బి. రత్నావళిగారు వ్రాసి

వది బాగుంది. ఆమె చెప్పిన దినుసులుకాక మల్లె, మందార, సంపంగి, మొగిలిపువ్వులు కూడా వేసి కాచవచ్చును. రత్నావళిగారు నిమ్మరసం కలిపికాచాలని చెప్పారు. నిమ్మరసము వెయ్యనవసరము లేదు. నిమ్మఆకులు వేస్తే చాలు. నూనె, దినుసులు, నీళ్ళు, పువ్వులు, నిమ్మ ఆకులు వేసి ఒకరోజువుంచి. ఆమె వ్రాసినట్లె కాచాలి. కొబ్బరినూనె కాచి నట్లే, ఆముదము కూడా కాచవచ్చును. కొబ్బరినూనె కన్న ఆముదమే చలువ చేస్తుందంటారు. ఆముదానికి కూడా కొబ్బరినూనె మాదిరి వేసికాచాలి. కొబ్బరినూనెకు పువ్వులు వేసినా వెయ్యకపోయినా, ఆముదానికి మాత్రము తప్పకుండా వెయ్యాలి.

బా. రాలీలాకుమారి,

మోర్ల వారిపాలెం.

ఈ రోజుల్లో

సర్వమంగళగారు "చుట్టాలు వస్తున్నారు జాగ్రత్త" అనే వ్యాసం చాలా విపులంగా వ్రాసేరు. చదువుతూఉంటే ఈ రోజులలో కూడా ఇటువంటి చుట్టాలు ఉన్నారా? అని ఆశ్చర్యము వేసినది. నాల్గు రోజులు స్వగ్రామంవెళ్ళి రావటానికి శెలవు దొరకటం కష్టం. అలాటప్పుడు చుట్టరికం సేవించటానికి తీరిక ఎక్కడిది. కాలమాన పరిస్థితులు అందరికి తెలిసినవేను. ఎంతో దగ్గర చుట్టాలైతేను మన సన్నిహితులైతేను వస్తారు. దూరపు బంధువులు వరసలు చెప్పుకొని రావటానికి మొహమాడ పడతారు.

పి. మహాలక్ష్మి (వాల్తేరు.)

నా నమ్మకం

ఆంధ్ర వారపత్రిక (3-4-57) వనితా లోకం శీర్షిక కింద, శ్రీమతి రామదాసుగుణగారు (బిలాస్‌పూర్) వ్రాసిన, 'గాలి దుమారం' అన్నదానితో నేను ఏకీభవించుచున్నాను. ఆమె వ్రాసినట్లుగానే కోడళ్లంతా మంచివాళ్ళని, అత్తగార్లే చెడ్డవారని అంటే నేనూ వప్పుకోను. కోడలు కొన్నాళ్లు ఓర్పు వహిస్తే, ఎంతటి అత్తగారయినా, ఒకరుగాదు పదిమందయినా మనని ఏమి అనలేరని నేనూ గట్టిగా చెప్తాను. మన సహనం, ఓర్పువల్ల వాళ్లలో తప్పక మార్పు తీసుకురాగలమని, (అంటే ఒకవేళ చెడ్డవారయినా) నా నమ్మకం. ఒకమాటు మన మంచితనం వాళ్ళకు తెలిసిందంటే, మనని అనవసరంగా వాళ్ళుఅనరనే నేనూ చెప్తాను. అయితే పెద్దవాళ్ళు ఏదన్నా అన్నా, ఘరవాలేదన్న ఓర్పుమాత్రం చూపించాలి.

కె. మహాలక్ష్మి పాడేరు (విశాఖ)

మాట విలువ

3-4-57 వ తేదీ పత్రికలో అత్తల మీద గాలి దుమారం లేచిందని శ్రీ రామదాసు సుగుణగారు రాసినది చదివాను. చెప్పకోటాని వీలైన వ్యక్తులందరినీ (మంచిగానో లేక చెడుగానో) వనితా లోకంలో చెప్పకుంటూనే ఉన్నాము. కాబట్టి కేవలం అత్తల మీదే గాలి దుమారం లేచిందని బాధపడ నక్కరలేదు.

వేరే ఉండాలని సలహా ఇచ్చారని విమర్శించారు సుగుణగారు. ఒకరు అన్నారని ఉలికి పడతారు కాని సరిపడక పోతే ఏం చేస్తారు? కేవలం అత్తాకోడళ్లేకాదు. అత్తగారు లేని తోడికోడళ్ళకు సరిపడదు. లేకపోతే అన్నదమ్ములకే సరిపడదు. వేరు పడక ఏం చేస్తారు. మరి కుటుంబంలో వ్యక్తులు ఒకర్ని ఒకరు అర్థం చేసుకుని ప్రవర్తిస్తే.తగాదాలే రావు. గుట్టుగానే ఉంటుంది. అది లేక చీటికి మాటికి తగవులాడుకుని బజారెక్కి వాళ్లకు చెప్పబూనటం కూడా ప్రమాదమే. మా పిన్నత్తగారి ఇంటికి ఎదురుగా ఒక అత్తగారు ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వాళ్ళు రోజూ ఏదో విధంగా తగవులాడుకుని మా అత్తగారి దగ్గరికి తీర్పుకొచ్చేవాళ్ళు. వాళ్ళలో ఎవరికి అనుకూలంగా మాట్లాడినా రెండవ వారికి కోపం రావటం జరిగేది. ఇలాంటి వ్యక్తులకు ఎవరు ఏం చెప్పగలరు. ఇక, కోడలు వల్ల పొరపాటు జరిగితే ఏకాంతంగా అలా చేయకూడదని చెప్పాలి కాని నలుగురి ఎదుటా కేక లేస్తే ఏం బాగుంటుంది. కేక లేసిన వాళ్లకు మాత్రం ఏం ఘనతగా ఉంటుంది.


చాలా మంది కోడళ్లు అత్తగారిని లక్ష్య పెట్టరని రాశారు సుగుణగారు. అలాంటి వాళ్లు కూడా ఉండవచ్చు. కేవలం కోడళ్లందరూ మంచివాళ్లని, అత్తలందరూ మంచి వాళ్లుకారని నేను చెప్పలేదుగా? అత్తగార్ని లక్ష్యపెట్టని కోడళ్లు అరుదు. అలాంటి వాళ్లకు తప్పకుండా చెప్పాల్సిందే నేను కాదనను కాని వంగిన కొద్దీ వంచుతాం అంటారు కొందరు. అలాంటి వారి మాటే నేను చెప్పేది.

మానవజన్మ ఎత్తిన తరువాత పొరపాట్లు అంటూ రాక పోవు. అలా పొరపాట్లు జరిగినప్పుడే సహనంతో ప్రవర్తించి అవతల వాళ్ళకు మనమీద గౌరవం కలగజేసుకోవాలి. అలా కాకుండా "అత్త కొట్టిన కుండ అడుగోటి కుండ, కోడలు కొట్టిన కుండ కొత్త కుండ" అన్నట్లు ప్రవర్తించ కూడదు. ఈ మాట అందరికీ సుమండీ అత్తలకు, కోడళ్లకు, అని ప్రత్యేకించి చెప్పటం లేదు. ఈ మాటలు అందరూ ఆచరణలో పెట్టాల్సిందే కాని ఎవరికి వారు తమను మాత్రం మినహాయించుకుని మాటలు చెప్తారు.

కుటుంబంలోవారు ఒకరినొకరు అర్థం చేసుకుని అతవలివారి మాటకు కూడా కొంత విలువ నివ్వాలి. ఆ విలువ ఇవ్వకపోతే రెండవ వారికి లోలోపల నిర్లక్ష్య భావం ఏర్పడుతుంది. కొంత కాలానికి అది బయటపడి మనుషులను లెఖ్ఖ చేయకుండా మాట్లాడుతుంది అని పైవారిచేత అనిపిస్తుంది. అట్లా కాకుండా ఒకర్ని ఒకరు గౌరవించుకుంటే తగాదాలేరావు. గౌరవం అనగానే చిన్నవాళ్లకు పెద్దవాళ్లు ఏం గౌరవం ఇవ్వాలి అని అంటారు. అది సరికాదు. అత్త కోడలికి, భర్త భార్యకి, తల్లి కూతురుకీ గౌరవం ఇవ్వాలి. గౌరవం అంటే నమస్కరించి మీరు అనటంకాదు. రెండవవారి మాటనుకూడా కాస్త వినుపించుకొని మంచి చెప్పినప్పుడు ఆ ప్రకారం జరపటమే చిన్నవాళ్ళకు పెద్దవాళ్ళు ఇవ్వగల గౌరవం. అట్లాకాకుండా ఎవరికివారు రెండవవారిని (పైకిగాని, మనసులోకాని) ఈసడిస్తూ ఉంటే ఆ ఇల్లు సాక్షాత్తూ నరకం అవుతుంది. అట్లా ఇంటిని నరకంకాకుండా చూసుకునే బాధ్యత ఇంట్లో అందరికీ ఉన్నది.

టి. నిర్మల (గుంటూరు).

★



పాప జవాబులు

అలపర్తి వెంకటసుబ్బారావు

తల్లి: చిట్టిపాప! కుక్కతోక
పట్టి లాగుచుంటివా?
పాప: లేదమ్మా! అలా చేయ
లేదమ్మా నిజంగా!
పట్టుకొంటి కుక్కతోక
మాత్రమేను మెల్లగా!
అంత, కుక్క...తన తోకను
అదే లాగుచున్నదే!

* * *

తల్లి: చిట్టి పాప! నీ కందదు
ఉట్టిమీది అప్పచ్చి!
చేతులెత్తి ఉట్టిక్రింద
చిందులేయు టెందులకు?
నోటిలోన నాలికుండ ఇన్ని
పాట్లు పడెద వేల?
పాప: నోటిలోన నాలికున్న
మాట నిజమె! అయినగాని,
నా నాలికకంటె గూడ
నా చెయ్యి పొడుగమ్మా!
అందుకనే చేతులెత్తి
చిందులేయుచున్నానే!

* * *

తల్లి: చిట్టిపాప! చిలిపి పనులు
చేయదగున యీ రీతిగ
నీళ్ళపంపులోన రోజు
నిమ్మతొనలు వేశావు.
పాప: కొద్దిసేపుపోసి పంపు
గొట్టినచో; బిందెలు మరి,
బొక్కెనలే నిండి, నీళ్ళు
రాలేదన్న వచ్చుగా!
నిమ్మతొనలు కొన్ని పోసి
నేను పంపు కొట్టగాను
అమ్మా! మరి రాలేదన్న
నిమ్మతొనలు వచ్చునేమొ!

భోజ చక్రవర్తి

ఉత్తర హిందూదేశంలో విజయపురం అనే చిన్న పల్లెటూరు. ఆ వూళ్లో విష్ణుశర్మ అనే బ్రాహ్మణుడు. ఆ బ్రాహ్మడికి డజనుమంది పిల్లలు. దారిద్ర్యదేవత వాళ్లింటో విశృంఖలవిహారం చేసేది. ఎన్ని పాట్లుపడినా పాపం విష్ణుశర్మ సంసారాన్ని పోషించలేక పోయేవాడు. దానికి సాయం భార్య గయ్యాళి. విష్ణుశర్మని ఎప్పుడూ అవ్వి తెమ్మనీ ఇవ్వి తెమ్మనీ వేధించుకుతినేది. జీవితం అంతా దుఃఖమయంగా కనుపించేది విష్ణుశర్మకి. ఏ రాజుదగ్గరకైనా వెళ్లి నాలుగు రూపాయలు సంపాదిద్దామా అంటే తనకి ఏ పాండిత్యం రాదాయను. ఇంట్లో భార్యపోరు. బయట అప్పులవాళ్ళ గోల. తరతరాలుగా వచ్చిన గృహాన్ని తాకట్టుపెట్టి విష్ణుశర్మ కొంతడబ్బు బదులు తెచ్చేడు. ఒక నెలరోజులు సుఖంగా గడచింది. డబ్బంతా అయిపోయింది. ఇంక ఏం చెయ్యాలో విష్ణుశర్మకి తోచలేదు. మర్నాడే భార్యాబిడ్డలతో ఇల్లు ఖాళీచెయ్యాలి. గౌరవంగా పోకపోతే వాళ్లు బలవంతాన్ని లేవగొడతారు. ఊరంతా అప్రతిష్ఠ పాలవడం... వంశ గౌరవం నాశనం... విష్ణుశర్మ కేంచేయాలో పాలుపోలేదు.

ఇంటిదగ్గర పోరుపడలేక శర్మ త్రివేణీ సంగమంకేసి నడక సాగించేడు. ఆత్మహత్య చేసుకుంటే బాధలన్నీ హరించిపోతాయి. భార్యకి బుద్ధివస్తుంది. పైగా త్రివేణీ సంగమంలో పడి మరణిస్తే మహా పుణ్యం! అప్పటికే చీకటిపడడం వలన అక్కడ ఎవరూలేరు. శర్మ ఉత్తరీయాన్ని గట్టుమీద పడవేసి లోపలకు దిగబోతున్నాడు. కొంచెం దూరంగా ఎవరో నదిలో స్నానం చేస్తూన్న అలికిడయింది. పదడుగుల దూరంలో ముగ్గురు అమ్మాయిలు

గౌతమశ్రీ

స్నానం చేస్తున్నారు. విష్ణుశర్మ తన ఆత్మహత్యా ప్రయత్నాన్ని వాళ్లు చూస్తారేమోనని గట్టుమీద ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు. కాని వాళ్ళు విష్ణుశర్మవంక చూడనేలేదు. అందులో ఒక యువతి స్నానం చేసి నదిలోనే ఉండి, దేవా! ఈజన్మలో నాభర్త చక్రవర్తే అయినప్పటికీ విద్యాగంధం లేనివాడు. నేను విద్యావతిని. చదువురానివాడు చక్రవర్తి అయినా సామాన్యుడైనా ఒకటే. ఒకకోరిక కోరి త్రివేణిలో మరణిస్తే మళ్ళీజన్మలో సిద్ధిస్తుందంటారు! నాకు వచ్చేజన్మలోనైనా మంచి విద్యావంతుడైనవాడు భర్త అయేటట్లు చెయ్యి ప్రభూ" అని బుడుంగున నీటిలో మునిగిపోయింది.

విష్ణుశర్మ ఆశ్చర్యపడి చూస్తున్నాడు.

రెండవ యువతికూడా స్నానం చేసి చేతులు జోడించి "దేవా! నా భర్త అఖండపండితుడు. అయితే నేం? నిత్యం దరిద్రదేవత మాఇంట్లో మకాం వేస్తుంది. ఎంత పాండిత్యమైనా ధనం లేకపోతే రాణించదు. ప్రభూ! మళ్ళీ జన్మలోనైనా నాభర్త అఖండ ధనవంతుడైన చక్రవర్తి అయేటట్లు చెయ్యి" అని ఒక అరనిమిషం ధ్యానించి ప్రాణాల్ని నదికి అర్పించింది.

శర్మ కళ్ళు బాగా విప్పి చూస్తున్నాడాశ్చర్యంతో.

మూడవయువతికూడ నదిలో నిలబడి చేతులు జోడించి ఈవిసంగా అంది. "ఈశ్వరా! నాభర్త మహాపండితుడు. ధనవంతుడు. ఐతేనేం. కురూపి. రూపంలేక ఏమున్నా

ప్రధానం. నేనెంత రూపవతినైనా నా భర్త కురూపి అవడంవలన నా అందం వ్యర్థం. కాబట్టి తండ్రీ! వచ్చే జన్మలో నవమన్మథాకారుడైన భర్తని నాకుకలిగించు తండ్రీ!" అని బుడుంగున నీటిలో మునిగిపోయింది.

ఎల్లాగైనా ఆత్మహత్య చేసుకోదలచిన శర్మ తానుకూడా ఒక కోరిక కోరుకోవడం మంచిదనుకున్నాడు. కోరిక అనేసరికి అతని హృదయంలో ఎన్నో కదిలేయి. ధనం...ఆరోగ్యం... రూపవతి, విద్యావతి, అనుకూలవతి అయిన భార్య-అఖండ పాండిత్యం-చక్కని రూపం-చక్రవర్తిత్వం-ఎన్నో కోరికలు. కాని ఒక్క కోరిక కోరుకుంటేనే ఫలిస్తుంది. మొదట ధనం కోరుదా మనుకున్నాడు. కాని ఆరోగ్యంలేని ధనమెందుకూ? అని వెనుకాడేడు. పాండిత్యం లేని ఆరోగ్యం. నిర్గంథకుసుమంలాంటిది తనకి రూపం లేకపోతే రూపవతి ఎట్లారాణిస్తుంది? ఒకవేళ రూపవతి అయినా అనుకూలవతి కావాలి! ఆరోగ్యం, ధనంలేకపోతే చక్రవర్తిత్వం అనవసరం...

తెగని ఆలోచనతో సతమతమౌతున్నాడు విష్ణుశర్మ. రాత్రి పన్నెండుగంటలు దాటింది. ఇంక విసుగుపుట్టి ఇంటికిపోదా మనుకుంటూంటే అతని మెదడులో మెరుపులాంటి ఆలోచన తట్టింది! ఆనందముతో బ్రాహ్మణుడు గంతులు వేసేడు. తన తెలివిని తానే అభినందించుకున్నాడు. తన కింత మంచి ఆలోచన తట్టినందుకు దేవుణ్ణి తలచేడు.

వెంటనే చరచరా నదిలోకి నడచేడు. శుచిగా స్నానంచేసి చేతులు జోడించి, కళ్ళుమూసికొని "దేవదేవా! నేను మళ్ళీ జన్మలో ఇప్పుడు మరణించిన ఆ ముగ్గురు యువతులకూ భర్తనయేటట్లు అనుగ్రహించు" అని గభాల్న నీటిలో మునిగిపోయేడు.

* * *

పరాక్రమంలో అజేయుడై అఖండఖ్యాతి నార్జించిన జగదేకవీరుడు-రూపంలో జయంత, వసంత మన్మథ నలకూబరులను తలదన్నేవాడూ, ఐశ్వర్యంలో కుబేరుని ఆక్షేపించేవాడు, నిరుపమాన పాండితీప్రజ్ఞ కలిగినవాడు తరతరాలుగా భారతీయులకు గర్వకారణమైన భోజచక్రవర్తిగా ధారా నగరంలో మరుచటి జన్మలో ఆ బ్రాహ్మణుడు జన్మించేడు. మహాకవి చక్రవర్తియైన కాళిదాసాదులను ఆదరించిన భోజ మహీమండలాధిపతికి ఆముగ్గురు యువతులూ భార్యలయ్యేరు.

అఖండఖ్యాతినార్జించిన ప్రపంచ చక్రవర్తుల్లో ప్రథమస్థానాన్ని భోజ చక్రవర్తి ఆక్రమించేడు. ఆయన పాలనలో భారతదేశం స్వర్ణయుగాన్నను భవించింది. త్రివేణీ సంగమ మహామహిమవలన ఆనాటి రాత్రి ఆత్మత్యాగంచేసిన యువతుల కోర్కెలూ విష్ణుశర్మ అభీష్టము మహోదాత్తంగా సిద్ధించాయి. ★

'సత్యసంధుడు'

కశింకోట కామాక్షమ్మగారికి గోపీనాథరావనే కుమారుడున్నాడు. కామాక్షమ్మగారు రోజూ రాత్రి పడుకోబోయేముందు గోపీకి పురాణాల్లో కథలు చెపుతోండేది.

ఆవిడకు అన్ని కథల్లోకీ హరిశ్చంద్రుడి కథంటే చాలా ఇష్టం. "ఆ మహారాజు రాజ్యంపోయినా, భార్యను అమ్ముకోవలసివచ్చినా, కాటికాపరి కావలసివచ్చినా, కొడుకు చనిపోయినా— ఈలాగ ఎన్ని కష్టాలు వచ్చినాకూడా ధైర్యంతో భరించాడేకాని ఆడి తప్పలేదు. అందుకే ఆయనకు సత్యహరిశ్చంద్రుడనే పేరు వచ్చింది. నువ్వు కూడా ఆయనకుమల్లేనే ఎప్పుడూ అన్నమాట తప్పకూడదు" అని గోపీకి బోధించింది.

గోపీకి ఎందుకు అబద్ధమాడకూడదో తెలియకపోయినా తల్లి చెప్పింది గనుక అన్నప్రకారమే నడుచుకునేవాడు. కుర్రవాడు గనుక రోజూ ఏదో అల్లరిచేస్తోనే ఉండేవాడు. కాని నిజంచెప్పెయ్యటంవల్ల ఆమె వాణ్ణికోప్పడేదికాదు. పైగా మెచ్చుకొని ఏది కావాలంటే అది ఇచ్చేస్తుండేది. అందుచేత గోపీకి నిజం చెప్పడం లాభమే అనిపించింది.

ఒకనాడు వాడు నిజంచెప్పి, 'అమ్మా, నేను నిజంచెప్పేను గనుక నాకీరోజు మైసూరుపాకు చేసిపెట్టవే' అన్నాడు. ఆమె సరేనని పాకంచేసి కళాయిపళ్లెంలోపోసి, బిళ్లలుగాకోసి వాడికో రెండు పెట్టి తక్కినవన్నీ దాచింది.

దాచిందేకాని, గోపిచీటికీ,మాటికీ వచ్చి, 'ఇంకొక్కబిళ్ల పెట్టవే!' అంటూ ఒక్కొక్కటే పట్టుకుపోయి ప్రొద్దస్తమానం అలాగ తింటూనే ఉన్నాడు.

ఆరాత్రి కూడా కామాక్షమ్మగారు గోపీకి యథాప్రకారం కథలు చెప్పి, 'ఇంక నిద్రపోరా' అంది. వాడు, "అలాగే కాని, నాకొక్క మైసూరుపాకు ఇవ్వవూ?"అన్నాడు.

పాలంకి వెంకట రామచంద్రమూర్తి

ఆమె, అబ్బే, నువ్వు ఈరోజున చాలాతిన్నావు. ఇంకతింటే కడుపు నొప్పివస్తుంది. దాచి ఉంచుతాను రేపు తిందువుగానిలే' అంది.

వాడికా సలహా నచ్చలేదు. 'ఇప్పుడే ఇయ్యి. తలగడాకింద దాచుకుని పడుక్కుంటాను.' అని మారాంచేశాడు.

ఆలోచించింది. 'తలగడాకింద దాచుకుంటానంటున్నాడు. నిద్ర పట్టగాచూచి చీమలురాకుండా తీసి జాగ్రత్త పెడతాను.' అని నిశ్చయించుకుని, ఆమె వాడికొక బిళ్ల యిచ్చింది.

వాడు అన్నప్రకారం ఆముక్కను తలగడా క్రిందపెట్టి, తలగడాపైన తలపెట్టుకుని పడుకున్నాడు. కాని వాడి ధ్యానమంతా ఆ ముక్కమీదేవుంది, వాడికి నిద్రపట్టిందికాదు! 'తీసుకుని తినేద్దాం' అనిపించి రెండుమాట్లు లేచి తలగడా ఎత్తేడు. కాని హరిశ్చంద్రుని కథ జ్ఞాపకం వచ్చి, 'అన్నమాట జవదాటరాదు.' అన్న నీతి అడ్డు తగిలింది. అందుచేత వాడు మైసూరుపాకు తినకుండానే పడుకున్నాడు.

పరున్నాడేగాని నిద్రపట్టలేదు. ఉన్నట్లుండి వాడికొక ఆలోచన తట్టింది. వాడు టకీమనిలేచి తలగడాకింద భక్షణాన్ని తీసి 'గుటకాయ స్వాహా' చేసి పడుకున్నాడు!

కామాక్షమ్మగారు వంటిల్లు సవిరించుకుని, తలగడా కింద ముక్కనుతీసి దాద్దామని వచ్చేసరికి వాడింకా మెలకువగానే ఉన్నాడు. "ఏమిరా బాబీ, ఇంకా నిద్రపోలేదా?...అదేమిటి అదేమిటి తలగడాను తలకిందపెట్టుకోక బొజ్జమీదపెట్టుకున్నావేమిటి? మైసూరుపాకం ఎక్కడ దాచావు?" అని అడిగింది.

'తలగడా క్రింద' అన్నాడు గోపీ. ఆమె తలగడాను ఎత్తి, 'ఏదిరా, ఎక్కడ?' అంది.

'బొజ్జలో ఉందమ్మా. తినేసి, ఆబిళ్ల సరిగా తలగడాకింద కొచ్చేటట్లు దిండును బొజ్జమీద పెట్టుకున్నాను. అన్నప్రకారమే నడుచుకున్నాను కదూ!' అన్నాడు గోపీ.

కామాక్షమ్మగారు వాడి యుక్తికి ఆశ్చర్యపోయింది. ఆమె నవ్వుతో, 'హరిశ్చంద్రుడు కూడా నీలాంటి తెలివైన వాడైతే అన్ని కష్టాలు పడకపోయేవాడు!' అని మెచ్చుకుని గోపీకి అజీర్తి చెయ్యకుండా సీసాలోంచి కందిగింజంత క్రవ్యాది మాత్రతీసి మింగించింది. ★

సినిమా

1956లో దక్షిణభారత చిత్రాలు

మద్రాసు చలన చిత్రాభిమానుల సంఘం బహుమతులు

మద్రాసు చలనచిత్రాభిమానుల సంఘం వారు 1956 వ సంవత్సరంలో ఉత్తమ దక్షిణభారత చిత్రాలను, నటీనటులను, దర్శకులను ఎన్నికచేశారు. వీరిని జూన్ నెలలో సత్కరించబోతున్నారు. ప్రేక్షకులు ఏటేటా చలనచిత్ర కళాకారులను సత్కరించడం అనే సత్సంప్రదాయం తొలిసారిగా దేశం మొత్తంమీద మద్రాసులోనే ప్రారంభంఅయింది. చక్కగా కొనసాగుతోంది.

గతసంవత్సరంలాగా ఈసారికూడా వివిధ భాషాచిత్రాలు చూచి మంచివి నిరయించడానికై ఆయాప్రాంతాల ప్రముఖులతో ఉపసంఘాలు, నెలకొల్పారు. మొత్తంమీద అన్నిటికీ మద్రాసుప్రభుత్వ 'కార్యదర్శి శ్రీ కె. ఎం. లోబో ప్రభు అధ్యక్షుడుగా వ్యవహరించారు. ఈ సంవత్సరం కూడా తెలుగు కళాకారులు అన్యభాషాప్రాంతా



'అబ్ దిల్లీ దూర్ నహీ"లో ఒక సన్నివేశం.

లలో పేరుగడించుకున్నారు. ఇది వారి ప్రతిభకే కాక, ఈపరిశ్రమలో ప్రవర్తిల్లే సుహృద్భావానికికూడా మంచి నిదర్శనం.

ఈ సంవత్సరం ఫలితాలు :

ఉత్తమ చిత్రాలు

ప్రతిభావారి "ఏదినిజం?". (నిర్మాత ఘంటసాల కృష్ణమూర్తి, దర్శకుడు ఎస్. బాలచందర్); మాడర్న్ థియేటర్స్ వారి "అలీబాబా, 40 మంది దొంగలు" (తమిళం), చంద్రధరావారి "రారిచన్ ఎన్న పౌరాన్ (మలయాళం), జగన్నాన్ వారి "భక్తవిజయ" (కన్నడం), డాక్యుమెంటరీ-ఫిలింస్ డివిజన్‌వారి 'ఎర్త్ అండ్ వాటర్' (నిర్మాత డా|| పి. వి. పతి).

ఉత్తమ ఉత్తరభారత చిత్రం, ఆర్. కె. ఫిలింస్ వారి "జాగ్ తేరహో." విదేశీచిత్రం కొలంబియావారి "ఎడ్డీ డూచిన్ స్టోరీ". చిన్న నటీనటులతో చిత్రంనిర్మించి విజయం సాధించిన ఎస్. కె. ఫిలింస్ వారికి ప్రత్యేక బహుమతి ఇస్తారు. ఆ చిత్రం పేరు "కులదైవం".

దర్శకులు

వేదాంతం రాఘవయ్య (భలేరాముడు") తాపీ చాణక్య ('కాలం మారిపోచు'), పి. భాస్కరన్ (మలయాళ చిత్రం), పి. వి. మాణిక్యం (కన్నడ).

నటీనటులు

అంజలీదేవి ("చరణదాసి" చిత్రంలో నటనకు), భానుమతి ('రంగూన్‌రాధ' అనే తమిళ చిత్రంలో నటనకు), జానకి (భాగ్యోదయ), అంబిక (కూడపిరప్పు).

ఎ. నాగేశ్వరరావు ("భలే రాముడు"లో నటనకు), శివాజీ గణేశన్ (రంగూన్‌రాధ), సత్యన్ (అవర్ ఉణరుణ్ణు), రాజకుమార్ (భక్తవిజయ-కన్నడ). ఉత్తరాది నటులలో అశోక్‌కుమార్ ('బందిష్') ఎన్నికయ్యాడు. సహాయ నటులలో తెలుగు చిత్రాలకు రేలంగి ("భలే రాముడు"), సూర్యకాంతం ("ముద్దుబిడ్డ") ఎన్నికయ్యారు.

"బందిష్" లో నటించిన డెయిసీఇరానీ ఉత్తమచలన బాలనటిగా ఎన్నికయింది.

మొత్తం 50 చిత్రాలను నిర్ణాయక సంఘం వారు చూచారు.

తెలుగు చిత్రాలను చూచిన సంఘంలో శ్రీమతి యు. కృష్ణరావు, శ్రీయుతులు ఖాసా సుబ్బారావు, డా|| చిట్టూరి సత్యనారాయణ, వి. వి. రామదురై సభ్యులు.

ఏప్రిల్ 12న హోటల్ దాసప్రకాష్‌లో ఈ నిర్ణాయక సంఘాధ్యక్షుడు శ్రీ లోబో ప్రభు గౌరవార్థం సభ జరిగింది. సంఘకార్యదర్శి ఇ. బి. శామ్యూల్ ఆసందర్భంలో బహుమతి ఫలితాలను ప్రకటించారు. సంఘాధ్యక్షురాలు రాజమ్మాళ్ అనంతరామన్ స్వాగతం చెబుతూ చలనచిత్రాలకు లోపరహితమైన కథలు తయారుచేయించడానికై సలహా సంఘం ఒకటి నెలకొల్పాలనీ, దక్షిణ భారతానికిఫిలింబోర్డు ప్రత్యేకం నెలకొల్పి ప్రేక్షకుల అభిరుచుల గురించి, చలన చిత్రాల ప్రభావం గురించి పరిశోధనలు జరిపించడానికి ఒకశాఖను ఏర్పాటు చేయాలనీ సూచించారు. పిల్లలకై ప్రత్యేకం చలన చిత్రప్రదర్శనశాల నిర్మించడానికి తగిన స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీ లోబో ప్రభు తాము ఈ బహుమతులకు అర్హులను నిర్ణయించిన విధానాలను వివరిస్తూ నేటి మన చలనచిత్రాలస్థాయి పెంపొందడానికి అనుసరించతగు మార్గాలు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన మద్రాసు ఆర్థిక మంత్రి సి. సుబ్రహ్మణ్యం చిత్రాల సంఖ్యతోపాటు స్థాయీ పెరగాలన్నారు. దర్శకుడు కె. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పై సంవత్సరానికి బాల చలన చిత్రాలు పుష్కలంగా తయారుచేయగలమని బాల చలనచిత్రసంస్థ తరఫున చెప్పారు.

ఈ చిత్రాలు విడుదలచేయడానికి స్థలం లభించడమే ఒక పెద్ద ఇబ్బందిగా ఉన్నదనీ, ఈ రాష్ట్రంలో ప్రభుత్వం అందుకు వసతులు కల్పించి మిగతా ప్రాంతాలకు మార్గదర్శకం కావాలని కోరుతున్నామనీ అన్నారు. అనంతరం అమెరికన్ సమాచారశాఖవారు రెండు డాక్యుమెంటరీ చిత్రలను ప్రదర్శించారు.



రాజశ్రీ వారి "దాంపత్యం" లో నవదంపతులు విజయకుమార్, వరలక్ష్మి.

సోవియట్ చిత్రోత్సవం

మద్రాసులో మార్చి 31 వ ప్రారంభమైన సోవియట్ చలన చిత్రోత్సవం ఈ నెల 11న పరిసమాప్తమైంది.

నగరంలో రెండు థియేటర్లలో ప్రదర్శించిన ఈ చిత్రాలను వేలాది జనం చూచి ఆనందించారు ఈ ఉత్సవాల పేరిట మొత్తం ఎనిమిది చిత్రాలు చూపించారు వీటిలో ఒకటి చారిత్రక చిత్రం ఒకటి ఆహ్లాదకరమైన రంగులలో చిత్రించిన పెద్ద డాక్యుమెంటరీ 1956 వ సంవత్సరపు సోవియట్ క్రీడోత్సవాలను ఇందులో చిత్రించారు

టూ ఫ్రెండ్స్ అనేపిల్లల చిత్రం ఒకటి కూడా ప్రదర్శించారు ఇదికాక, 'బంగారు లేడి' అనే భారతీయగాథను చక్కని రంగులలో చిత్రించారు. అన్నిటిలోను 'రూమ్యాన్ త్సేవ్ కేస్" అనే వర్ణచిత్రం బహుళ ప్రజాదరణ పొందింది ఈ ఒక్క చిత్రాన్ని నాలుగు సార్లు ప్రదర్శించారు. దీని తరువాత అంతగా మెప్పు లందుకున్న మరో గొప్ప చిత్రం "ట్వెల్ఫ్త్ నైట్."

ఉత్సవంలో తొలిరోజున "స్కాందర్ బర్గ్" అనే చారిత్రక చిత్రాన్ని ప్రదర్శించారు. 15వ శతాబ్దారంభంలో ఆల్బేనియా స్వాతంత్ర్యానికై టర్కీ చక్రవర్తి రెండవ మురాద్‌ను ఎదిరించి పోరాడిన వీరుడి కథ. ఇతణ్ని చక్రవర్తే పెంచి పెద్ద చేశాడు ఇస్కందర్ అని బిరుదునిచ్చి సైన్యాధిపతి చేశాడు. ఇలా పదవి, భోగాలూ ఎంతగా ఎరపెట్టినా 'స్కాందర్ బర్గ్' మాతృదేశాన్ని మరువలేక, చక్రవర్తిని వదలి వెళిపోయాడు బాల్కన్ రాజ్యాధిపతు లందరినీ ఆకట్టుకుని స్వాతంత్ర్యానికై సమరం సాగించాడు; సాధించాడు. ఈ సమరదీక్ష ఎంతగా వంటబట్టి పోయిందో చెప్పడానికి ఒక చిన్న సన్నివేశాన్ని కల్పించారు ఈ చిత్రంలో.

స్కాందర్ బర్గ్ వృద్ధుడైపోయాక ఒక రోజున, భార్య అతడి దరిచేరి 17 ఏళ్ల క్రితం ఏంజరిగిందో జ్ఞాపకముందాఅని అడుగుతుంది.


"ఆ లేకేం అప్పుడు తొలిసారిగా సుల్తాన్‌ను ఎదిరించాం" అంటాడు స్కాందర్.

"నువ్వెప్పుడూ ఇంతే ఎంతసేపు యుద్ధాలూ, సంధులూ, కత్తులూ కటార్లూ అంటావు 17 ఏళ్ళ క్రితం ఈరోజున మనం వివాహం చేసుకున్నాం" అంటుంది భార్య ఈ చిత్రంపొడుగునా ఇలా సున్నితమైన హాస్యాన్ని చొప్పించారు.


స్కాందర్ బర్గ్ కథను సాఫీగా సూటిగా చిత్రించారు ఇందులో విశేషం యుద్ధాల చిత్రణ ఇటీవల ఏ చిత్రంలోను యుద్ధ సన్నివేశాల చిత్రణ ఇంత భారీఎత్తున కట్టుదిట్టంగా చూపడం జరగలేదనిపిస్తుంది.

"స్ప్రింగ్ ఫ్రాస్ట్స్" అనేది సాంఘిక చిత్రం విప్లవాత్పూర్వకాలంలో జరిగిన కథ

మాదరా అనే ఒకయువతి పాటిరైతు బిడ్డని ప్రేమిస్తుంది అక్కడి పెద్దభూ స్వామందు



శర్వాణీవారి "అక్కచెల్లెళ్లు" చిత్రంలో రమణారెడ్డి, కృష్ణకుమారి, సి. ఎస్. ఆర్.



సారథీవారి "పెద్దరికాలు" లో పెరుమాళ్లు, అంజలి, లీలాబాయ్

ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటాడు. అతడు శతవృద్ధు.

"నెమ్మెలాగా ఆరేటి కాలం బతకను మహా అయితే నాలుగేళ్లుంటానేమో ఆపైన నా యావదాస్తికీ రాణివవుతావు ఆపైన నీయిష్టం వచ్చినట్టుండచ్చు" అని ఆశపెడతాడు డబ్బులేనివాణ్ణి కట్టుకుని కాముకునే దేమిటంటాడు మాదరా తనకు తోచినట్టు ఆలోచించి, మొదట ఐశ్వర్యాన్ని కట్టుకుని అనక ప్రియుణ్ణి పెళ్లాడా లనుకుంటుంది ఆమె ప్రియుడు ఈ ధోరణికి ఏవగించుకుని మనసు రాయిచేసుకొని దూరప్రాంతాలకు వెళ్ళిపోతాడు

మాదరా సుఖంగానే జీవితం సాగిస్తూ ఉంటుంది ఒకకొడుకు పుడతాడు నాలుగేళ్ళలోగా మరణిస్తానని హామీ యిచ్చిన ముసలిభర్త పదేళ్ళయినా నిక్షేపంలా ఉంటాడు

మాదరా ఒకరోజున యాదృచ్ఛికంగా ప్రియుణ్ణి కలుసుకుంటుంది వెంటనే వెంటబెట్టుకువచ్చి తనయింట కొలువు ఇప్పిస్తుంది తిరిగి తన అనురాగాన్ని తెలియపరుస్తుంది గాని, అతడు ఆమెను త్రోసిరాజంటాడు అతడు, చిన్ననాటి నేస్తం లీయనా అనే ఇంకో అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడ దలచాడని మాదరాకు తెలుస్తుంది మాదరా ఆమెకు డబ్బిచ్చి మరో ఊరుకు వెళ్ళిపొమ్మంటుంది కాని ఆ ప్రయత్నం సాగదు ఇంతలోకి భర్తకు ఇదంతా తెలిసి, రభసచేసి, ఆ ఆయాసంతోనే కన్నుమూస్తాడు

పోతూ పోతూ ఆస్తి తన కొడుకుపేర రాస్తాడు. తన చిన్ననాటి ప్రియుడు ఇకనైనా తనను స్వీకరించక పోవడానికి కారణం, తన ఆస్తికి కొడుకు వారసుడు కావడమే ననిపిస్తుంది మాదరాకి కన్నతల్లి కాబట్టి చేతులారా చంపలేక పోయినా, ఆ పిల్లవాడు అతి ప్రమాదకరమైన ప్రాంతాలకి వెళ్లుతున్నాడని తెలిసికూడా వారించకుండా ఉదాసీనంగా ప్రవర్తిస్తుంది కన్నకొడుకు నెమ్మదిగా మృత్యు గహ్వరంలోకి వెళ్తూ ఉంటే చూస్తూ ఊరుకుంటుంది ఆ పిల్లవాడు చివరకి అంతపనీ చేస్తాడు

"ఇంక ఆ అభ్యంతరం కూడా లేదు ఇప్పుడు మనం సుఖపడవచ్చు ఇందుకోసమే నేను ముందర ఖామందును పెళ్ళాడాను ఇదంతా నీ కోసమే" అంటుంది మాదరా ప్రియుడి దగ్గరకు వెళ్ళి.

"ఛీ డబ్బుతో నువ్వు ప్రేమను కొనచూశావు నా దగ్గర ఈమాట ఇంకెన్నడూ ఎత్తకు నువ్వేనాడో పరాధీనవు అయిపోయావు నేనింక నీ ఎదుట ఉండను" అంటాడు ప్రియుడు తరవాత లీయనాని వెంటబెట్టుకుని ఇంకో చోట పని వెతుక్కుని బ్రతకడానికి వెళ్లిపోతాడు

మాదరా మనసారా ఇతన్నే ప్రేమించినా సౌఖ్యాన్ని డబ్బుతో కొలిచి, డబ్బుని వరించింది చివరికి డబ్బే మిగిలింది

భర్త, కుమారుడు, ప్రియుడు అంతా వెళ్ళిపోయారు మాదరా కూడా ఆత్మహత్య చేసుకుంది మాదరావంటి మనుషులమీద మనకు జాలే పుడుతుంది తప్ప అసహ్యం కలగదు. ఈ కథ చిత్రణా శిల్పం అంతా ఆ సంగతినే హృదయాన్ని కదలించేలా తెలియ చెబుతుంది

* * *

రుమ్యాంత్సేవ్ కేస్ అనే చిత్రంలో రక్తికట్టించడానికి అవసరమైనంత మాత్రంగా సేరాలు, దానికి తగినంత ఉత్కంఠ ఉన్నా నరాలు బిగించుకుని పళ్లు గిటకరచుకు కూచుని అవస్థపడకుండా ఆద్యంతం సున్నితమైన హాస్యం చక్కగా పోషించి కథను నడిపిం

రష్యాలో చిత్రనిర్మాణ విధానాలు

ప్రదేశ్రకితం సాలుకు పాతికచిత్రాలు తయారుచేసిన సోవియట్ చలనచిత్ర కారులు ఈనాడు, దాదాపు 90 వరకూ నిర్మిస్తున్నారు. వీటిలో ఏడెనిమిదిపెద్ద డాక్యుమెంటరీలు. ఇవికాక, పిల్లలచిత్రాలు, కార్టూన్‌లు విరివిగా తయారవుతూ ఉంటాయి. రష్యాలో చలనచిత్ర పరిశ్రమ ప్రభుత్వాధ్వర్యంక్రింద నడుస్తోంది. అందు కని, అక్కడిపద్ధతులు వేరు. ప్రతిపనీ అనవసరపు తొందరపడకుండా, లోపాలకు ఆస్కారంలేకుండా నిర్వహించబడుతుంది. సోవిక్స్పోర్ట్ ఫిలిం ప్రతినిధి గస్కావ్ మొన్న దక్షిణభారత ఫిలిం రచయితల సంఘంలోమాట్లాడుతూ అక్కడి పరిశ్రమ స్థితిగతులను వివరించారు...

రష్యాలోమొత్తం 30 స్టుడియోలున్నాయి. ఉన్నవాటిలో మాస్ ఫిలింస్టుడియో పెద్దది. కథాచిత్రాలతోపాటు తగినన్ని డాక్యుమెంటరీలు, కార్టూన్‌లు, పిల్లలచిత్రాలు, విజ్ఞానశాస్త్రం తెలియచెప్పే బోధనా ప్రధానచిత్రాలు తయారుచేస్తారు. విదేశీయుల కథలను తీసుకోవడంగాని, అనుకరించడంగాని అరుదు. ఇతరదేశాల



"అబ్ దిల్లీ దూర్ నహీ" లో యాకూబ్.

ప్రజలగురించి తెలుసుకోడానికి వీలుగా కొన్నిచిత్రాలనుమటుకు దిగుమతి చేసి ప్రదర్శిస్తారు.

నటీనటులనుబట్టి వాళ్ళు కథలు తయారుచెయ్యరు. ప్రభుత్వ సంస్కృతివ్యవహారాల శాఖ అధ్వర్యాన ఒక లలితకళా సంఘం పనిచేస్తూంటుంది. సినిమాతీయడానికి కథకావాలని ప్రకటిస్తారు. అయా కథలపై రచయితల పేర్లు తీసివేసి, కథలనుమాత్రం "ఆర్ట్ కమిటీ"కి అందచేస్తారు. ఆసంఘం నిష్పాక్షికంగా కథలను చదివి, యోగ్యమైనవాటిని నిర్ణయిస్తుంది.

తరువాత కథను చిత్రించతగ్గ దర్శకుడిని నిర్ణయిస్తారు. అప్పుడు దర్శకుడు, రచయిత కలసి 'షూటింగ్' స్క్రిప్ట్ వ్రాస్తారు. రచన పూర్తిఅయిన తరువాత, ఆయిద్దరూ కొన్నాళ్ళు దేశంలో పర్యటిస్తారు. నటీనటులకై వివిధ ప్రాంతాలలో, నాటకాలు చూచి, అక్కడినుండి తగినవారిని ఏరుకొంటారు. ఈవిధంగా తమకు తోచిన వారందరినీ పిలిపించి, రచయిత, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు పరీక్షిస్తారు. వారితో కొన్ని వందల అడుగుల చిత్రాలు 'షూట్' చేసి, వాటిని, ఆర్ట్‌కమిటీకి పంపిస్తారు.

ఆసంఘం నటీనటుల విషయమై తుది నిర్ణయాలు చేసుంది. అక్కడనుండి రెండు మూడు నెలలు 'రిహార్సల్స్' జరుగుతాయి. ఆఘట్టంలోని సౌలభ్యాన్నిబట్టి, సబబూ బేసబబునిబట్టి నటీనటులుకూడా తమకు తోచిన సూచనలు చేస్తారు. అవి యోగ్యమైనవైతే దర్శకుడు వాటిని పాటిస్తాడు.

ఈవిధంగా, తాపీగానేఅయినా లోపరహితంగానూ కట్టుదిట్టంగానూ సన్నాహాలు చేయడంవల్ల ఒక్కొక్క కథాచిత్రం తయారుకావడానికి ఏణ్ణర్ధంనుంచి రెండేళ్ళ వరకూ పడుతుంది.

చిత్రణలోకూడా, సెట్స్‌తో సర్దుకుపోకుండా సాధ్యమైనంతవరకూ కథ జరిగిన స్థలాలకే వెళ్ళి షూటింగ్ సాగిస్తారు. ఒక్కొక్కసారి, కథ శీతకాలంలో జరిగినట్టుంటే, ఆ వాతావరణాన్ని సమగ్రంగా చిత్రించడంకోసం శీతకాలంవచ్చేదాకా ఆగి సాధ్యమైనంత సహజంగా చిత్రిస్తారట.

చిత్ర నిర్మాణం రెండేళ్ళు పట్టడానికి ఇవే కారణాలు తప్ప, డబ్బు అందక పోవడం, తారలకు తీరిక లేక పోవడం మటుకు కాదు. ఎంత గొప్ప నటీనటులైనాసరే ఒక్కొకసారి మూడు చిత్రాలకుమించి పని చేయడం ఉండదు. అదీనా ఈ పూట ఒక కాల్‌షీట్ పనిచేసి, రెండోపూట మరో తరహా వేషంవేసే పద్ధతి లేదు.

ఒక చిత్రంలో పనిమొదలు పెడితే హీనపక్షం రెండు నెలలు అందులో నేపనిచేస్తారు.

ఆర్జన అనేది ఆయా నటీనటుల ప్రతిభ హోదాలనుబట్టే ఉంటుంది. మామూలుగా నెలకు రు. 2400 జీతం ఇస్తారు.

తయారైనచిత్రం ఉత్తమశ్రేణిది అనిపించుకుంటే, వీరందరికీ, మళ్ళీ పెద్ద మొత్తాలు బహుమానంగా ఇస్తారు. ఈ బహుమతులు అరవై డబ్భైవేల వరకూ ఉంటూ ఉంటాయి. ఈ పద్ధతి నటీనటులకేకాక, కళాకారులందరికీ వర్తిస్తుంది.

సాధారణంగా ఏ చిత్రమూ పదివేల అడుగులకు మించదు. ఒక్కో చిత్రానికి రెండు మూడు వందల ప్రతులు తీసి (15 భాషల లో) విడుదల చేస్తారు ★

సోవియట్ చిత్రాలు

వారు. ఆహ్లాదకరమైన ప్రణయగాథ దీనికి ఆధారం. నేరాలు, వాటిచిత్రణ ద్వితీయస్థానం ఆక్రమిస్తాయి. ఒకలారీడ్రైవరు ఒకవైద్య విద్యార్థినిని ప్రేమిస్తాడు. వాళ్ళ పెళ్ళిలోగా కథ కొంత అడ్డం తిరుగుతుంది. ఒక దొంగలముఠా పన్నాగంలో ఈ అమాయక జీవి ఇరుక్కుంటాడు. నిందితుడుగా ఖైదులో పడుతాడు. అతడు నిర్దోషి అని చెప్పి, తప్పించగల వ్యక్తి ఒకడున్నాడు. అతడు ఈ డ్రైవరుతో పని చేసేవాడే. అయినా లేని పోని చిక్కులు మనకెందుకన్న తరహాలో సాక్ష్యం ఇవ్వడు. పనివారంతా ఇది తెలిసి అతణ్ణి వెలివేస్తారు. సంఘజీవిగా విద్యుక్తధర్మం నెరవేర్చని ఆ వ్యక్తి ఇందులో ముఖ్యమైన విలన్ అనిపిస్తుంది. చివరకు దొంగలు దొరుకుతారు. కథ నిక్షేపంలా కంచికి వెళ్లుతుంది. అది నడిచిన విధమే, అతి ఆహ్లాదకరంగా, స్మరణీయంగా ఉంది.

ఈ చిత్రాలన్నిటా కథకు, దాని చిత్రణకూ అత్యధిక ప్రాధాన్యం కనబడుతుంది. వినోదంకోసమని వికారమైన పనులు ఎక్కడా చెయ్యరు. నటీనటులంతా, అత్యంత ప్రశంసనీయమైన విధాన, ఎక్కడా మితిమీరకుండా నటించారు.

మొత్తంమీద ఈ ఉత్సవాలు పేరిట, ఉత్తమశ్రేణి సోవియట్ చలన చిత్రాలను చూచే మంచి అవకాశం మద్రాసు పౌరులకు లభించింది. ★

అదీ - ఇదీ

భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ వారు 1956-57 సంవత్సరంలో మొత్తం 61 డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించారు. ఇవి కాక, ఇతరులు కాంట్రాక్టుపై నిర్మించినవి మరి 18 ఉన్నాయి.

1948 లో ప్రభుత్వం ఈ భారం స్వీకరించిన నాటినుండి, వార్తాచిత్రాలు వారానికొకటి చొప్పున తయారవుతున్నాయి. వీటితోపాటే డాక్యుమెంటరీనిర్మాణం ప్రారంభించారు. వీటి ప్రదర్శన ఒక పెద్ద సమస్య అయిపోయింది. నిర్మాణ వ్యయం రాబట్టుకోవడానికై వసూళ్లలో ప్రభుత్వం కొంత వాటా కేటాయించమని అడగడంతో రాజ్యాంగంలో పారస్పర్యాలూ మొదలైనవన్నీ చర్చనీయాలు అయ్యాయి. సినిమాధిపతులు కోర్టులకెక్కారు. ప్రభుత్వం పట్టుపట్టి, నెగ్గుకొచ్చింది. మద్రాసు రాష్ట్రంలో ఒక చట్టంచేశారు. కొన్ని ప్రాంతాలలో ఈ సమస్య ఇంకా పరిష్కృతం కానేలేదు. ప్రదర్శనకి ఈవిధమైన అవరోధాలు ఉండటం, ప్రయివేటు నిర్మాతలు ఇందుకు ముందుకు రాకపోవడానికి ఒక కారణమైంది.

ప్రభుత్వమే ఈ కార్యం నిర్వహిస్తూ వచ్చింది. గత పదేళ్లుగా ఈ డాక్యుమెంటరీల సంఖ్యతోపాటు స్థాయికూడా క్రమంగా పెరిగింది. 'ఖజురాహో', 'కాశ్మీరులో వసంతోదయం' 'సింఫనీ ఆఫ్ లైఫ్' వంటి చిత్రాలు అంతర్జాతీయ ఖ్యాతినందుకొన్నాయి. ఇటు దేశంలోను ప్రజలు నిన్నటికన్న నేడు ఎక్కువగా వీటిపట్ల అభిమానం చూపుతున్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం క్రమంగా డాక్యుమెంటరీలు, వార్తాచిత్రాలూ మాత్రమే చూపించే పద్ధతిపై ఢిల్లీలో ఒక ప్రదర్శనశాల ఏర్పాటుచేసి నడపడానికి ఒక పథకం వేసింది. అలాగ, ప్రస్తుతానికి ఉన్న పెద్ద నగరాలన్నిటా థియేటర్లు ఏర్పాటు చేయడానికి కృషిచేస్తే ఈ డాక్యుమెంటరీలు కేవలం వాటి బలంమీదనే వాణిజ్య స్థాయిలో నడవడానికి దోహదం జరుగుతుంది. అటువంటివాటిని, కొంతకాలం పాటు శాల చలనచిత్రాల ప్రదర్శనకూ, హ్రస్వచిత్రాల ప్రదర్శనకూ, పెద్ద థియేటర్లలో చోటు సంపాదించుకోలేని విదేశీయ ఉత్తమ చిత్రాలను కళాభిమానులు, విద్యావంతులూ చూచే అవకాశం కలిగించడానికి కూడా వినియోగించుకోవచ్చును. పెద్ద చిత్రాలచాటునే కాక ఇవి ఇలా స్వతంత్రంగా నిలబడగలవని క్రమేణా రుజువు చేయడం అత్యంత వాంఛనీయం.



రాజ్‌శ్రీ ప్రొడక్షన్సు వారి రెండవ చిత్రం "సతీ అనసూయ" లో రేలంగి.

* * *

చలనచిత్ర నిర్మాణం ప్రారంభమైననాటి నుండి నేటివరకూ తయారైన వాటిలో కళాఖండాలన్న తగ్గ వాటిని ఏరి, వాటిలోని ఉజ్వలసన్నివేశాలను సేకరించి, ఒక్క చిత్రంగా రూపొందించితే అది అఖండమైన కళాఖండంగా నిలబడుతుంది. చిరస్మరణీయంగా ఉంటుంది. సమగ్ర సింహావలోకనంగా భాసిస్తుంది. ఫ్రాన్సులో అటువంటి చిత్రం ఒకటి తయారవుతోంది. ఈ సంకలనాన్ని, నటీనటుల ప్రతిభ ప్రాతిపదికగా నిర్వహిస్తున్నారు.

ఈ తరంవారు వినడమే తప్ప, కని ఎరుగని కీర్తిశేషులైన ఉత్తమ నటీనటులను తిరిగి తెరమీద చూపించడం, వారి నటనాకౌశలం, కళావైదగ్ధ్యం, వారు చలనచిత్ర చరిత్రలో ఉజ్వలఘట్టాలను సృష్టించిన విధం తెలియచెప్పేరీతిన, ఆయా నటీనటుల చిత్రాలలో ఉత్తమ సన్నివేశాలను ఏరి ఈ చిత్రంలో రూపొందిస్తారట. ఈ విధంగా ఉత్తమ నటులు, భౌతికంగా చనిపోయినా, వారికీర్తి కాయాలు చిరస్థాయిగాఉండగలవనీ 'తారలు' అన్న పదం వారి విషయంలో సార్థకమయినదనీ నిరూపిస్తారు. అందుకుతగ్గట్టే ఈ సంకలనానికి "తారలు ఎన్నటికీ ఆరవు" అని పేరు పెట్టారు. ★

సినిమా వార్తలు

ద్వారకా పిక్చర్స్ అనే క్రొత్త సంస్థ ఒకటి వెలసింది. వీరు సాంఘిక చిత్రం నిర్మిస్తున్నారు. ఉగాదిరోజున పూజ చేశారు. ఈ చిత్రానికింకా పేరుపెట్టలేదు. సదాశివ బ్రహ్మం కథ వ్రాశారు. మాటలూ పాటలూ సముద్రాల జూనియర్ వ్రాస్తున్నారు. సంగీత దర్శకుడు రమేష్ నాయుడు. ఛాయాగ్రహణం లక్ష్మణ్ గోరే. ఎడిటింగ్ తిలక్. దర్శకత్వం శోభనాద్రి. నిర్మాత శేషగిరిరావు.

* * *

ప్రతిభావారి క్రొత్త చిత్రం "దొంగలున్నారు జాగ్రత్త" శ్యామలా స్టుడియోలో చురుకుగా తయారవుతోంది. జి. వరలక్ష్మి, జగ్గయ్య, గుమ్మడి, సి. ఎస్. ఆర్, శివరావు, లంకసత్యం, రాజనాల, గిరిజ, హేమలత పాల్గొంటున్నారు. దర్శకుడు బి. ఎస్. ఆర్. రచన ఆత్రేయ. నిర్మాత ఘంటసాల కృష్ణమూర్తి.

* * *

సారధివారి సాంఘిక చిత్రం "పెద్దరికాలు" ఈ నెల 25 న విడుదల అవుతోంది. తాపీ చాణక్య దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో అంజలి, గిరిజ, జగ్గయ్య, డా॥ గోవిందరాజు సుబ్బారావు, రేలంగి, పెరుమాళ్ళు మొదలగువారు పాల్గొన్నారు. రచన శార్ల చిరంజీవి. సంగీతం వేణు. నిర్మాత రామకృష్ణ ప్రసాద్.

* * *

శర్వాణివారి "అక్కచెల్లెళ్లు" త్వరలోనే విడుదల కాబోతోంది. శ్రీరంజని, కృష్ణకుమారి, సూర్యకాంతం, లక్ష్మీకాంత, అమర్‌నాథ్, సి. ఎస్. ఆర్, రాజనాల, రమణారెడ్డి, వంగరగోపీనాథ్, మాస్టర్ బాలు నాగేశ్వరరావు మొదలగు వారు పాల్గొంటున్న ఈ చిత్రానికి సార్వభౌమ, అమానుల్లా దర్శకత్వం నిర్వహిస్తున్నారు. కథ: అనంత్ మాటలు పాటలూ శ్రీశ్రీ, ఆరుద్ర వ్రాశారు. సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. నిర్మాతలు గోపాల్ రెడ్డి) పద్మనాభరావు.

* * *

వరసూవారి "భలేఅమ్మాయిలు" నిర్మాణం పూర్తికావచ్చింది. సావిత్రి, గిరిజ నటిస్తున్నారు. జగ్గయ్య రేలంగి ప్రభృతులు పాల్గొంటున్నారు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. సంగీతం రాజేశ్వరరావు. నిర్మాత వి. ఎల్ నరసు.

* * *

భారతీ ప్రొడక్షన్స్ వారి తెలుగు చిత్రం "బభ్రువాహన"లో రామారావు, అంజలి రాజసులోచన సి. ఎస్. ఆర్. ముక్కామల, పేకేటి మొదలగు వారు నటిస్తున్నారు. దర్శకుడు సముద్రాల రాఘవాచార్య. ఛాయాగ్రహణం కమల్ ఘోష్, సంగీత దర్శకుడు పామర్తి, పర్యవేక్షణ ఘంటసాల. కళ: వాలి. నిర్మాతలు ఎ. వి. రమణమూర్తి, ఆరణి సత్యనారాయణ. ★

★ పరమశివార్చన ★

(28-వ పేజీ తరువాయి)

రాదు! వేళ దాటిపోకుండా తిరిగి పూజాభిషేకాల కుపక్రమించండి!"

అవంతివర్మకు మంత్రిమాట లెంతో ఆశ్చర్యం కలిగించాయి. ఆశ్చర్యం పట్టలేక అడిగాడు :

"ఆ బందిపోటు దొంగలనందరినీ అప్పుడే బంధించివెయ్యడం జరిగిందా?"

"ఆఁ. జరిగిపోయింది! నేను బ్రతికి ఉన్నంతకాలమూ తమ ధర్మశాసనం కాశ్మీరంలో అంతటా అప్రతిహతంగా సాగిపోవాలిసిందే!"

మహారాజు మరింత ఆశ్చర్యపడ్డాడు. మంత్రితో కలిసి భూతేశ్వర దేవాలయంలో ప్రవేశించి తిరిగి శివపూజాభిషేకాలకు సంకల్పం ప్రారంభించాడు.

పూజకు కావలిసిన సంభారాలన్నీ మంత్రి అంతకుపూర్వమే సిద్ధం చేయించాడు. అంత శీఘ్రంగా బందిపోటు దొంగలను బంధించిన మంత్రి శక్తిసామర్థ్యాలు తెలుసుకొని మహారాజు కొంతసేపటివరకు అలాగే నిర్ఘాంతపోయాడు. ఆపైన అక్కడ అమర్చిన శివపూజా సంభారాలు, పూజాద్రవ్యాలు చూచి మరింత సంతోషించాడు.

పిమ్మట తిరిగీ యథావిధిగా శివార్చన ప్రారంభమైనది. మంత్రి ఒక్క క్షణంవరకు అక్కడే నిలబడ్డాడు. తరవాత కొంచెం అత్యవసర వ్యవహారమేదో ఉన్నదని చెప్పి తిరిగి తన స్కంధావారానికి వెళ్ళిపోయాడు. అవంతివర్మ యథావిధిగా భూతేశ్వరస్వామి పూజాభిషేకాలు ముగించుకొని నెమ్మదిగా అడుగులువేస్తూ తిరిగి తన స్కంధావారానికి బయలుదేరాడు. మార్గంలో అతని కొక భీభత్సం కనిపించింది. అదిచూచి మహారాజు నోటమాటలేక అలాగే నిలబడిపోయాడు.

భూతేశ్వరాలయానికి ఒక పార్శ్వంలో అమ్మవారి ఆలయము, మరి ఒక పార్శ్వంలో భైరవాలయము ఉన్నాయి.

మహారాజు భైరవాలయం ముందునించే తన స్కంధావారంవైపు సాగిపోతున్నాడు. వెడుతూవెడుతూ స్వామి కొకమారు సవినయంగా చేతులు జోడించి నమస్కరించాడు.

భైరవస్వామి కెదురుగా అమర్చిన బలిపీఠంపై అతనికొక మానవశిరస్సు కనబడింది. అది అప్పుడే ఖండించిన శిరస్సు! కంఠనాళాలలోనించి రక్తధారలింకా సన్నసన్నగా ప్రవహిస్తూనే ఉన్నాయి. మహారాజు ముఖంపై పొకమారు పరిశీలనగా చూశాడు. అయినా అతని సందేహం తీరలేదు.

ప్రక్కనే చేతులు జోడించి వెంట వెంట నడిచివస్తున్న ఒక రాజ పురోహితునివైపు చూచాడు:

"అది ఎవరు?"

"మహామంత్రి దత్తకుమారులు ధన్య మహాప్రభూ!"

మహారాజొక్క క్షణంవరకు మాటలాడలేకపోయాడు. వెంటనే ఎంతో ఆత్రంగా ప్రశ్నించాడు:

"ఇతని కీశిక్ష ఎవరు విధించారు?"

"మహామాత్యులు శూరమంత్రి."

"కారణం?"

"అతడు బందిపోటు దొంగలతో కలిసి నిన్న రాత్రి వేళ భూతేశ్వరాలయంలో అమ్మవారి స్వర్ణకలశాలు, హారాలు అన్నీ అపహరించాడు. ఈ వేళ మీ పూజకు పూర్వమే దండనాధు డతన్ని బందిపోటు దొంగలతోసహా బంధించి ఇక్కడకు తీసుకువచ్చాడు."

అవంతివర్మ కా క్షణంలో అదంతా బోధపడిపోయింది. పిసాకథ నేవ్వ ఆబందిపోటు దొంగలతో కలసి గతరాత్రివేళ భూతేశ్వరాలయంలో దొంగతనానికి కొడిగట్టాడని దత్తపుత్రుడని అయినా ఆలోచించకుండా మంత్రి వెంటనే అతనికా దారుణమరణశిక్ష విధించాడనీ గ్రహించుకొన్నాడు.

ఆక్షణంలో అతనికి శూరమంత్రి ఆకృతి సాక్షాత్తు భూతేశ్వరస్వామి మూర్తిగానే స్ఫురించింది. హృదయంలోనే అతనికి చేతులు జోడించి నమస్కరించాడు. వెంటనే మంత్రి భవంతికివెళ్ళి ఆయనదర్శన భాగ్యం పొంది మహాశివరాత్రి సాఫల్యం పొందవలెనని అనుకున్నాడు. ముమ్మందుగా భూర్జపత్రంపై స్వహస్తాలతో మంత్రిపేర ఒకలేఖ రచించాడు. లేఖ ముగించి అది మనస్సులో ఒకమారు చదువుకొన్నాడు :

"పరమమాహేశ్వరులు, కాశ్మీర మహామాత్యులు అయిన శూరవరేణ్యుల పాదపద్మ సన్నిధికి :

"తా మింతకుపూర్వం వారణాసికివెళ్ళి పరమశివార్చనలోనే తమ అంతిమ జీవితం అంతా గడిపివెయ్యాలని ఎంతైనా ఉత్సహించారు.

"నేను తాముమెట్టిన శ్రీనగరమే వారణాసి అనేభావంతో దాని కంగీకరించలేదు.

"ఇక ఇప్పటినించీ మీ కీ మహామాత్య భారం తీరిపోయింది. కాని ఇకనించీ ఈ కాశ్మీర రాజ్యానికి తామే పట్టాభిషిక్తులు! నేను మీసన్నిధి నొక అమాత్యమాత్రుడను మాత్రమే!

ధర్మమూర్తి అయిన భూతేశ్వర స్వామి అర్చనానిరతిలో నేను మీకన్న మిన్న అని అనుకొన్నాను. కాని నేటితో ఆ అహంభావం అంతా పటాపంచలై పోయింది. ఇకనించీ ఈ విషయంలోకూడా నేను కేవలం మీపాదరేణువునే!"

పిమ్మట రాజాధికారులా భూర్జపత్రలేఖపై రాజముద్రిక ముద్రించారు. ఆక్షణంలో అవంతివర్మ కవోష్ణబాష్ప లొకటి రెండా లేఖపై ముత్యాల ముద్రికలై నిలిచాయి. రాజదర్శనానికిముందే ఆ లేఖ మహామంత్రికి చేరిందని వేరే వ్రాయనక్కరలేదుగదా!

—సమాప్తం.

మాండవి

(16-వ పేజీ తరువాయి)

కృశించిపోయింది. అదీగాక చిక్కి శల్యావశిష్ఠ అయిన మాండవిని చూచి మరింత శోకంలోన కుమిలిపోయేది. మాండవి అత్తగారిని ఓదార్చి పండ్లు, ఫలాలు భుజింపచేస్తూండేది. అత్తగారి బలవంతాన భర్త తినగా మిగిలినవి తాను స్వీకరిస్తూండేది.

రోజు రోజుకు భరతుని ఆవేదన ఎక్కువైంది. అన్నగారు క్షేమంగా తిరిగి రావాలనే ఆతృత ఒకవైపు, దినదినమూ కృంగి కృశించి కుమిలిపోతూన్న మాండవిని గూర్చిన ఆవేదన ఒకవైపు అతని హృదయాన్ని కలతపెట్టినవి.

*　　　*　　　*

వనవాసంనుంచి మరలివస్తున్న రామవిభునికి స్వాగతమివ్వడానికి పురజనులందరితో బయల్దేరాడు భరతుడు. నగరిలోకి ఆబాలవృద్ధులూ శ్రీరాముని దర్శనార్థం గుమిగూడి ఉన్నారు. కాని మాండవి తన ఆశ్రమాన్ని శుభ్రం చెయ్యడంలోనే లీనమైపోయింది.

ప్రజలు తన బంధు మిత్రాదులు, మంత్రి సామంతులు మొదలైనవారందరూ వచ్చి తన్నెదుర్కొన్నప్పటికి శ్రీరామునికి ఏదో లోటు కన్పించింది.

"భరతా!" అన్నాడు శ్రీరాముడు, భరతుడు మౌనంగా నమస్కరించాడు.

"భరతా! మా తల్లి కైకేయి ఏది? మాండవి ఏది?" అని ప్రశ్నించాడు.

భరతుడు మాట్లాడలేదు. అతని మౌనం శ్రీరామచంద్రుని కలవరపెట్టింది. వారిద్దరిపై భరతునికిగల క్రోధాన్ని, కరుణాహీనతను గుర్తించాడు. భరతుడు తనభావములను శ్రీరాముడు గుర్తించకుండగా వెనుదిరిగి సుమంత్రిని వారిద్దర్నిలోడ్కొని రమ్మని ఆజ్ఞాపించాడు. కాని వెంటనే శ్రీరాముడు, "భరతా! బాగున్నది. నీవు వారిపట్లచూపుతూన్న మర్యాద, ఆదరమూను. నీవే స్వయముగావెళ్ళి పిల్చుకొనిరమ్ము! లేకపోతే నేనే వారిని దర్శించ వెళ్ళుతాను. ఏంజరిగినా విధివశమని నీవింకా తెలుసుకోన

లేదుగాబోలు! నీతల్లి నన్ను వనవాసానికి మాత్రమే పంపినది. కాని నీకోసం కనిపెట్టుకొని ఉన్నకన్నతల్లిని నిరాకరించావు, నిందించావు. ఎంతపాపానికి ఒడిగట్టావు? మాండవి నీఅర్ధాంగి. సహధర్మిణి. సుఖదుఃఖాలను నీతో సమానంగా అనుభవించవలసిన బాధ్యురాలు. నేరంచేసిన భార్యను క్షమించడం పతిధర్మం. నిరపరాధిని దండించడం ఏ న్యాయశాస్త్రాలలో చదివావు? స్వమాత, స్వపత్నిపట్ల న్యాయమును ధర్మమును గుర్తించని నీవు రాజ్యభారం ఎట్లా నిర్వహించావు? వెళ్ళు వెంటనే వారిని తోడ్కొని రా!" — అన్నాడు శ్రీరామచంద్రుడు.

"అన్నా! నా అజ్ఞానం నశించింది. మీవంటి సకలగుణపరిపూర్ణులైన సహోదరుణ్ణి పొందడం నా అదృష్టమే," అని భరతుడు ఒక్క పరుగులో ఆశ్రమాన్ని చేరుకున్నాడు.

ఎప్పటివలె మాండవి భరతుని పాదాలను కడిగి పూలతో పూజించింది. వానచినుకుల్లాగ ఆమెపై బొటబొట అశ్రుకణాలు రాలినవి. మాండవి దిగ్భ్రమతో తలెత్తింది. భరతుడు కన్నీళ్ళతో, "మాండవీ!" అని ఆమెను చేరదీశాడు.

మాండవి పట్టరాని ఆనందంతో ఆశ్రమమంతా పరుగులెత్తింది. కైకేయి దగ్గరికి వెళ్ళి ఆమెను గట్టిగా కౌగలించుకొని, "అమ్మా! అమ్మా! అమ్మా! నా ప్రభువు నన్ను అనుగ్రహించారు," అంటూ పొంగిపోయింది. ఆ ఆనందోద్రేకంతో భరతుని పాదాలదగ్గర మూర్ఛిల్లిపోయింది. కైకేయి భరతుడు మాండవిని అనుగ్రహించడం చూసి ఆనందించింది.

కైకేయిని చూడగానే శ్రీరామచంద్రుడు ప్రణమిల్లినాడు. సీత మాండవిని పలకరించింది. తర్వాత శ్రీరాముడు నవ్వుతూ, "భరతా! పాదుకారాజ్యానికి నువ్విలాటు తెస్తావని అనుకోలేదు," అన్నాడు. భరతుడు భయంతో, "ఏమైందన్నయ్యా! అట్లా అంటున్నారు?" అన్నాడు.

"నేరస్తులను అపరాధాలను విచారించకుండానే కఠినశిక్షవిధించి నీతల్లిని, పత్నిని, శల్యావశిష్టులుగాజేశావు. నీతల్లిని, భార్యను చూస్తే "తల్లిని భార్యను సుఖపెట్టలేనివాడు ప్రజలను ఎట్లాసుఖపెట్టగలడని లోకమనదు," అన్నాడు. భరతుడు సిగ్గుపడ్డాడు.

అయితే మాండవి "బావగారూ! పద్నాలుగేండ్లు కంటికి నిద్దురలేక మీ రాకకోసమే కాచుకుకూర్చున్న మీ అనుగు [illegible]ండి. ప్రజలసుఖాన్నే ఎల్లకాలం కన్నిపెట్టుకొని ఉన్నందువల్ల, తల్లిని భార్యను చూడడానికి తీరిక దొరకలేదు. అంతే!" అన్నది.

మాండవిమాటలకు భరతుడు ఆశ్చర్యపడిపోయాడు. అప్పుడు ఆమెత్యాగాన్ని గుర్తించాడు.

"మాండవీ! మంచిమాట పలికావు. ఎల్లప్పుడు భర్తనేరాలను కప్పిపుచ్చడం భార్యలకు సహజధర్మమేకదా!" అన్నాడు శ్రీరామచంద్రుడు మందహాసంతో.

*　　　*　　　*

సరస్వతీదేవి బ్రహ్మదేవుని అనుజ్ఞపొంది తొందరగా బయల్దేరింది. ఆరోజు వాల్మీకి రామాయణం వ్రాయడానికి పూనుకొంటాడు. సకలలోక కళ్యాణార్థం ఆ కావ్యపరిసమాప్తికి సరస్వతిసహాయం చేయాలి. సరస్వతి వస్తూన్నప్పుడు ఎవరో పిల్చారు. ఆధ్వని వచ్చిన దిక్కు చూసింది. పూజాగృహంలో మాండవి పిల్చింది. సరస్వతి ఆమెకు ప్రసన్నురాలైంది.

"మాండవీ! నన్నెందుకు పిల్చావు? నేడు వాల్మీకి రామాయణం రచిస్తున్నాడు. నేను ఆ మహామునికి సహాయపడవలెను. అందుకోసమే వేగంగా పోతున్నాను," అంది.

"దేవీ! నాకొక వరమనుగ్రహించాలి."

"ఏమివరము కావాలి మాండవీ?"

"దేవీ! వాల్మీకిరామాయణంలో మాండవి భరతుని పత్ని అనే వివరము తెలియబరిస్తే చాలు. తక్కిన నాసంగతులు వివరించరాదు. ఇదే నా ప్రార్థన."

"అదేమిటి మాండవీ! రామాయణకథలో సీతా, ఊర్మిళలకన్న నీవు మిన్నవైతివే! నీ సతీధర్మం, క్షమ, సేవాభావం ప్రశంసనీయమైనవేకాక, స్త్రీలోకానికే ఆదర్శప్రాయమైనవి. ఇటువంటి ఉత్తమచరితవైన నిన్ను విడిచి ఆదర్శగ్రంథం రామాయణ రచన ఎట్లాసాగుతుంది?"

"దేవీ! నాసేవ నిష్కామమైనది. కీర్తిని, గౌరవాన్ని ఆశించి నేను సేవజేయలేదు. అది నాధర్మం. అదీగాక నావృత్తాంతం వివరించడంవల్ల నిరపరాధియైన భార్యను భరతుడు దుఃఖపెట్టినాడన్న అపఖ్యాతి నాభర్తకు కలగవచ్చు. అందుకు నేను సమ్మతించను. కాబట్టి తల్లీ, నాకు వాగ్దానమివ్వు! నా ప్రార్థనను చెల్లించు," అని మాండవి వేడుకున్నది.

సరస్వతి ఆశ్చర్యపరవశురాలయింది. "ఆహా! స్త్రీల సౌజన్యం ఎంతగొప్పది!" అనుకొని వాల్మీకాశ్రమానికి ప్రయాణమైంది.

—తమిళరచనను అనుసరించి]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.


అతి సౌందర్య తిలకంగా నుండుటకు
ఆకర్షణీయమైన సౌందర్య వికాసముతో మనోహరముగా
పొందు పుచ్చుడు. ఎల్లప్పుడూ సంతృప్తిగాను,
చల్లగాను, శుభ్రంగాను ఉండుడు . చర్మమును
పోషించు నట్టిది, పొదరు ఆధారమునకు దివ్య
మైనట్టిదియగు "'హేజ్ లైన్' స్నో" ను ఉపయోగించుడు.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్ లైన్' స్నో" (ట్రేడ్ మార్క్)
HAZELINE SNOW
For the Skin
బరోస్ వెల్కమ్ అండ్ కం. (ఇండియా) ప్రైవేట్. లి.
పి. ఒ. బాక్స్ 290, బొంబాయి.